UNIVERSAL LIBRARY
OU_204779
UNIVERSAL LIBRARY

శ్రీ.

ధ్రువోపాఖ్యానము

బమ్మెర పోతనామాత్య కవిసింహ ప్రణీతము.

టీకాతాత్పర్యసహితము.

పండితులచే పరిష్కరింపఁబడినది.

ప్రకాశకులు.

ఆర్య పుస్తకాలయము,

రాజమహేంద్రవరము.

1926.

కాపీరైటు.]

[వెల ౧౦ అణాలు.

జగపతీ ప్రింటింగు వర్క్సు యందు,

ముద్రితము.

1926

శ్రీ హయగ్రీవాయ నమః

ధ్రువోపాఖ్యానము.

శ్రీకాంతా ప్రస్తావము

క. విను మఖిలభువన పరిపా
లనమునకై చంద్రధర ♦ కళాంశుండై
వనజజునకు స్వాయంభువ
మనువప్పు డుదయించెఁ గీర్తి ♦ మంతుం డగుచున్, 1

అర్థము. విను=వినుము; నిఖిల, భువన, పరిపాలనమునకై=లోకములన్నిటిని ఏలుటకొరకు; చంద్రధర, కళా, అంశుండు, ఐ=చంద్రుని ధరించిన శివునియొక్క తేజముతోఁ గూడియున్నవాఁడై; వనజజునకున్=(విష్ణుమూర్తి నాభియందలి పద్మమునందు పుట్టిన) బ్రహ్మకు; కీర్తిమంతుండు, అగుచున్=కీర్తితోఁ గూడినవాఁడై; స్వాయంభువమనువు=(స్వయముగా పుట్టిన బ్రహ్మకొడుకయిన) స్వాయంభువుఁడనెడి మనువు; అప్పుడు=అప్పుడు; ఉదయించెన్=పుట్టెను.

తా. మైత్రేయుఁడు విదురునితోఁ జెప్పుచున్నాఁడు "విదురా, వినుము, సమస్తలోకములను ధర్మమార్గమునఁ బరిపాలించుటకొఱకు శివుని తేజము ధరించి, యశముఁ గీర్తిని గాంచి, బ్రహ్మకు కుమారుఁడై స్వాయంభువమనువు పుట్టెను."

తే. గీ. దాని కిమ్మనువునకు శత ♦ రూపవలన
భూనుతులగు ప్రియవ్రతో ♦ త్తానపాదు
లనఁగ నిద్దఱు పుత్రులై ♦ రందులోన
భవదూరాత్ముఁ డుత్తాన ♦ పాదునకును. 2

అర్థ. రూఢిన్ = ప్రసిద్ధముగునట్లు, అమ్మనువునకున్ = ఆస్వాయంభువమనువునకు; శతరూపవలనన్ = శతరూప అను భార్యయందు; ప్రియవ్రత, ఉత్తానపాదులు = ప్రియవ్రతుఁడును, ఉత్తానపాదుఁడును; అనఁగన్ = అను పేళ్లతో; భూనుతులు, అగు = భూమియందు పొగడ్తగన్న; ఇద్దఱు పుత్త్రులు, ఐరి = ఇద్దఱు కొడుకులు పుట్టిరి; అందులోనన్ = వారిద్దఱిలోను; భవ్యచారిత్రుఁడు = ఎన్నికగన్న నడవడిగలిగిన; ఉత్తానపాదునకును = ఉత్తానపాదునికి (ముందుపద్యముతో నన్వయము.)

తా. ఆస్వాయంభువమనువునకు అతనిభార్యయగు శతరూపకును ప్రియవ్రత, ఉత్తానపాదులను పేర్లుగలవారును, మంచినడవడిగలవారును నగు నిద్దఱు కొడుకులు పుట్టిరి. ఆయిద్దఱిలో ఉత్తానపాదునకు

క. వినుము సునీతియు సురుచియు
నను భార్యలుగలరు; వారి ♦ యందును ధ్రువుసం
గనిన సునీతియు నప్రియ
యును, సురుచియుఁ బ్రియయు నగుచు ♦ నున్నట్టియెడన్.

అర్థ. వినుము = వినుము; (ఉత్తానపాదునకు;) సునీతియున్, సురుచియు, అను, భార్యలు, కలరు = సునీతి, సురుచి అను భార్యలుండిరి; వారియందున = వారిద్దఱిలో; ధ్రువుఁగనిన సునీతియు, అప్రియయును = ధ్రువుని తల్లియైన సునీతి ఉత్తానపాదునకు ఇష్టురాలు కాకుండెను; సురుచియు, ప్రియయును = సురుచి అను భార్య ఇష్టురాలును; అగుచున్, ఉన్నట్టి, ఎడన్ = ఆయుండుచుండఁగా (ముందుపద్యముతో నన్వయము.)

తా. ఉత్తానపాదునకు సునీతి, సురుచి, అను నిద్దఱు భార్యలుండిరి. వారిలో ధ్రువునితల్లియైన సునీతి భర్త కిష్టురాలు కాదు. సురుచి యిష్టురాలైయుండెను. ఇట్లుండఁగా—

సీ. ఒకనాఁడు సుఖలీల ♦ నుత్తానపాదుఁడు
సెజ్జఁ బ్రియురాలైన ♦ సురుచిగన్న

కొడుకు నుత్తముఁ డన • తొడలపై నిడికొని
యుపలాలనము సేయు • చున్న వేళ
నర్థిఁ దదారోహ • ణాపేక్షితుండైన
ధ్రువుఁ గనుంగొని • తివుట నాద
రింపకుండుటకు గ • ర్వించి యా సురుచియు
సవతిబిడ్డండైన • ధ్రువునిఁ జూచి

తే. గీ. తండ్రితొడ నెక్క వేడుక • తగిలెనేని
పూని నాగర్భమున నాఁడె • పుట్టకన్య
గర్భమునఁబుట్టి కోరినఁ • గలదె నేఁడు
జనకుతొడ యెక్కు భాగ్యంబు • సవతికొడుక. 4

అర్థ. ఒకనాఁడు=ఒకదినమున ; సుఖలీలన్=సౌఖ్యముగా ; ఉత్తానపాదుండు=ఉత్తానపాదుఁడు ; నెఱెన్=ప్రియముతో ; ప్రియురాలైన, సురుచి, కన్న, కొడుకున్=తనకిష్టురాలయిన సురుచియందు పుట్టినకొడుకగు ; ఉత్తమున్=ఉత్తముఁడనువానిని ; తనతొడలపైన్, ఇడికొని=తనతొడలమీఁద నుంచుకొని ; ఉపలాలనము, చేయుచున్న వేళన్=ముద్దులాడుచుండఁగా ; అర్థిన్=కోరికతో ; తత్, ఆరోహణ, అపేక్షితుండు, ఐన=ఆతొడలమీద నెక్కుటకు అభిలాషపడుచున్న ; ధ్రువునిన్=ధ్రువుని ; కనుంగొని=చూచి ; తివుటన్=ప్రేమతో ; ఆదరింపకుండుటకున్, గర్వించి=చేరదీయలేదుగదా అని గర్వముపొంది ; ఆసురుచియు=ఆసురుచి ; సవతిబిడ్డండు, ఐన, ధ్రువునిన్, చూచి=తన సవతియైన సునీతికొడుకయిన ధ్రువునిచూచి ; తండ్రితొడన్ ఎక్క, వేడుక=తండ్రితొడపైనుండు ఉత్సాహము ; తగిలెనేనిన్=పుట్టినట్టయితే ; పూని=కోరికతో ; నా, గర్భమునన్=నాకడుపులో ; నాఁడ=మొదటనే ; పుట్టక=జన్మింపక ; అన్యగర్భమునన్=మఱియొకతె

కడుపున ; పుట్టి=పుట్టి ; నేఁడు=ఈదినమున ; కోరినన్=కావలెననిన; సవతికొడుక=నా సవతిపుత్త్రుఁడవగు ధ్రువుఁడా ; జనకుతొడ, ఎక్కు, భాగ్యంబు=తండ్రితొడపైఁ గూర్చుండు భాగ్యము ; కలదె=కలుగునా?

తా. ఒకనాఁ డుత్తానపాదుఁడు సౌఖ్యముగాఁ గూర్చుండి తన ప్రియురాలగు సురుచి కొడుకయిన ఉత్తముని తొడపైనుంచుకొని ముద్దులాడుచుండఁగా ధ్రువుఁడును అతనితొడపైఁగూర్చుండ నుత్సహించుచుండెను. అతనిని ఉత్తానపాదుఁడు ఆదరించలేదు అదిచూచి సురుచి గర్వముతో ధ్రువునిజూచి ,,ధ్రువుఁడా, సవతికొడుకా, నీకు తండ్రితొడ నెక్కవలెనని యున్నదా ? అట్టి ఉత్సాహముగలవాఁడవు మొదట నాగర్భమునందే పుట్టియుండిన బాగుండెడిది. అట్లుపుట్టక యిప్పుడు తండ్రితొడపైఁ గూర్చుండు భాగ్యము కావలెననిన కలుగునా?

క. అదిగాన నీ వధోక్షజు
పదపద్మము లాశ్రయింపు ♦ పాయక హరి నా
యుదరమునఁ బుట్టనిచ్చును
వదలక యట్లయిన ముదము ♦ కలిగెడి నీకున్. 5

అర్థ. అది, కానన్=అందుచేత; నీవు=నీవు; అధోక్షజు=ఇంద్రియములను జయించినవారికి ప్రత్యక్షమగు శ్రీమహావిష్ణువుయొక్క ; పదపద్మములు=పద్మములవంటి పాదములను ; ఆశ్రయింపు=ఆశ్రయించుము ; పాయక=తప్పక ; హరి=ఆవిష్ణువు ; వదలక=నిన్నువిడిచిపెట్టక ; నా, ఉదరమునన్=నాగర్భమునందు ; పుట్టనిచ్చును=పుట్టునట్లుచేయును ; అట్లు, అయినన్=అట్లునీవు నాగర్భమున జనించినయెడల ; నీకున్=నీకు ; ముదము, కలిగెడిన్=నీకు సంతోషము కలుగును.

తా. అందుచేత నీవు తపస్సుచేసి శ్రీవిష్ణువుయొక్క పాదపద్మములు నాశ్రయించినయెడల శ్రీహరి నిన్ను తప్పక నాగర్భమునందు పుట్టునట్లుచేయును. అట్లు నీవు నాగర్భమునందు పుట్టినయెడల నీకు సంతోషము కలుగును.

క. అని యీరీతి నసహ్యా వ
చనములు పినతల్లి యప్పుడు ♦ జనకుఁడు వినఁగాఁ
దను నాడిన దుర్భాషా
ఘనశరములు మనమునాటి ♦ కారియఁబెట్టన్. 6

అర్థ. అని=ఇట్లు; ఈ, రీతిన్=ఈప్రకారముగా; అప్పుడు=అప్పుడు; జనకుఁడు, వినఁగాన్=తండ్రి వినుచుండఁగానే; పినతల్లి=సవతితల్లియైన సురుచి; అసహ్యవచనములు=సహింపరాని మాటలను; తను=తన్ను; ఆడిన=పలికిన; దుర్భాషా, ఘన, శరములు నాటి=చెడుమాటలనెడు గొప్పబాణములు; మనము=మనస్సునందు నాటి; కారియన్, పెట్టన్=హింసింపఁగా.

తా. ఇట్లు తనపినతల్లియైన సురుచి సహింపరానిమాటలను తన తండ్రి వినుచుండఁగనే తన్ను పలుకఁగా ధ్రువు డాకఠినవచనముల నెడు బాణములు తనమనస్సున నాటి హింసింపఁగా-(ముందుపద్యముతో నన్వయము)

క. తను నట్లుపేక్ష సేసిన
జనకునికడఁ బాసి దుఃఖ ♦ జలనిధిలోనన్
మునుఁగుచును దండతాడిత
ఘనభుజగముఁబోలె రోష ♦ కలితుండగుచున్. 7

అర్థ. తనన్=తన్ను; అట్లు=అవిధముగా; ఉపేక్ష, చేసిన=అనాదరముచేసిన; జనకుని, కడన్=జనకునియొదుట; పాసి=వదలి; దుఃఖ, జలనిధిలోనన్=దుఃఖసముద్రములో; మునఁగుచున్=మునుఁగుచు; దండ, తాడిత=కఱ్ఱతో కొట్టఁబడిన; ఘన, భుజగము, పోలెన్=గొప్పసర్పమువలె; రోష, కలితుండు, అగుచున్=మిక్కిలిఆగ్రహముపొందినవాఁడై- (ముందుపద్యముతో నన్వయము.)

తా. ఇట్లు తన్ను నాదరించిన తండ్రియెదుటనుండి వెడలిపోయి, దుఃఖసముద్రములో మునుఁగుచు కఱ్ఱచే కొట్టబడిన గొప్పసర్పమువలె కోపము బొంది.

క. ఘనరోదనంబు సేయుచుఁ
గనుఁగవలను శోకబాష్ప ♦ కణములు దొరఁగన్
జనకునికడ కేఁగుటయును
తనయునిఁగని యాసునీతి ♦ దద్దయుఁ బ్రేమన్. 8

అర్థ. ఘనరోదనంబు, చేయుచు=గట్టిగా ఏడ్చుచు; కనుఁగవలను=కన్నులవెంబడి; శోక, బాష్పకణములు=దుఃఖమువలనకలిగిన కన్నీటిబొట్టులు; దొరఁగన్=రాలుచుండఁగా; జననికడకు, ఏఁగుటయును=తల్లియొద్దకుపోఁగా; తనయునిన్, కని=తనకుమారునిచూచి; ఆ, సునీతి=ఆసునీతి; దద్దయున్, ప్రేమన్=ఎక్కువైనప్రేమతో.

తా. ధ్రువుఁడు గట్టిగా నేడ్చుచు, కన్నులవెంబడి దుఃఖాశ్రువులు రాలుచుండఁ దల్లియొద్దకు పోఁగాఁ ఆసునీతి తనకుమారునిజూచి మిక్కిలి యుఁబ్రేమతో- (ముందుపద్యముతో నన్వయము)

అర్థ. తొడలపైన్, ఇడికొని=తొడలమీఁద కూర్చుండఁబెట్టుకొని.

క. కరమనురక్తిని మోము ని
విరి తద్వృత్తాంతమెల్ల ♦ నెలఁతులు సంతతి
పురవాసులుఁ జెప్పిన విని
పఱపుగ నిట్టూర్పులెసఁగ ♦ బాష్పాకులయై. 10

అర్థ. కరము, అనురక్తిన్=మిక్కిలిఅనురాగముతో; మోము, నివిరి=మొగముతడివి; తద్, వృత్తాంతము, ఎల్లన్=ఆసంగతియం

తయు, వెలఁదులును=స్త్రీలును; అంతఃపురవాసులును=అంతఃపురము నందలివారును; చెప్పఁగన్=చెప్పఁగా; విని=విని; పలుపుగన్=విస్తారముగా; నిట్టూర్పులు=దీర్ఘనిశ్వాసములు; ఎసఁగన్=ఎక్కువయగునట్లు; బాష్ప, అంబు, ఐ=కన్నీటిచేత కలఁతనొందినదై

తా. సునీతి మిక్కిలి మక్కువతోఁ దనకుమారుని మొగముతుడిచి, జరిగినవృత్తాంతమంతయు చెలికత్తెలును అంతఃపురవాసులును జెప్పఁగావిని నిట్టూర్పులువిడుచుచు, కన్నీరుకార్చుచు-(ముందుపద్యముతోనన్వయము)

తే. గీ. సవతి యాడిన మాటలు ♦ సారెఁ దలఁచి
కొనుచుఁ బేర్చినదుఃఖాగ్నిఁ ♦ గుందుచుండె
దావపావకశిఖలచేఁ ♦ దగిలి కాంతి
వితతిఁ గందిన మాధవీ ♦ లతికవోలె. 11

అర్థ. సవతి=తనసపత్నియైన సురుచి; ఆడిన=పలికిన; మాటలు=మాటలను; సారెన్=పలుమారు, తలఁచికొనుచు=జ్ఞప్తికి తెచ్చుకొనుచు; పేర్చిన=ఎక్కువయగుచున్న; దుఃఖ, అగ్ని=దుఃఖమనెడి యగ్నిచేత; దావ, పావక, శిఖలచేన్=కార్చిచ్చుమంటలచే; తగిలి=ఆవరింపఁబడి; కాంతి, వితతిన్=కాంతిసమూహమును; కందిన=పోగొట్టుకొన్న; మాధవీ లతిక, పోలెన్=[illegible]ందతీఁగవలె; కుందుచుండెన్=దుఃఖించుచుండెను.

తా. తనసవతియైన సురుచి పలికినపలుకులను మాటిమాటికిఁ దలంచుకొనుచు, దుఃఖమతిశయించుచుండఁగా, కార్చిచ్చుమంట లంటుకొనిన మాధవీలతవలె మిక్కిలి కాంతిమాసి శోకించుచుండెను.

అర్థ. అంతన్=పిమ్మట; ఆసునీతి=సునీతి; బాలకున్, కాంచి=కొడుకగు ధ్రువునిచూచి; తండ్రీ, దుఃఖింపకుము=నాయనా; విచారించకుము; అని, ఇట్లనియె=అనిపలికి తిరిగియిట్లు చెప్పెను.

తా. అప్పుడా సునీతి ధ్రువునిఁ జూచి, నాయనా, విచారింపవలదు, అని పలికి మాటల నిట్లు చెప్పెను.

కం. అనఘా! యీదుఃఖమునకుఁ
బనిలే దన్యులకు సొలయ ♦ బలవంతంబై
తన పూర్వజన్మ దుష్కృత
ఘన కర్మము వెంటనంటఁగా ♦ నెవ్వలనన్. 12

అర్థ. అనఘా = పాపములేనివాఁడా, ధ్రువుఁడా; ఏ, వలనన్ = అన్ని విధములచేతను; అన్యులకున్, సొలయన్ = ఇతరులచే బాధపడవలయునని; బలవంతంబై = దాఁటశక్యముకానిదై; తన, పూర్వజన్మ, దుష్కృత, ఘన, కర్మము = తనపూర్వజన్మమందు చేసికొనిన పాపమువలనఁగలిగిన గొప్ప కర్మము; వెంటనంటఁగా = వెంటననుసరించి యుండగా; దుఃఖమునకుఁబనిలేదు = ఈదుఃఖముపొందుటవలన కార్యములేదు,

తా. పాపరహితుఁడా! ధ్రువుఁడా! మనపూర్వజన్మమునందు చేసిన పాపకర్మఫలమును ఇతరులవలన మనము బాధపడవలెనని యుండఁగా ఈదుఃఖమునందేమి ప్రయోజనము?

వ. కావున.

అర్థ. కావునన్ = అందుచేత.

కం. పెనిమిటిచేతను బెండ్లా
మని కాదు, నికృష్టదాసి ♦ యనియును బిలువం
గను జాలని దుర్భాగురా
లగు నాకడుపున నుదయ ♦ మందిన కతనన్. 15

అర్థ. పెనిమిటిచేతను = భర్తచేత; పెండ్లామని కాదు = భార్య అనికాక; నికృష్ట, దాసి, అనియును = నీచదాని అనియైనా; పిలువం

గనుచాలని=పిలుచుటకుఁదగని ; దుర్భగురాలు, అనఁగల=దురదృష్ట
రాలంతులు అని పిలుచుటకుఁదగిన ; నాకుక్షిన్=నాగర్భమునందు ; ఉ
దయమందిన కతనన్=పుట్టుటవలన.

తా. భర్త నన్ను భార్యయని పిలువకుండుట యటుండ ఓ నీచ
దాసీ! అనికూడ పిలుచుటకుఁదగని నాయట్టి దురదృష్టవంతురాలి కడు
పునఁబుట్టితివి గనుక-(ముందుపద్యముతో నన్వయము.)

క. నిను నాడిన యా సురుచి వ
చనములు సత్యంబులగును ♦ సర్వశరణ్యం
డనఁగల హరిచరణంబులు
గను జనకునియంక మెక్కఁ ♦ గానఁ దలఁతేనిన్. 16

అర్థ. నినున్, ఆడిన=నిన్నుదూషించినట్టి ; ఆ, సురుచి, వచన
ములు=ఆసురుచిమాటలు ; సత్యంబులు, అగును=సత్యమైనవే , సర్వ
శరణ్యండు, అనఁగల=సమస్తప్రాణకోటికిని శరణు జొచ్చుటకు వీలగు
వాఁడనఁగల ; జనకుని, అంకము, ఎక్కఁగాన్,తలఁతు, ఏనిన్=తండ్రి
తొడపై నెక్కుటకు కోరినయెడల ; హరిచరణంబులు, కనుము=శ్రీమ
హావిష్ణుని పాదములనాశ్రయింపుము.

తా. నిన్ను దూషించుచు సురుచిపలికిన పలుకులన్నియు సత్యం
బులే. నీవు నీతండ్రితొడపై నెక్కఁగోరితివేని సమస్తప్రాణములకును
రక్షకుడగు శ్రీహరిపాదముల నాశ్రయింపుము.

వ. కావునం బినతల్లియైన యా సురుచియాదేశంబున నధో
క్షజు నాశ్రయింపుమని వెండియు నిట్లనియె. 17

అర్థ. కావునన్=అందుచేత ; పినతల్లి, ఐన=సవతితల్లియగు;
ఆ, సురుచి, ఆదేశంబునన్=ఆసురుచి ఆజ్ఞప్రకారము ; అధోక్ష
జున్=ఇంద్రియములను జయించినవారికి సులభుఁడైన శ్రీహరిని ; ఆశ్ర

యింపుము, అని=శరణము వేఁడుము అని; వెండియున్, ఇట్లు, అనియెన్=తిరిగి యిట్లు చెప్పెను.

తా. అందుచేత నీవు నీసవతితల్లియైన సురుచియాజ్ఞాప్రకారము జితేంద్రియుఁడవై శ్రీహరి నాశ్రయింపు మని తిరిగి యిట్లుపలికెను.

సీ. పరికింప నీవిశ్వ ♦ పరిపాలనమునకై
యర్థి గుణవ్యక్తుఁ ♦ డైనయట్టి
నారాయణుని పాద ♦ నలినముల్ సేవించి
తగ బ్రహ్మ బ్రహ్మప ♦ దంబునొందె;
ఘనుఁడు మీ తాత యా ♦ మనువు సర్వాంతర
యామిత్వమగు నేక ♦ మైనవృత్తిఁ
జేసి యాగముల య ♦ జించి తా భౌమసు
ఖములను దివ్యసు ♦ ఖముల మోక్ష
సుఖములను బొందె; నట్టి య ♦ చ్యుతుని బరుని
వితతయోగీంద్రనికర సం ♦ వేద్యమాన
చరణసరసిజయుగళు శ ♦ శ్వత్ప్రకాశు
భక్తవత్సలు విశ్వసం ♦ పాద్యు హరిని. 18

అర్థ. పరికింపన్=పరీక్షింపఁగా; ఈ, విశ్వ, పరిపాలనమునకై=ఈజగత్తునంతటిని పరిపాలించుటకొఱకు; అర్థిన్=కోరికతో; గుణవ్యక్తుఁడు, ఐనయట్టి=గుణములచేతనే తెలియుటకువీలయిన; నారాయణుని=నారాయణమూర్తియొక్క; పాదనలినముల్=పాదపద్మములను; సేవించి=ఆశ్రయించి; తగన్=ఒప్పునట్లుగా; బ్రహ్మ=బ్రహ్మదేవుఁడు; బ్రహ్మపదంబున్, అందెన్=తనబ్రహ్మపదవిని పొందెను; ఘనుఁడు=గొప్పవాఁడగు; మీ, తాత, ఆ, మనువు=మీతండ్రితండ్రియైన ఆస్వాయం

భువమనువు; సర్వాంతరయామిత్వము, ఆగు=సర్వమునందును ఈశ్వరుఁ డు నిండియున్నాఁడను; ఏకదృష్టిఁజేసి=నిశ్చలమైన తలంపుతో; యా గములన్, యజించి=యజ్ఞములు చేసి, తాన్=తాను; భౌమసుఖముల ను=ఐహికసుఖములను; దివ్యసుఖములన్=స్వర్గసౌఖ్యములను; మోక్ష సుఖములను=సంసారమునుండివిముక్తిపొందుటవలనఁగలుగుసుఖములను; పొందెన్=పొందెను; అట్టి=అటువంటి; అచ్యుతునిన్=నాశనములేని వానిని; పరుని=అందరికంటెను శ్రేష్ఠుఁడైనవానిని; వితత, యోగీంద్ర, నికర, సంవేష్ట్యమాన=సమస్తయోగీంద్రసంఘముచేతనుచుట్టఁబడియున్న; చరణ, సరసిజ, యుగళున్=పాదపద్మముల జంటనుగలవానిని; శశ్వత్, ప్రకాశున్=శాశ్వతముగా వెలుఁగుచుండువానిని, భక్తవత్సలున్= భక్తులయెడల బిడ్డలయందువలె ప్రేమగలవానిని; విశ్వ, సంపాద్యున్= విశ్వమునంతటిని రక్షించువానిని; హరిని=విష్ణుమూర్తిని.

తా. బ్రహ్మ తనపదవిని పొందుటకును, మీతాతయైన స్వాయంభువ మనువు ఐహిక, పారలౌకిక, మోక్షసుఖములను బొందుటకును, ఏ అచ్యు తుని, పరుని, యోగీంద్రసేవితుని, శాశ్వతప్రకాశముకలవానిని, భక్తవత్స లుని సేవించిరో ఆశ్రీహరిని. (ముందుపద్యముతోనన్వయము.)

వ. మఱియును. 19

అర్థ. మఱియును=ఇంకను.

క. కరసరసీజగృహీతాం
బురుహయు నరవిందగర్భ ♦ ముఖగీర్వాణుల్
పరికింపంగల లక్ష్మీ
తరుణీమణిచేత వెదకఁ ♦ దగు పరమేశున్. 20

అర్థ. కర, సరసీజ, గృహీత, అంబురుహయున్=పద్మమువంటి చేతిలో పట్టుకొనఁబడిన పద్మముకలదియు; అరవిందగర్భ, ముఖ గీర్వా ణుల్=తామరపువ్వునందు పుట్టినబ్రహ్మయు మొదలయిన దేవతలు; పరి

కింపంకల=వెదుకఁబడఁదగినట్టి; లక్ష్మీ, తరుణీమణిచేత=లక్ష్మి యను నెడు సౌందర్యమూర్తిచేత; వెదకఁదగు=కనుఁగొనఁదగినట్టి; పరమేశుఁ= శ్రేష్ఠుఁడైనప్రభువును.

తా. చేతియందు తామరపువ్వునుబట్టికొని, బ్రహ్మాదులచే వెదుకఁదగిన లక్ష్మిచే వెదకఁదగిన యాప్రభుశ్రేష్ఠుని. (ముందుపద్యముతోనన్వయము.)

—: ధ్రువుండు నారదోపదేశంబువడసి తపంబు సేయుట :—

వ.. నిజధర్మసతిశోభితంబైన యుత్తానపాదుని చిత్తంబున నిలిపి సేవింపు; మమ్మహాత్ముని కంటె నీదుగిఖం బపనయించువాఁ డన్యుం డొక్కరుండు కలండే యని పలికెఁ బరమార్థప్రాప్తిహేతు కంబులైన తల్లివాక్యంబులు విని తన్నుఁదాన నియమించుకొని పురంబు వెడలి చను సవసరంబున నారదుండు తద్వృత్తాంతం బెఱింగి యచ్చటికిం జనుదెంచి యతనిచికీర్షితంబు దెలిసి పాపనాశకరంబైన కరతలంబున నాధ్రువుని శిరం బంటి మానభంగంబునకు సహింపని క్షత్రియులస్వభావం బద్భుతంబుగదా బాలకుండయ్యుఁ బినతల్లియాడిన దురుక్తులు చిత్తంబునం బెట్టి చనుచున్నవాఁ డని మనంబున నాశ్చర్యంబునొంది, " యో బాలక ! సకలసంపత్సమృద్ధంబగు మందిరంబు డిగడి యొంటి నెందు నేగెదవు ? స్వజనకృతంబగు నవమానంబుచే నిను సంతప్తుఁగాఁదలంచెద " నినిన ధ్రువుం డిట్లనియె, "సపత్నిమాతృవాగిషుక్షతంబగు వ్రణంబు భగవద్ధ్యానయోగరసాయనంబున మాపికొందు " నినిన విని ధ్రువునకు నారదుం డిట్లనియె.

అర్థ. నిజ=తనదైన; ధర్మ=ధర్మముచేత; పరిశోభితంబు, ఐన=ప్రకాశించునట్టి; ఏకాగ్ర, చిత్తంబునన్=ఒక్క లక్ష్యమునందే నిలిపిన మనస్సునందు; నిలిపి=ఉంచి; సేవింపుము=కొలువుము; ఆమ్మహాత్ముని కంటెన్=అపరమపురుషుఁడగు శ్రీహరికంటెను; సదుఃఖంబు, అపనయించువాఁడు=నీదుఃఖమును తొలఁగింపఁగలవాఁడు; అన్యుండు, ఒక్కరుండు, కలండే=ఇతరుఁడొక్కఁడైనను గలఁడా? అని, పలికినన్=అని చెప్పఁగా; పరమార్థ, ప్రాప్తి, హేతుకంబులు, ఐన=అన్నిటికంటెను శ్రేష్ఠవస్తువును పొందుటకు కారణములైన; తల్లివాక్యంబులు, విని=తల్లిచెప్పినమాటలు విని; తన్నుఁదాన, నియమించుకొని=తనకుఁదానే తపస్సుచేయవలెనని నిశ్చయించుకొని; పురంబు, వెడలి, చను, అనసరంబునన్=నగరము వెడలి వెళ్లునప్పుడు; నారదుండు=నారదమహర్షి; తద్, వృత్తాంతంబు, ఎఱింగి=ఆసంగతిని తెలిసికొని; అచ్చటికిన్, చనుదెంచి=ఆచోటికివచ్చి; అతని చికీర్షితంబు తెలిసికొని=అతనికోరిక తెలిసికొని పాపనాశకరంబైన=పాపమును నిర్మూలముచేయునట్టి; కరతలంబునన్=చేతితో; ఆ, ధ్రువుని, శిరంబు, అంటి=ఆధ్రువునితలను ముట్టి; మానభంగమునకు=మానముపోవుటకు; సహింపని=ఓర్వలేని; క్షత్త్రియుల ప్రభావంబు=క్షత్త్రియుల మహిమ; అద్భుతంబుగదా=ఆశ్చర్యకరముగాదా; బాలకుండు, అయ్యున్=పిన్నవాఁడైయును; పినతల్లి, ఆడిన దురుక్తులు=సవతితల్లిపలికిన దూషణవాక్యములను; చిత్తంబునన్, పెట్టి=మనస్సునందుంచుకొని; చనుచున్నవాఁడు, అని=ఈతఁడు తపస్సు చేయఁబోవుచున్నాఁడని; మనంబునన్, ఆశ్చర్యంబునన్, ఒంది=మనస్సులో ఆశ్చర్యమునుబొంది; ఓ బాలక=ఓకుఱ్ఱవాఁడా; సకల, సంపద్, సమృద్ధంబు, అగు=సకల సంపదలచేత నిండియున్న; మందిరంబున్, తెగడి=యింటిని విడిచి, ఒంటిన్=ఒక్కఁడవే; ఎందున్, ఏగదవు=ఎచటికి పోయెదవు? స్వజన, కృతంబు, అగు=నీబంధువులచేత చేయఁబడిన; అవమానంబుచేన్=అవమానముచేత; నినున్=నిన్ను; సం

తప్తుఁడ, కాఁగ=పరితపించుచున్నవానినిగా; తలంచెదఁ=తలంచుచున్నాను; అనినఁ=అనఁగా: ధ్రువుండు, ఇట్లు, అనియెన్=ధ్రువుండిట్లుపలికెను; సపత్నీమాతృ, వాక్, ఇషు, క్షతంబు, అగు=సవతితల్లి, మాటలనెడి బాణములచే కొట్టఁబడిన; వ్రణంబున్=పుండును; భగవత్ ధ్యాన, యోగ, రసాయనంబునన్=భగవంతుని ధ్యానమునందు చేర్పఁబడినమనస్సనెడు ఔషధముచేత; మాపికొందుఁ=పోఁగొట్టుకొందును; అనినఁ, విని=అనిపలుకఁగావిని; ధ్రువునికి, నారదుండు, ఇట్లు, అనియెఁ=ధ్రువునితో నారదుఁడిట్లు పలికెను

తా. ఆశ్రీహరిని ఏకాగ్రచిత్తముతో సేవించినయెడల నాతఁడు నీదుఃఖమును బోఁగొట్టును అట్లు చేయఁగలవాఁడు మఱియొకడు లేఁడు. అని చెప్పఁగావిని ధ్రువుఁడు పురమువిడిచి పోవునప్పుడు నారదుఁడతని కెదురై యాతఁడు చేయనెంచినపనిని గ్రహించి, అతనిశిరస్సుమీఁద తన చేతినుంచి, అతనిపరిభాషణంబునకు ఆశ్చర్యమునొంది, అతనితో „బాలకా„ నీగృహమున సకలసంపదలు నున్నవిగదా ఇల్లువిడచి ఒంటరిగా ఎక్కడికివెళ్లుచున్నావు? నీవారెవరైన నిన్ను మాటలాడి యుందురు„ అనఁగాధ్రువుఁడు „సవతితల్లిమాటలచే కొట్టఁబడినదై నామనస్సు బాధనొందుచున్నది. దానిని భగద్ధ్యానమను ఔషధముచేత పోఁగొట్టనెంచితిని„ అనిచెప్పఁగా విని నారదుఁడు ధ్రువునితో నిట్లనెను.

క. వినుపుత్రక! బాలుఁడవై
యనయంబును గ్రీడలందు ♦ నాసక్తమనం
బునఁ దిరిగెడు నీకాలం
బున నీకివమానమాన ♦ ములు లేవెందుఁ. 22

అర్థ. పుత్రిక=కుమారుఁడా! విను=వినుము; బాలుఁడవు=చిన్నవాఁడవై; అనయంబును=ఎల్లప్పుడును; క్రీడలందు=ఆటలలో; ఆసక్త=తగులుకొనిన; మనంబునఁ=మనస్సుతో; తిరిగెడు=తిరుగ

వలసిన; ఈకాలంబునన్ = ఈసమయమునందు; నీకు = నీకు; అనమాన మానములు = మానము, అవమానము అనునవి; ఎందున్, లేవు = ఎప్పుడును ఉండఁగూడదు,

తా. బాలుఁడా! నీవిప్పుడు ఆటలాడుకొనుచుండవలసినదే గాని, నీకు మానావమానములతోఁ బనిలేదు.

తే. గీ. కాన మనమునఁ దద్వివే ♦ కంబు నీకుఁ
గలిగెనేనియు సంతోష ♦ కలితులయిన
పురుషు లాత్మీయకర్మ ♦ విస్ఫురణఁ జేసి
వితత సుఖదుఃఖములనుభ ♦ వింతు రెపుడు 23

అర్థ. కానన్ = అందుచేత; మనమునన్ = మనస్సులో; తద్, వివేకంబు = ఆమానావమానముల భేదము; నీకున్, కలిగెనేనియున్ = నీకుకలిగినట్టయితే; సంతోష, కలితులు, అయి = సంతోషముఁబొందినవారై; పురుషులు = జనులు; ఆత్మీయ = తమయొక్క; కర్మ, విస్ఫురణన్, చేసి = సుకృత దుష్కృతములను కర్మలఫలముగా; వితత = విస్తారమైన; సుఖదుఃఖములు = సుఖములను దుఃఖములను; ఎపుడున్ = ఎల్లప్పుడును; అనుభవింతురు = పొందుదురు.

తా. నీకు మానావమానములను వివేకము కలిగినయెడల చెప్పెదను వినుము. సంతోషములనుపొందిన పురుషులు తమకర్మలకు ఫలముగా సుఖదుఃఖముల ననుభవించుచుందురు.

వ. కావున వివేకంబుగల పురుషుండు స్వయం ప్రాప్తంబులగు సుఖదుఃఖంబులు దైవవశంబులుగాఁ దలంచి తావన్మాత్రంబునం బరితుష్టుండగు నీవును వల్లిచెప్పిన యోగమార్గప్రకారంబున సర్వేశ్వరానుగ్రహంబునం బొందెదనంటివేని. 24

అర్థ. కావునన్ = అందుచేత; వివేకంబు, కల, పురుషుండు = సదసద్వివేకము గలవాఁడు; తనకున్ = తనకు; ప్రాప్తంబులు, అగు = సంభవించునట్టి, సుఖదుఃఖంబులు = సుఖము, దుఃఖము అనునవి, దైవ, వశంబులు, కాన్ = దైవాధీనములని; తలంచి = ఎంచి; తాఁ, ఎంత, మాత్రంబునన్ = అసమయమునను మాత్రమేను; పరితుష్టుండు, అగున్ = సంతోషించినవాఁడగును - నీవు = నీవుకూడ; తల్లి, చెప్పిన, యోగమార్గ ప్రకారంబునన్ = నీతల్లి యుపదేశించిన యోగమార్గము ననుసరించి; సర్వేశ్వరఅనుగ్రహంబునన్, పొందెదను, అంటివి, ఏనిన్ = సర్వేశ్వరుని అనుగ్రహము పొందెదనని తలంచినయెడల.

తా. తనకు సంభవించిన సుఖదుఃఖములు దైవవశమున గలిగినవని యెంచి అసమయమునను మాత్రము సంతోషించువాఁడే వివేకి అనఁబడును. నీవు నీతల్లి యుపదేశప్రకారముగా సర్వేశ్వరుని ధ్యానించి, ఆతని దయను సంపాదించెదనని తలంచినయెడల (ముందుపద్యముతో నన్వయము).

సీ. అపసాత్ర యోగీంద్రు ♦ లనియుంబు ధరఁ బెక్కు
జన్మంబులందు ని ♦ స్సంగులైన
మతిని బ్రయోగ స ♦ మాధి నిష్ఠలఁజేసి
యైనను దెలియలే ♦ రతనిమార్గ
మదిగాన సతతము ♦ లాలాఘ్యుఁడగు నీవు
నుడుగుము సిద్ధ్యు ♦ ద్యోగ మిపుడు
గాక, నిశ్శ్రేయస ♦ కాముఁడ వగుదేనిఁ
బండ్రివర్తించు త ♦ త్కాలమందుఁ
బూని సుఖదుఃఖములు రెంటి ♦ లోన నెద్ది
దైవవశమునఁ జేకుఱు ♦ దానఁజేసి

డెందమునఁ జాల సంతుష్టి • నొందువాఁడు
విమలవిజ్ఞాని యన ధర • వెలయుచుండు 25

అర్థ. అనఘ, అఘ=పాపము లేనివాఁడా! యోగ, ఇంద్రులు= గొప్పయోగులు; అనయంబున్=ఎల్లప్పుడును; ధరన్=భూమియందు; పెక్కు, జన్మ, ములందు=అనేకజన్మములలో; నిస్సంగము, ఐన, మతిని= ఫలములను కోరనికర్మలచే మనస్సు యందాసక్తి లేనివారై; ప్రయోగ=కర్మలను చేయుట; సమాధి=ఈశ్వరునియందు మనస్సును నిల్పుట; నిష్ఠలన్ చేసి, ఐనను=ఏకధ్యానము చేయుట మొదలయినవి చేసినప్పటికిని; అతని, మార్గము=ఈశ్వరుని చర్యను; తెలియఁజాలరు= తెలిసికొనలేరు; అదిగాన =అందుచేత; అతఁడు; దురారాధ్యుఁడు, అగుటన్=అతనిని నీవారాధించుట కష్టమగును; నీవు=నీవు; ఇప్పుడు=ఇప్పుడు; నిష్ఫల, ఉద్యోగము=ఫలరహితమైన ప్రయత్నమును; ఉడుగుము=మానుము; కాక=అట్లు చేయక; నిశ్చయము, కాముఁడవు, అగుదు. ఏనిన్=మోక్షమును కోరినవాఁడవయినయెడల; తండ్రి=నీతండ్రియైనయుత్తానపాదుఁడు; వర్తించు=బ్రతికియున్న; కల్, కాలమందు=ఆకాలమున; ప్రాని=ప్రాణులతో; సుఖ, దుఃఖములు, రెంటిలోనన్=సుఖము, దుఃఖము అనేరెండింటిలోను; ఏది=ఏది; దైవవశమునన్, చేయున=దైవవశమున ఏది ప్రాప్తించునో; దానన్, చేసి=దానితో; డెందమునన్= మనస్సులో; చాలన్, సంతుష్టిన్, ఒందువాఁడు=ఎక్కువగా సంతోషించువాఁడు; విమల, విజ్ఞాని, అనన్=స్వచ్ఛమైన జ్ఞానముకలవాఁడని ధరన్=భూమియందు, వెలయుచుండున్=ఒప్పుచుండును.

తా. ఓయీ పాపరహితుఁడవైన ధ్రువుఁడా! మహాయోగీశ్వరులైనను యజ్ఞ, ధ్యాన, నిష్ఠలచేత పెక్కుజన్మములలోనైనను ఈశ్వరుని తెలిసికొనలేరు. కావున నీవాతనిఁదెలిసికొని ఫలించలేవు నీప్రయత్నమును విడువుము. నీకు మోక్షము కావలసినయెడల నీతండ్రి బ్రతికియున్నంత కాలము నీకు దైవవశమున కలుగు సుఖదుఃఖములను యథాప్రాప్తముగా

అనుభవించుచు సంతోషము పొందియుండును. అట్లు యథాలబ్ధ సంతుష్టుఁడయినవాఁడు జ్ఞానియని పిలువఁబడును.

వ. మఱియు గుణాఢ్యుండగువానిం జూచి సంతోషించుచు
నాభాసుండగువానిం జూచి కరుణించుచు సమానుని
యెడ మైత్త్రిం బలుపుచు వర్తించుచు నున్నవాఁడు తాపత్త్ర
యాదికంబులం దొలంగునని నారదుండు పలికిన విని
ధ్రువుం డిట్లనియె "అనఘా యీశమంబు సుఖదుఃఖ
హతాత్ములగు పురుషులకు దుర్లభంబని కృపాయుక్తుండ
వైన నీచేత నిరూపింపఁబడె నట్టియును బరభయంకరంబగు
క్షాత్త్రస్వభావంబు నొందిన యవినీతుండనగు నేను
సురుచి దురుక్తిబాణ విచ్ఛిన్న హృదయుండ నగుట మదీయ
చిత్తంబున శాంతి నిలువదు కావునం ద్రిభువనో
త్కృష్టంబు ననన్యాధిష్ఠితంబు నగు పదంబునం బొంద
నిశ్చయించిన నాకు సాధుమార్గంబు నెఱింగింపుము నీవు
భగవంతుండగు నజుని యూరువువలన జనించి వీణావా
దన కుశలుండవై జగద్ధితార్థంబు సూర్యుండునుం బోలె
వర్తింతు వనిన విని. 26

అర్థ. మఱియున్=ఇంకను; గుణ, ఆఢ్యుండు, అగు, వానిన్=సద్గుణములుగలవానిని; చూచి=చూచి; సంతోషించుచు=సంతోషమును పొందుచు; ఆభాసుండు, అగు వానిన్=దుర్గుణములుగలవానిని; చూచి=చూచి; కరుణించుచున్=దయ చూపుచు; **సమానునియెడన్**=తనతో సమానుఁడైయున్న వానిపట్ల; మైత్త్రి బలుపుచు=స్నేహముచే నుండుచు; వర్తించుచు, ఉన్నవాఁడు=ప్రవర్తించువాఁడు; తాపత్త్రయ, ఆదికంబులన్

=అధిభూత, అధిదైవ, అధ్యాత్మసంబంధములయిన తాపములను; తొ
రంగున్=విడచును; అని=అని; నారదుండు=నారదుఁడు; పలికి
నన్=చెప్పఁగా; విని=విని; ధ్రువుండు, ఇట్లు. అనియెన్=ధ్రువుఁ
డిట్లు చెప్పెను; అనఘా=పాపరహితుఁడవైన నారదుఁడా; ఈశమం
బు=ఈశాన్తి అనఁగా సుఖదుఃఖములు నొక్కరీతిగా చూచుకొనుట; సు
ఖ, దుఃఖ, హత, అర్తులు, అగు, పురుషులకు=సుఖదుఃఖప్రాప్తిచేత
చలనము గలిగిన మనస్సుఁగల మనుష్యులకు; దుర్గమంబు, అని=పొంద
శక్యము కానిదని; కృపా, ఆయత్తుండవు, అయిన, నీచేతన్=కృపతో
కూడియున్న నీచేత; వినంబడెన్=చెప్పఁబడినది; అట్లు, అయినన్=
అట్లయినయెడల; పరభయంకరంబు, అగు=శత్రువులకు భయముగొల్పె
డు; క్షాత్రస్వభావంబున్=క్షత్రియస్వభావమును; పొందిన=పొం
దినట్టి; అవినీతుండను, అగు, నేను,=వినయములేని నేను; సురుచి, దురు
క్తి, బాణ, నిర్భిన్న హృదయుండను, అగుటన్=సురుచి యాడిన కఠి
నవాక్కులను బాణములచే పగులగొట్టఁబడిన హృదయము కలవాఁడన
గుటచేత; మదీయచిత్తంబునన్=నామనస్సునందు; శాంతి, నిలువదు=
శాంతికుదురుకొనదు; కావునన్=అందుచేత; త్రిభువన, ఉత్కృష్టం
బును=మూఁడులోకములలోను శ్రేష్ఠమయినదియు; అనన్య, అధిష్ఠి
తంబును=ఇతరులచేత పొందఁబడనట్టిదియు; అగు=అయిన; పదంబు
నన్, పొందన్=స్థానమును పొందుటకు; ఇచ్ఛయించిన=కోరిన; నా
కు=నాకు; సాధు, మార్గంబును=మంచిమార్గమును; ఎఱింగింపుము
=తెలుపుము; నీవు=నీవు; భగవంతుండు, అగు=ఈశ్వరుఁడైన; అ
జుని=బ్రహ్మయొక్క; ఊరువు వలనన్=తొడనుండి; జనించి=పుట్టి;
వీణావాదనకుశలుండవు, ఐ=వీణను వాయించుటయందు నేర్పరివై; జ
గత్, హిత, అర్థంబు=లోకములమేలుకొఱకు; సూర్యుండు వలెన్, పో
లెన్=సూర్యుని వలె; వర్తింతువు, అనినన్, విని=తిరుగుచుందువు అని
పలుకఁగా విని; (ముందుపద్యముతో అన్వయము.)

తా. గుణవంతునిచూచి సంతోషించుచు, దుర్గుణునిచూచి దయచూపుచు, సమానునితో స్నేహముచేయుచు జీవనముగడపువాఁడు తాపత్రయములను విడచునని నారదుఁడు చెప్పఁగా విని ధ్రువుఁడు, "అయ్యా, సుఖదుఃఖములచే సంచలనముపొందిన మనస్సునకు శాంతిలేదని నీవు చెప్పితివి. నాకు శత్రుభీకరంబైన క్షాత్రస్వభావము కుదురుకొన్నది. నేను నామనస్సును నిలుపఁజాలను. గనుక మూఁడులోకములలోను శ్రేష్ఠమును, ఇతరులచే పొందఁబడనట్టియు స్థానమును పొందఁగోరిన నాకు దానినిపొందఁదగు మార్గమును దెల్పుము. నీవు బ్రహ్మకుమారుఁడవు. వీణను వాయించుటయందు నేర్పరివి. సూర్యుఁడు సర్వలోకహితార్థమై యెట్లు సంచరించుచుండునో నీవును అట్లే లోకములందు సంచరించుచుందువు" అని పలుకఁగా విని- (ముందుపద్యముతో అన్వయము.)

క. నారదుఁ డిట్లను ననఘ కు
మారక విను నిన్ను మోక్ష ♦ మార్గంబునకుం
బ్రేరేచినవాఁ డిప్పుడు
ధీరజనోత్తముఁడు వాసు ♦ దేవుం డగుటన్. 27

అర్థ. నారదుఁడు, ఇట్లు, అనున్ = నారదుఁ డిట్లనుచున్నాఁడు; అనఘ, కుమారక = పాపములేనివాఁడా; కుమారా; విను = వినుము; నిన్ను = నిన్ను; మోక్షమార్గంబునకున్ = మోక్షమును పొందుటకు; ప్రేరేచినవాఁడు = ప్రేరేపించినవాఁడు; ఇపుడు = ఇప్పుడు; ధీరజన, ఉత్తముఁడు = ధైర్యముగల జనులలో శ్రేష్ఠుఁడైన; వాసుదేవుండు, అగుటన్; విష్ణుమూర్తి అగుటచేత (ముందుపద్యముతో అన్వయము)

తా. నారదుఁ డిట్లనుచున్నాఁడు, "పాపరహితా, కుమారా, వినుము, నిన్నిప్పుడు మోక్షము పొంద ప్రేరేపించినవాఁడు విష్ణుమూర్తి. అందుచేత- (ముందుపద్యముతో అన్వయము.)

వ. నీవు నమ్మహాత్ముని పదధ్యాన ప్రవణ చిత్తుండవై భజి
యింపుము. 28

అర్థ. నీవును=నీవును; ఆ, మహాత్మునిన్=ఆపరమపురుషుని; పద, ధ్యాన, ప్రవణ, చిత్తుండవు, ఐ=పాదధ్యానమునందాసక్తి పొందినమనస్సుకలవాఁడవై; భజియింపుము=కొలువుము

తా. నీవాతని పాదధ్యానమునందు మనస్సునిలిపి సేవింపుము.

క. పురుషుఁడు దవిలి చతుర్విధ
పురుషార్థశ్రీయు మాత్మఁ ♦ బొందెద ననినన్
ధరఁ దత్ప్రాప్తికి హేతువు
హరిపదయుగళంబు దక్క ♦ నన్యము గలదే. 29

అర్థ. పురుషుఁడు=మనుష్యుఁడు; తవిలి=కోరికతో; చతుర్విధ; పురుషార్థ=ధర్మార్థకామమోక్షములనునాలుగు; శ్రీయుము=శ్రీయున్ను; ఆత్మన్=మనస్సులో; పొందెదన్, అనినన్=పొందెదనన్నయెడల; ధరన్=భూమియందు; తత్, ప్రాప్తికిన్=దానిని పొందుటకు; హేతువు=సాధనము, హరి, పద, యుగళంబు, తక్కన్=శ్రీహరిపాదపద్మములజంటతప్ప; అన్యము=ఇతరము; కలదే=కలదా?

తా. మనుష్యుఁడు ధర్మార్థకామమోక్షములఫలమును పొందఁగోరినయెడల శ్రీహరిపాదపద్మములను సేవించుటకంటె మఱియొకసాధనము లేదు.

వ. కావున. 30

అర్థ. కావునన్=కాఁబట్టి.

క. వరయమునానదితటమున
హరిసాన్నిధ్యంబు శుచియు ♦ నతిపుణ్యమునై
పరఁగిన మధువనమునకును
వరసగుణా వనము మేలు ♦ నమరుదు వచటన్. 31

అర్థ. వర=శ్రేష్ఠమైన, యమునానది, తటమునన్=యమున అను నది యొడ్డున; హరి, సాన్నిధ్యంబు=విష్ణుమూర్తి చేరువయు; శుచియు=

పవిత్రమును; అతిపుణ్యమున, ఐ = మిక్కిలిపుణ్యవంతమునై; పరఁగిన = ఒప్పిన; మధువనమునకును = మధువనము అడవికి ; సరసగుణా = మంచి గుణములుగల ధ్రువుఁడా; చనుము = వెళ్లుము ; అచటన్ = అచ్చట; మేలు, సమకుఱున్ = మేలుకలుగును.

తా. ధ్రువుఁడా, నీవు యమునానది ఒడ్డున హరికిసమీపమును, పవిత్రమును, పుణ్యవంతమునైన మధువనమునకు పొమ్ము అచ్చట నీకు మేలు కలుగును.

క. ఆ యమునాతటిని శుభ
తోయములం గ్రుంకి నిష్ఠ ♦ తో నచ్యుత నా
రాయణునకును నమస్కృతు
లాయతమతిఁ జేసి చేయు ♦ యమనియమములన్ 32

అర్థ. ఆ, యమునాతటినీ, శుభతోయములన్ = ఆ యమునానది పవిత్రజలములందు; గ్రుంకి = మునిఁగి; నిష్ఠతోన్ = శ్రద్ధతో; అచ్యుత = అక్షత; నారాయణునకును = విష్ణుమూర్తికి ; నమస్కృతులు = నమస్కారములు ; ఆయతమతిన్, చేసి = స్వాధీనమందుంచఁబడిన మనస్సుతో చేసి; యమ నియమములన్ = యమ, నియమ, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, మనన, సమాధులను అష్టాంగయోగములతో; చేయుము = చేయుము.

తా. ఆ యమునానది పవిత్రజలములందు స్నానముచేసి, అచ్చట నారాయణునకు నమస్కరించి, యోగధ్యానము చేయుము.

వ. మఱియు బాలుండవగుటంజేసి వేదాధ్యయనాద్యుచిత
కర్మానర్హుండ వయ్యు నుచితంబులగు కుశాజినంబులంజేసి
స్వస్తిక ప్రముఖాసనంబులం గల్పించికొని త్రివృత్ప్రాణా
యామంబులచేతం బ్రాణేంద్రియమనోమయంబులను

చాంచల్యదోషంబులఁ బ్రత్యాహరించి స్థిరంబయిన చిత్తం
బున. 33

అర మితము = ఇంకను; బాలుండవు, అగుటంజేసి = చిన్నవాఁడ వగుటచేత; వేద, అధ్యయన, ఆది, ఉచిత, కర్మ, అనర్హుఁడవు, అయ్యున్ = వేదాధ్యయనము మొదలగు కర్మము చేయుటకు నీకధికారము లేకున్నను; ఉచితంబులు, అగు = యుక్తమగునట్టి; కుశ, అజినంబులన్, చేసి = దర్భలు, లేడిచర్మములు మొదలయినవానితో; స్వస్తిక, ప్రముఖ, ఆసనంబులన్ = స్వస్తిక మొదలగు ఆసనములను; కల్పించికొని = వైచికొని; త్రివృత్, ప్రాణాయామంబులచేతన్ = మూఁడువిధములైన కుంభక, పూరక, రేచకరూపమైన ప్రాణాయామములతో; ప్రాణ, ఇంద్రియ, మనః, మయంబులు = ప్రాణమునకును, ఇంద్రియములకును, మనస్సునకును సంబంధించిన; చాంచల్యదోషంబులన్ = చంచలత్వము దోషములను; ప్రత్యాహరించి = విడిచిపెట్టి, స్థిరంబయిన, చిత్తంబునన్ = ఏకాగ్రచిత్తముతో, (ముందుపద్యములో అన్వయము.)

తా. నీవు బాలుఁడవు. కావున నీవు వేదాధ్యయనాది కర్మలఁ జేయుట కర్హుఁడవు కావు. అయినను, నీవు తగినట్లు దర్భలను లేడిచర్మములను కల్పించుకొని అందుపై యోగాసనములను వైచికొని, ప్రాణాయామము చేయుచు, ప్రాణేంద్రియమనస్సులకు సంబంధించిన దోషములను పరిహరించి ఏకాగ్రచిత్తముతో, (ముందుపద్యములో నన్వయము)

సీ. ఆశ్రితసత్ప్రసా ♦ దాభిముఖుండును
సిద్ధప్రసన్నాస్య ♦ నేత్రాబ్జుండు
సురుచిరనాసుండు ♦ సుభ్రూయుగుండును
సుకపోలతలుఁడును ♦ సుందరుండు
హరినీలసంశోభి ♦ తాంగుండుఁ గరుణాంబు
నరుణావలోకన ♦ స్తాధరుండుఁ

గరుణాసముద్రుండుఁ ♦ బురుషార్థనిధియును
బ్రణతాశ్రయుండు ♦ శోభనకరుండు
తే. లలిత శ్రీవత్సలక్షణ ♦ లక్షితుండు
సర్వలోకశరణ్యుండు ♦ సర్వసాక్షి
పురుషలక్షణయుక్తుండుఁ ♦ బుణ్యశాలి
యసితమేఘనిభశ్యాముఁ ♦ డవ్యయుండు. 34

అర్థ. ఆశ్రిత=ఆశ్రయించినవారికి; సత్, ప్రసాద, అభిముఖుండును=మంచివరముల నిచ్చుటకు సిద్ధముగనున్నవాఁడును; ఇద్ధ, ప్రసన్న, ఆనన, ఈక్షణుండును=స్తుతింపఁదగిన ప్రసన్నతతోఁగూడిన ముఖమును, చూపునుగలవాఁడును; సు, రుచిర నాసుండును=మనోహరమైన ముక్కు గలవాఁడును; సు, భ్రూ, యుగుండును=చక్కని రెండు కనుబొమలు కలవాఁడును; సు, కపోల, తలుఁడును=మంచి చెక్కిటిభాగముగలవాఁడును; సుందరుండును=చక్కనివాఁడును; హరినీల, సంశోభిత, అంగుండు=ఇంద్రనీలమణులవలె కాంతిగల శరీరముగలవాఁడును; తరుణుండు=యౌవనవంతుఁడును; అరుణ, అవలోకన, ఓష్ఠ, అధరుండు=ఎఱ్ఱని చూపులును, పెదవులునుగలవాఁడును; కరుణాసముద్రుండు=కరుణకు సముద్రమువంటివాఁడును; పురుషార్థనిధియును=ధర్మార్థకామమోక్షములకు ఆటపట్టయినవాఁడును; ప్రణత, ఆశ్రయుండు=తన్ను నమస్కరించువారికి ఆశ్రయమైనవాఁడును; శోభనకరుండు=కల్యాణమును కలుగఁజేయువాఁడును; లలిత=సుందరమైన; శ్రీవత్స, లక్షణ, లక్షితుండు=శ్రీవత్సమను వాంఛనముతో నొప్పువాఁడును; సర్వలోక, శరణ్యుండు=సర్వలోకములకు శరణుచొరఁదగినవాఁడును; సర్వసాక్షి=సమస్తమును చూచుచున్నవాఁడును, పురుషలక్షణ, యుక్తుండు=మహాపురుషలక్షణములుగలవాఁడును; పుణ్యశాలి=పుణ్యవంతుఁడును; అసిత,

మేను, నిభ, శ్యాముఁడు=నల్లని మేనుతో శ్యామవర్ణముగలవాఁడును; అవ్యయుండు=నాశనము లేని వాఁడును-(ముందుపద్యముతో నన్వయము)

తా. ఆశ్రితులకభిముఖుఁడై యున్నవాఁడును, ప్రసన్నములైన ముఖమును చూపులును గలవాఁడును, మంచిముక్కును, కనుబొమలును, గలవాఁడును, మంచి నుదురు గలవాఁడును, చక్కనివాఁడును, ఇంద్రనీలకాంతిగల శరీరము గలవాఁడును, యౌవనుఁడును, ఎఱ్ఱని చూపులును పెదవులును గలవాఁడును, కరుణాసముద్రుఁడును, చతుర్విధపురుషార్థములకు తావయినవాఁడును, తన్ను నమస్కరించువారికి ఆశ్రయుఁడును, కళ్యాణకరుఁడును, శ్రీవత్సలాంఛనుఁడును, సర్వలోకశరణ్యుండును, సర్వసాక్షియు, మహాపురుషలక్షణములు గలవాఁడును, పుణ్యవంతుఁడును, నీలమేఘశ్యాముఁడును, నాశనము లేనివాఁడును- (ముందుపద్యముతో నన్వయము)

వ. మఱియును. 35

అర. మఱియును=ఇంకను.

సీ. హారకిరీటకే ♦ యూరకంకణ ఘన
భూషణుం డాశ్రిత ♦ పోషణుండు
లాలిత కాంచిక ♦ లాపశోభితకటి
మండలుం డంచిత ♦ కుండలుండు
మహనీయకౌస్తుభ ♦ మణికీలితాచ్ఛ గ్రై
వేయకుం డానంద ♦ దాయకుండు
సలలిత ఘనశంఖ ♦ చక్రగదా పద్మ
హస్తుండు భువన ప్ర ♦ శస్తుఁడజుఁడుఁ
గస్రసౌభ వనమాలి ♦ కాధరుండు
హతవిమోహ ఖండు సర్వ పీ ♦ తాంబరుండు

లలితకాంచన నూపురా • లంకృతుండు
నిరతిశయ సద్గుణాఢ్యుఁడు దర్శ • నీయతముఁడు. 36

అర. హార, కిరీట, కేయూర, కంకణ, ఘన, భూషణుండు=హారములు, కిరీటము, భుజకీర్తులు, కంకణములు మొదలగు గొప్ప అలంకారములను ధరించినవాఁడును; ఆశ్రితపోషణుండు=ఆశ్రితులను పోషించువాఁడును, లాలిత, కాంచీకలాప, శోభిత, కటిమండలుండు=చక్కని మొలనూలితో ఒప్పుచున్న కటిప్రదేశముగలవాఁడును; అంచిత, కుండలుండు=చక్కని కుండలములు గలవాఁడును; మహనీయ, కౌస్తుభమణి కీలిత, అచ్ఛ, గ్రైవేయకుండు=గొప్పదయిన కౌస్తుభమణి తాఁపిన చక్కని కంఠహారములు గలవాఁడును; సలలిత, ఘన, శంఖ, చక్ర, గదా, పద్మ, హస్తుండు=చక్కని శంఖము, చక్రము, గద, పద్మము అనువానిని చేతియందు ధరించినవాఁడును, భువనప్రశస్తుఁడు=లోకములందెల్ల శ్రేష్ఠుఁడును; అజుఁడు=పుట్టువలేనివాఁడును; క్రమ, సౌరభ, వనమాలికా, ధరుఁడు=కమ్మని వాసనగల వనమాలికలను ధరించినవాఁడును; హత, విమోహుండు=మోహములేనివాఁడును; నవ్య, పీతాంబరుండు=క్రొత్తదయిన పీతాంబరమును ధరించినవాఁడును; లలిత, కాంచన, నూపుర, అలంకృతుండు=చక్కని బంగారపు అందెలచేత అలంకరింపఁబడినవాఁడును; నిరతిశయ, సద్గుణుఁడు=సాటిలేని సద్గుణములు గలవాఁడును; దర్శనీయతముఁడు=చూడ చక్కనివాఁడును, (ముందు పద్యముతో అన్వయము)

తా. స్పష్టము.

క. సరసమనోలోచనము
త్కరుఁడు సుహృత్ప్రకర్ష • కాపవసితవి
స్ఫురదురునఖమణిశోభిత
చరణసరోజాతుఁ డతుల • శాంతుఁడు ఘనుఁడున్. 37

అర్థ. సరస, మనోలోచన, ముత్, కరుఁడు=రసికత్వముగల మనస్సును కంటికి సంతోషము గలిగించువాఁడును; సుహృత్, పద్మ=స్నేహితుఁడను పద్మములోని; కర్ణికా=దుద్దులో; నివసిత=నివాసము చేయుచున్న; విస్ఫురత్, ఊరు, నఖమణి=ప్రకాశించు పెద్దగోళ్లను మణులచేత; శోభిత=ప్రకాశింపఁజేయఁబడిన; చరణ సరోజాతుఁడు=పాదపద్మములుగలవాఁడును; అతులః, శాంతుఁడు=సాటిలేనిశాంతము గలవాఁడును; ఘనుఁడున్=గొప్పవాఁడును-(ముందుపద్యముతో అన్వయము.)

తా. మనస్సునకు సంతోషము కలిగించువాఁడును, తనకు స్నేహితులయినవారిచేత నమస్కరింపఁబడు పాదపద్మములుగలవాఁడును, మిక్కిలి శాంతుఁడును, గొప్పవాఁడును-(ముందుపద్యముతో అన్వయము.)

వ. అయిన పురుషోత్తముం బూజించుచు హృదయగతుం
డును, సానురాగవిలోకనుండును, వరదశ్రేష్ఠుండును
నగు నారాయణు నేకాగ్రచిత్తంబునం ధ్యానంబు సేయు
చుఁ బరమనివృత్తిమార్గంబున ధ్యానంబు సేయంబడ్డ
పురుషోత్తముని దివ్యమంగళస్వరూపంబు చిత్తంబునం
దగిలిన మరల మగుడ నేరదదియునుం గాక యేమంత్రం
బేని సప్తవాసరంబులు పఠియించిన ఖేచరులం గనుంగొను
సామర్థ్యంబు గలుగునట్టి ప్రణవయుక్తం బగు ద్వాదశా
క్షరకలితంబును దేశకాలవిభాగవేది యగు బుధానుష్ఠి
తంబును నయిన వాసుదేవమంత్రంబునం జేసి. 38

అర్థ. అయినపురుషోత్తమున్=అయినట్టి పురుషశ్రేష్ఠుని; పూజించుచు=పూజచేయుచు; హృదయగతుండును=హృదయమునందుండువాఁడును; సానురాగవిలోకనుండును=అనురాగముతోఁగూడిన చూపు

లుగలవాఁడును: వరదశ్రేష్ఠుండును=వరములనిచ్చువారిలో ఉత్తముఁడును, అగు=అయిన; నారాయణున్=శ్రీమహావిష్ణువును; ఏకాగ్ర, చిత్తంబునన్=నిలుకడయైన మనస్సుతో; ధ్యానంబు, చేయుచున్=ధ్యానించుచు, పరమ, నివృత్తి, మార్గంబునన్=గొప్పదయిన మోక్షమార్గమునందు, ధ్యానంబు, చేయఁబడ్డ=ధ్యానింపఁబడిన; పురుషోత్తముని, దివ్యమంగళ, స్వరూపబు=శ్రీమహావిష్ణువుయొక్క, కాంతిమంతమయినరూపము; చిత్తంబునన్=మనస్సులో; తగిలినన్=కుదురుకొన్నయెడల; మరలన్, మగుడన్, నేరదు=తిరిగిపోఁజాలదు; అదియునుంగాక=ఇంతేకాక; ఏమంత్రించేని=ఏమంత్రమయితే; సప్తవాసరంబులు, పఠియించినన్=ఏడుదినములు జపించినయెడల; ఖేచరుఁడన్, కనుంగొను, సామర్థ్యంబు, కలుగు=దేవతలను గనుఁగొను శక్తిగలుగునో; అట్టి=అటువంటి; ప్రణవయుక్తంబగు=ఓంకారసహితమైన; ద్వాదశాక్షరకలితంబును=" ఓం నమో భగవతే వాసుదేవాయ " అను పన్నెండక్షరములతోఁ గూడినదియును, దేశ, కాల, విభాగ, వేది అగు=దేశకాలభేదమును తెలిసికొన్న; బుధ=ప్రాజ్ఞులచేత, అనుష్ఠితంబును, అయిన=ఆచరింపఁబడునదియు అయిన; వాసుదేవమంత్రంబునం జేసి=వాసుదేవమంత్రమువలన- (ముందుపద్యములో అన్వయము.)

తా. స్పష్టము.

సీ. దూర్వాంకురంబుల ♦ దూర్వాంకురశ్యాము
జలజంబులను జారు ♦ జలజనయనుఁ
దులసీదళంబులఁ ♦ దులసికాదాముని
మాల్యంబులను సునై ♦ ర్మల్యచరితుఁ
బత్త్రంబులను బక్షి ♦ పత్త్రునిఁ గడు వన్య
మూలంబులను నాది ♦ మూలఘనుని

సంచితభూర్జత్వ ♦ గాదిని ర్మితవివి
ధాంబరంబులను బీ ♦ తాంబరునిని
తే. దనరుభక్తిని మృచ్ఛిలా ♦ దారురచిత
రూపములయందుఁ గాని ని ♦ రూఢ మైన
సలిలములయందుఁ గాని సు ♦ స్థలములందుఁ
గాని పూజింపవలయు న ♦ క్కమలనాభు 39

అర్థ. దూర్వాంకురశ్యామున్ = లేఁతపచ్చికవలె శ్యామలవర్ణము గలవానిని; దూర్వాంకురంబులన్ = లేఁతపచ్చికతోడను; చారు, జలజ, నయనున్ = సుందరమైన పద్మములవంటి కన్నులుగలవానిని; జలజంబులను = పద్మములచేతను; తులసికాదామునిన్ = తులసీమాలను ధరించినవానిని, తులసీదళంబులన్ = తులసీదళములచేతను; సు, నైర్మల్య, చరితున్ = మంచినిర్మలచరిత్రముగలవానిని; మాల్యంబులను = పూలదండలచేతను; పక్షిపత్త్రినిన్ = పక్షివాహనుని; పత్త్రంబులన్ = ఆకులచేతను; ఆదిమూల, ఘనునిన్ = లోకములకన్నింటికిని మూలమైనశ్రేష్ఠుని; కడున్ = మిక్కిలి గా; వన్యమూలంబులను = అడవిదుంపలచేతను; పీతాంబరునిని = పీతాంబరము ధరించినవానిని; అంచిత, భూర్జత్వక్, ఆది, నిర్మిత, వివిధ. అంబరంబులను = ఒప్పుచున్న, భూర్జపత్రములు మొదలగువానిచేచేయఁబడిన అనేకవిధములగు బట్టలచేతను; తనరు, భక్తిని = ఎక్కువయగు భక్తితో; మృత్, శిలా, దారు, రచిత, రూపములయందు గాని = మట్టి, రాయి, కట్టె, మొదలయినవానితో చేయఁబడిన ప్రతిమల రూపములఁగాని; నిరూఢమైన, సలిలములయందుఁగాని = పవిత్రజలములలోఁగాని; సుస్థలములందున్, గాని = మంచిస్థలములలోగాని; అ, క్కమలనాభున్, పూజింపవలయున్ = ఆ విష్ణుమూర్తిని పూజచేయవలెను,

తా. లేఁతపచ్చికవర్ణము గలవానిని లేఁతపచ్చికచేతను, పద్మముల వంటి కన్నులుగలవానిని పద్మములచేతను, తులసీహారుని తులసీదళముల

చేతను; మంచిచరిత్రముగలవానిని పుష్పహారములచేతను, గరుడవాహనుని అర్కులచేతను, జగత్తునకు మూలమైనవానిని అడవిదుంపలచేతను, పీతాంబరధరుని భూర్జపత్రాదులచే చేయఁబడిన బట్టలచేతను మట్టి, శిలలు, గట్టులు మొదలయినవానితో చేయఁబడిన ప్రతిమలరూపమునగాని, పవిత్రజలములందుఁగాని, మంచిస్థలములందుగాని సేవింపవలెను.

క. ధృతచిత్తుఁడు శాంతుఁడు ని
యతపరిభాషణుఁడు సుమహి ♦ తాచారుఁడు వ
ర్ణితహరిమంగళగుణుఁడును
మితవన్యాశనుఁడు నగుచు ♦ మెలఁగుచు మఱియున్. 40

అర్థ. ధృతచిత్తుఁడు=ధైర్యముగల మనస్సుగలవాఁడును; శాంతుఁడు=శాంతముగలవాఁడును; నియత, పరభాషణుఁడు=మితభాషియు; సుమహిత, ఆచారుఁడు=గొప్ప ఆచారమును పాలించువాఁడును; వర్ణిత, హరి, మంగళ, గుణుఁడు=హరిసంకీర్తనముచేయు మంగళకరమైన గుణములుగలవాఁడును; మిత, వన్య, ఆశనుఁడు=అడవిలోపుట్టు దుంపలను మితముగా భుజించువాఁడును; అగుచు=అగుచు; మెలఁగుచున్=సంచరించుచు; మఱియున్=ఇంకను.

తా. ధైర్యచిత్తుఁడును, శాంతముగలవాఁడును, మితభాషియు, హరిసంకీర్తనముచేయు మంగళగుణములుగలవాఁడును, అడవిదుంపలను మితముగా తినువాఁడును, అయి సంచరించుచు ఇంకను- (ముందుపద్యముతో నన్వయము)

తా. ధైర్యముగలిగి, శాంతుఁడై, మితభాషియై, హరిసంకీర్తనము చేయుచు, మితాహారుఁడై సంచరించుము- (ముందుపద్యముతో అన్వయము.)

వ. ఉత్తమశ్లోకుం డగు పుండరీకాక్షుండు నిజమాయాస్వే
చ్ఛావతారచరితంబులచేత నచింత్యంబుగా నెద్ది సేయు

నద్దియు హృదయగతంబుగా ధ్యానంబు సేయం దగు
మఱియుం గార్యబుద్ధిం జేసి చేయంబడు పూజావిశేషం
బులు వాసుదేవమంత్రంబున సర్వేశ్వరునకు సమర్పింప
వలయు నిట్లు మనోవాక్కాయకర్మంబులచేత మనో
గతం బగునట్లుగా భక్తియుక్తంబులయిన పూజలచేతం
బూజింపంబడి సర్వేశ్వరుండు మాయాభిభూతులు గాక
సేవించుపురుషులకు ధర్మాదిపురుషార్థంబులలోన నభిమ
తార్థంబు నిచ్చు విరక్తుం డగువాఁడు నిరంతరభావం
బయిన భక్తియోగంబునం జేసి మోక్షంబుకొఱకు భజి
యించు నని చెప్పిన విని ధ్రువుండు నారదునకుం బ్రద
క్షిణపూర్వకంబుగా నమస్కరించి మహర్షిజనసేవ్యంబై
సకలసిద్ధుల నొసంగుచు భగవత్పాదసరోజాలంకృతం
బైన మధువనమునకుం జనియె నంత. 41

అర్థ. **ఉత్తమశ్లోకుండు**, అగు=మంచికీర్తిగలవాఁడగు; పుండరీక, **అక్షుండు**=పద్మనేత్రుఁడయిన శ్రీమహావిష్ణువు; నిజ, మాయా, స్వేచ్ఛావతార, చరితంబులచేత=తనమాయవలన పొందుచుండు అవతారములందలి చరిత్రములవలన; అచింత్యంబుగాన్=ఊహింపశక్యముకానట్లు; ఎద్ది, చేయున్=ఏదిచేయునో; అద్దియు=దానిని; హృదయ, గతంబుగాన్=హృదయమునందు నిలిపి; ధ్యానంబు, చేయందగున్=ధ్యానింపవలెను; మఱియున్=ఇంకను; కార్యబుద్ధిం జేసి=ఒకకోరిక సిద్ధింపవలెనను ఉద్దేశముతో, చేయంబడు, పూజావిశేషంబులు=చేయఁబడిన వివిధపూజలు; వాసుదేవమంత్రంబునన్=ఓం నమోభగవతే వాసుదేవాయ అను మంత్రపూర్వకముగా; సర్వేశ్వరునికి=శ్రీమహావిష్ణువునకు; సమర్పింపవలయున్=సమర్పణచేయవలెను; ఇట్లు=ఈవిధముగా; మనః,

వాక్, కాయ, కర్మంబులచేతన్ = మనస్సు, మాట, శరీరము. పని అను వానిచేత ; మనోగతంబు, అగునట్లు గాన్ = మనస్సున సుముఖముగునట్లు; భక్తియుక్తంబులయిన పూజలచేతన్, పూజింపంబడి = భక్తితోకూడిన పూజలచేత ఆరాధింపఁబడి; సర్వేశ్వరుండు = శ్రీమహావిష్ణువు; మాయా, అభిఘాతులు, కాఁ = మాయచేత కొట్టఁబడక; సేవింతు, పురుషులకు = కొలిచేజనులకు; ధర్మ, ఆది, పురుషార్థంబులలోనన్ = ధర్మార్థకామమోక్షములను పురుషార్థములలో ; అభిమత, అర్థంబున్ = కోరినకోరికను ; ఇచ్చున్ = ఇచ్చును; విరక్తుండు, అగువాఁడు = సంసారమునుండి విరక్తి పొందినవాఁడు; నిరంతర, భావంబు, అయిన = ఎడతెగక నిలచియున్న ; భక్తియోగంబునం జేసి = భక్తినికలిగియుండి ; మోక్షంబుకొఱకున్, భజియించున్ = మోక్షముకొఱకు ఆరాధించును ; అని, చెప్పఁగన్, విని = అని చెప్పఁగావిని ; ధ్రువుండు = ధ్రువుఁడు; నారదునకున్ = నారదునకు ; ప్రదక్షిణపూర్వకంబు గాన్ = ముందుగా ప్రదక్షిణము చేసి; నమస్కరించి = నమస్కారము చేసి; మహర్షి జన, సేవ్యుండై = మహర్షులచేత సేవింపఁబడి ; సకలసిద్ధులన్, ఒసంగుచున్ = అన్నిసిద్ధులను ఇచ్చుచు; భగవత్, పాదసరోజ, అలంకృతంబు = భగవంతుని పాదపద్మములచే అలంకరింపఁబడిన ; మధువనంబునకున్, చనియెన్ = మధువనమునకు వెళ్లెను; అంతన్ = అపిమ్మట.

తా. స్పష్టము.

తే. పద్మభవసూనుఁ డుత్తాన ♦ పాదుకడకు
నరిగి యా రాజుచే వివి ♦ ధార్చనముల
నంది సంప్రీతుఁ డై యుచి ♦ తాసనమున
నెలమిఁ గూర్చుండి యాతని ♦ వలను సూచి. 42

అర్థ. పద్మభవ, సూనుఁడు = బ్రహ్మకొడుకయిన నారదుఁడు ; ఉత్తానపాదు, కడకున్, అరిగి = ఉత్తానపాదమహారాజునద్దకు వెళ్లి ; ఆ రాజుచేన్ = ఆరాజుచేత ; వివిధ, అర్చనములన్, అనేకపూజలను పొంది;

ఉచిత, ఆసనమునన్=తగిన ఆసనముమీఁద; ఎలమిన్=సంతోషముతో; కూర్చుండి=కూర్చొని; అతని, వలను, చూచి=అతనిదిక్కు చూచి.

తా. నారదుఁడుత్తానపాదుని యొద్దకు వెళ్లి, అతనిచేత పూజలను గొని, ఉచితాసనమునఁ గూర్చుండి ఆరాజుదిక్కు మొగంబై- (ముందు పద్యముతో అన్వయము)

వ. ఇట్లనియె. 43

అర్థ. ఇట్లు, అనియెన్=ఈరీతిగా పలికెను.

క. భూనాయక నీ విప్పుడు

మ్లానాస్యుఁడ వగుచుఁ జాల ♦ మదిలోఁ జింతం

బూనుట కేమి కతం బన

నానారదుతోడ నాతఁ ♦ డనియెన్ మరలన్. 44

అర్థ. భూనాయక=రాజా; నీవు, ఇపుడు, అమ్లాన, ఆస్యుఁడవు; అగుచున్=నీవిప్పుడు వాఁడిన మొగముగలవాఁడవై; చాలన్=ఎక్కువగా; మదిలోన్=మనస్సునందు; చింతన్, పూనుటకు=విచారించుటకు; ఏమి, కతంబు, అనన్=కారణమేమని అడుగఁగా; ఆనారదుతోడన్, ఆతఁడు, అనియెన్, మరలన్=ఆనారదునితో తిరిగి యిట్లు చెప్పెను.

తా. రాజా, నీమొగము వాఁడియున్నది. నీమనస్సులోని విచారమునకు కారణమేమి? అని అడుగఁగా ఆతఁడిట్లనెను.

క. మునివర వివేకశాలియు

ననఘుఁడు నై దేవేంద్రబాలుఁ ♦ డస్మత్ప్రియసం

దనుఁ డుదయించె నగుచునే

తను బరిభవ మొందఁ జనియెఁ ♦ దల్లియుఁ దానున్. 45

అర్థ. మునివర=మునిశ్రేష్ఠుఁడా; వివేకశాలియున్=తెలివిగలవాఁడును; అనఘుఁడున్=పాపములేనివాఁడును; అయిదేవేంద్రబాలుఁ

డు=అయిదు సంవత్సరముల వయస్సుగల బాలుఁడైన; అస్మత్, ప్రియ నందనుఁడు=నా ప్రియమైనకొడుకు; అదయుఁడను, అగు, నాచేతన్=దయలేనినాచేత; పరిభవము, ఒంది=అవమానముపొంది; తల్లితోన్, కానన్=చనియెన్=తల్లితోకూడ వెళ్లెను.

తా. నారదమునీంద్రా! వివేకశాలియు, పాపరహితుఁడును అగు కుమారుఁడు నాచే నవమానముఁ బొందినవాఁడై తల్లితో కలసివెళ్లి పోయెను.

మ. చనియుగ్రాటవిఁ జొచ్చి యచ్చటఁ బరి♦శ్రాంతుండు క్షుత్పీ
డితుం, డును నామ్లానముఖాంబుజుండు ననఘుం♦డున్ బా
లుఁడు న్నైనను, మత్తనయున్ ఘోరవృకాహిభల్లముఖస♦
త్త్వశ్రేణినిర్జించెనో, యని దుఃఖించెద నాదు చిత్తమున
నా♦ర్యస్తుత్య యిట్లొట్టకున్. 46

అర్థ. చని=అట్లు తల్లితోపోయి; ఉగ్ర, అటవిన్, చొచ్చి=భయంకరమైన అడవిని ప్రవేశించి; పరిశ్రాంతుండున్=అలసిపోయినవాఁడును; క్షుత్, పీడితుండును=ఆఁకలిచే బాధింపఁబడినవాఁడును; ఆమ్లాన, ముఖ, అంబుజుండును=వాడినముఖపద్మముగలవాఁడును; అనఘుండున్=పాపములేనివాఁడును; బాలుఁడున్, ఐన=పిల్లవాఁడును అయిన; మత్, తనయున్=నాకొడుకును, ఘోర=భయంకరమైన; వృక, అహి, భల్ల, ముఖ, సత్త్వ, శ్రేణి=తోడేళ్లు, పాములు, ఎలుగుగొడ్డులు, మొదలగు జంతుసముదాయము; నిర్జించెనో, అని=చంపెనేమో అని; ఇట్లు, ఔటకున్=ఈవిధముగా జరుగుటకు; ఆర్యస్తుత్య=పెద్దలచే పొగడఁబడఁదగినవాఁడా; నాదు, చిత్తమునన్, దుఃఖించెదన్=నామనస్సులో శోకము పొందుచున్నాను.

తా. అట్లు నాకుమారుఁడు తల్లితో ఘోరాటవులఁజొచ్చి, అలసి, ఆఁకలిపొంది, వాడినమొగముగలవాఁడై, యచట ఘోరజంతువులచే చంపఁబడెనేమో యని మనస్సులో దుఃఖించుచున్నాను.

తే. అట్టియుత్తమబాలు నా ♦ యంకపీఠ
మందుఁ గూర్చుండ నీక ని ♦ రాకరించి
యంగనాసక్తచిత్తుండ ♦ నైనయట్టి
నాదుదౌరాత్మ్య మిది ముని ♦ నాథచంద్ర. 47

అర్థ. అట్టి, ఉత్తమ, బాలున్ = అట్టిశ్రేష్ఠుఁడైనకుమారుని, నా, అంకపీఠమందు = నాతొడమీఁద; కూర్చుండనీక = కూర్చుండనీయక; నిరాకరించి = తిరస్కారభావముతో; అనంగా, ఆసక్త, చిత్తుండను, ఐన, అట్టి = స్త్రీలోలుఁడనయిన; మునినాథచంద్ర = మునిశ్రేష్ఠుఁడా; ఇది, నాదు, దౌరాత్మ్యము = ఇది నా దుష్టబుద్ధియే.

తా. అట్టిశ్రేష్ఠుఁడైన బాలుని నాతొడపై నెక్కనీయక త్రోసివైచి స్త్రీలోలుఁడనై యుండుట నాదుర్బుద్ధితప్ప మఱియొకటి కాదు.

ఉ. నా విని నారదుండు నర ♦ నాథున కిట్లను నీకుమారుఁ డా
దేవకిరీటరత్నరుచి ♦ దీపితపాదసరోజుఁ డైనరా
జీవదళాక్షరక్షితుఁ డ ♦ శేషజగత్పరికీర్తనీయకీ
ర్తివిభవప్రశస్తసుచ ♦ రిత్రుఁడు వానికిదుఃఖమేటికిన్. 48

అర్థ. నాన్, వి = అనఁగావిని; నారదుండు = నారదుఁడు; నరనాథునకున్, ఇట్లు, అనున్ = రాజుతో ఇట్లు చెప్పుచున్నాఁడు; నీ, కుమారుఁడు = నీకొడుకు; ఆ, దేవ, కిరీట, రత్న, రుచి, దీపిత, పాద, సరోజుఁడు, ఐన = ఆదేవతలకిరీటములందలి రత్నములకాంతిచేత వెలిఁగింపఁబడిన పదపద్మములుగలవాఁడగు; రాజీవదళ, అక్ష, రక్షితుఁడు = పద్మపత్రాక్షుఁడయిన విష్ణుమూర్తిరక్షణను పొందియున్నవాఁడు; అశేష, జగత్, పరికీర్తనీయ, కీర్తి, విభవ, ప్రశస్త, సు, చరిత్రుఁడు = సమస్తలోకములచేతను స్తుతింపఁబడఁదగిన కీర్తివైభవముచేత ప్రఖ్యాతిపొందిన సచ్చరిత్రముగలవాఁడు; వానికిన్, దుఃఖము, ఏఁటికిన్ = వానికోసము దుఃఖింపనేల ?

తా. అనఁగా విని నారదుఁడుత్తానపాదమహారాజుతో ఇట్లు పలికెను. రాజా! నీకుమారుఁడు శ్రీమహావిష్ణువురక్షనుఁ బొందియున్నాఁడు; అతనికీర్తిని సమస్తలోకములను స్తుతించుచున్నవి. అట్టివానికోసము నీవు దుఃఖింపనవసరములేదు.

ఉ. కావున నమ్మహాత్ముఁడు సు ♦ కర్మముచేత సమస్తలోకపా
లావళి కందరానిసము ♦ దంచితనిత్యపదంబునం బ్రభు
శ్రీ విలసిల్లఁ జెందుఁ దుల ♦ సీదళదాము భజించి యాజగ
త్పావనుఁడైననీసుతుప్ర ♦ భావమెఱుంగవు నీవుభూవరా.

అర్థ. కావునన్=అందుచేత; ఆ, మహాత్ముఁడు=ఆమహిమాన్వితుఁడగు ధ్రువుఁడు; సుకర్మముచేత=తనసత్కర్మచేత; సమస్త, లోక పాల, ఆవళికి, అందరాని=సకలదిక్పాలురకును పొందశక్యముకాని; సముదంచిత, నిత్య, పదంబునన్=శ్రేష్ఠమైనట్టియు, నిత్యమైనట్టియు స్థానమున; ప్రభు, శ్రీ, విలసిల్లన్=ప్రభుత్వసంపదయొప్పుచుండఁగా; తులసీదళ, దామున్, భజించి=తులసీదళహారమును ధరించిన విష్ణుమూర్తిని సేవచేసి; చెందున్=పొందును; ఆ, జగత్, పావనుఁడు, ఐన=ఆజగత్తుకంతటికిని పవిత్రుఁడైన; నీ, సుత, ప్రభావమున్=నీకుమారుని ప్రభావమును; భూవరా=రాజా; నీవు, ఎఱుఁగవు=నీవు తెలిసికొనఁజాలవు.

తా. ఆధ్రువుఁడు తన సత్కర్మఫలముగా సమస్తదిక్పాలురను పొందలేని నిత్యమైనపదమును పొందును నీకుమారుని ప్రభావము నీ వెఱుంగఁజాలకున్నావు.

వ. అదియునుం గాక. 50

అర్థ. అదియునున్, కాక=ఇంతేకాక.

క. నీకీర్తియు జగములయం
దాకల్పము నిండఁజేయు ♦ సంచితగుణర

త్నాకరుఁ డిట కేతెంచును
శోకింపకు మతనిఁగూర్చి ♦ సుభగచరిత్రా. 51

అ. నీకీర్తియున్ = నీకీర్తికూడా; జగములయందు = లోకముల లోనెల్ల; అకల్పరున్, ఒందన్, చేయు = కల్పాంతమువఱకుమ ఉండునట్లుచేసే; అంచిత, గుణరత్నాకరుఁడు = మంచిగుణరత్నముల కొటపట్టయినధ్రువుడుఁ; ఇటకు, ఏతెంచును = ఇచ్చటికివచ్చును; సుభగచరిత్రా = శోభనమైనచరిత్రముగలవాఁడా; అతనిఁ, కూర్చి, శోకింపకుము = అతని కోసము దుఃఖము పొందకుము.

తా. రాజా! ఆధ్రువుఁడు నీకీర్తినికూడా లోకములందెల్ల కల్పాంతమునఱకు నిలుపును. అతఁ డిచటికివచ్చును. నీవాతనికోసము దుంఖించకుము.

క. అని నారదుండు పలికిన
విని మనమున విశ్వసించి ♦ విభుఁడును బ్రియనం
దనుఁ జింతించుచు నాదర
మునఁ జూడం డయ్యె రాజ్య ♦ మును బూజ్యముగన్. 52

అ. అని, నారదుండు, పలికినన్ = ఇట్లు నారదుఁడు పలుఁకగా, విని = విని; విభుఁడును = ఆరాజు; మనమునన్, విశ్వసించి = మనస్సులో నమ్మి; ప్రియనందనున్, చింతించుచున్ = తనకు ప్రియుఁడైన కుమారుని తలంచుచు; రాజ్యమును, పూజ్యమునన్, ఆదరమునన్, చూడండయ్యెన్ = రాజ్యమును గౌరవముగఁగాని, ఆదరముతోఁగాని చూడకుండెను.

తా. ఇట్లు పలికిన నారదుని మాటలు విని మనస్సులో నమ్మి ఆ రాజు రాజ్యమును ఆదరముతో చూడకుండెను.

వ. అంత నక్కడ నాధ్రువుండు. 53

అ. అంతన్, అక్కడ, ఆ, ధ్రువుఁడు = ఇట్లుండఁగా అచ్చట ధ్రువుఁడు.

క. చని ముందటఁ గనుఁగొనె మధు
వనమును మునియోగిదేవ ♦ వర్ణితగుణపా
వనమును దుర్భవజలదప
వనమును నిఖిలైకపుణ్య ♦ వరభవనంబున్. 54

అర్థ. చని=పోయి; ముందటన్=తనముందర; ముని, యోగి, దేవ, వర్ణిత, పావనమును=మునులచేతను, యోగులచేతను, దేవతలచేతను, వర్ణింపఁబడుపవిత్రతఁగలిగినట్టిదియు; దుర్భవ, జలద, పవనమును=సంసారమను మేఘమునకు వాయువువంటిదియు; నిఖిల, ఏక, పుణ్య, వర, భవనంబున్=సమస్తపుణ్యములకును తానయిన శ్రేష్ఠమగు స్థానమును అయిన; మధువనమును, కనుఁగొనెన్=మధువనమును చూచెను.

తా. అట్లుపోయి తనయెదుట మునులు, యోగులు, దేవతలు వర్ణింపఁదగిన పవిత్రతఁగలిగినట్టిదియు, సంసారమను మేఘమును పోఁగొట్టు వాయువువంటిదియు, పుణ్యమున కొలపట్టును అయిన మధువనమును చూచెను.

వ. అట్లు గని డాయం జని యమునానదిం గృతస్నానుండై నియతుండును సమాహితచిత్తుండునునై సర్వేశ్వరుని ధ్యానంబు సేయుచుం ద్రిరాత్రత్రిరాత్రంబుల కొక్కమాఱు కృతకపిత్థబదరీఫలపారణుం డగుచు దేహస్థితి ననుసరించి యొక్కమాసంబు హరిం బూజించి యంతనుండి యాఱేసిదినంబుల కొక్కపరి కృతజీర్ణతృణపర్ణాహారుండగుచు రెండవమాసంబున విష్ణుసమారాధనంబు సేసి యంతనుండి నవరాత్రంబుల కొకమా ఱుదకభక్షణంబు సేయుచు మూఁడవమాసంబున మాధవు నర్చించి యంతనుండి

ద్వాదశదినంబుల కొకతోయంబు వాయుభక్షణుం డగుచు జితశ్వాసుండై నాలవమాసంబునం బుండరీకాక్షుని భజియించి యంతనుండి నుసంబున నలయక నిరుచ్ఛ్వాసుండై యేకపదంబున నిలిచి పరమాత్మం జింతించుచు సచేతనం బైన స్థాణువుంబోలె నైదవమాసంబును జరపె నంత. 55

అర్థ. అట్లు=ఆప్రకారముగా; కని=చూచి; డాయన్, చని=సమీపించి; యమునానదిన్, కృత, స్నానుండై=యమునానదిలో స్నానముచేసి; నియతుండును=నియతాచారుండును; సమాహిత, చిత్తుండును, ఐ=శాంతినొందినమనస్సుకలవాఁడును అయి; సర్వేశ్వరుని, ధ్యానంబు, చేయుచున్=విష్ణుమూర్తిని ధ్యానించుచు, త్రిరాత్ర, త్రిరాత్రంబులకు, ఒక్కమాఱు=మూఁడేసిరాత్రులకొకసారి; కృత, కపిత్థ, బదరీఫల, పారణుండు అగుచున్=వెలగపండును, రేగుపండును తినుచు; దేహస్థితిన్, అనుసరించి=శరీరస్థితినిబట్టి; ఒక్కమాసంబు, హరిన్, పూజించి=ఒకనెల విష్ణుమూర్తిని పూజచేసి; అంతనుండి=అప్పటినుండియు; ఆఱేసిదినంబులకు, ఒక్కపరి=ఆరేసిరోజులకొకసారి; కృత, జీర్ణ, తృణ, పర్ణ, ఆహారుండు, అగుచున్=ఎండినగడ్డిని, ఆకులను తినుచు; రెండవమాసంబునన్=రెండవనెలలో; విష్ణుసమారాధనంబు, చేసి=విష్ణుమూర్తిపూజచేసి; అంతనుండి, అప్పటినుండియు; నవరాత్రంబులకు, ఒకమాఱు=తొమ్మిదిరోజులకొకసారి; ఉదకభక్షణంబు, చేయుచు=నీళ్లు త్రాగుచు; మూఁడవమాసంబునన్=మూఁడవనెలలో; మాధవున్, అర్చించి=విష్ణుమూర్తిపూజచేసి; అంతనుండి=అప్పటినుండియు; ద్వాదశదినములకు, ఒకతోయంబు=పన్నెండుదినములకొకసారి; వాయుభక్షణుండు, అగుచున్=వాయువు భక్షించుచు; జిత, శ్వాసుండు, ఐ=శ్వాసము జయించినవాఁడై; నాలవమాసంబునన్=నాలుగవనెలలో, పుండ

రీకాయునిన్, భజియించి = విష్ణుమూర్తిని పూజించి; అంతనుండి = అప్పటినుండియు; మనంబునన్ = మనస్సులో; అలయక = అయాసముపొందక; నిర్, ఉత్, శ్వాసుండు, ఐ = ఎగయూఁపిరిని ఆపి; ఏక, పదంబునన్, నిలిచి = ఒక పాదముమీఁద నిలువఁబడి; పరమాత్మన్, చింతించుచున్ = పరమాత్మయైన విష్ణుమూర్తిని ధ్యానించుచు; సచేతనంబు, ఐన, స్థాణువున్, పోలెన్ = ప్రాణముతోఁగూడిన స్తంభమువలె; ఐదవ మాసంబును, జరిపెన్ = ఐదో నెలకూడ జరిపెను; అంతన్ = పిమ్మట.

తా. స్పష్టము.

సీ. సకలభూతేంద్రియా ♦ శయ మగుహృదయంబు
నందు విషయములఁ ♦ జెంద నీక
మహదాదితత్త్వస ♦ మాజమ్ములకును నా
ధారభూతమును బ్ర ♦ ధానపూరు
షేశ్వరుఁ డైనట్టి ♦ శాశ్వతబ్రహ్మంబుఁ
దన దైనహృదయప ♦ ద్మమున నిలిపి
హరిరూపమునకంటె ♦ నన్యంబు నెఱుఁగక
చిత్త మవ్విభునందుఁ ♦ జేర్చియున్న
తే. కతన ముల్లోకములు సాలఁ ♦ గంప మొందె
వెండియును బేర్చి యయ్యర్భ ♦ కుండు ధరణి
నొక్కపాదంబు చేర్చి ని ♦ ల్చున్నవేళఁ
బేర్చి యబ్బాలునంగుష్ఠ ♦ పీడఁ జేసి. 56

అర్థ. సకల, భూత, హిత, ఇంద్రియ, ఆశయము, అగు = సమస్త జీవకోటికిని హితమయిన స్థానమగు; హృదయంబునందు = హృదయములో; విషయములన్, చెందనీక = భోగేచ్ఛను చేరనీయక; మహత్, ఆది, తత్త్వ, సమాజమ్ములకును = బుద్ధి మొదలయిన ఇరవైఅయిదు తత్త్వము

లకును; ఆధారభూతమును=ఆధారమయినట్టియు; ప్రధాన, పూరుష, ఈశ్వరుఁడు, ఐనట్టి=ప్రధానమైనపురుషశ్రేష్ఠుఁడగు; శాశ్వత, బ్రహ్మంబున్=నాశనములేని పరబ్రహ్మమును; తనది, ఐన, హృదయపద్మమునన్, నిలిపి=తన హృదయమను పద్మమునందు కుదురుకొలిపి; హరిరూపమున కంటెన్=విష్ణుమూర్తిరూపముతప్ప; అన్యంబున్, ఎఱుఁగక=ఇతరమునందు గుఱియుంచక; చిత్తమున్=మనస్సును; ఆ, విభునందున్=ఆదేవదేవునియందు; చేర్చియున్న కతనన్=చేర్చియుండుటవలన; ముల్లోకములున్=మూఁడులోకములును; చాలన్, కంపము, ఒందెన్=చాలవణఁకుచుండెను; వెండియును=మరల; పేర్చి=ఉత్సాహముతో; ఆ, అర్భకుండు=ఆ బాలుఁడైన ధ్రువుఁడు; ధరణిన్=భూమిపై; ఒక్కపాదమున్, చేర్చి, నిల్చున్న వేళన్=ఏకపాదముమీఁద నిలువఁబడినప్పుడు; పేర్చి=ఎక్కువగా; ఆ, బాలు, అంగుష్ఠపీడన్, చేసి=ఆబాలుని బొటనవ్రేలి తాకుడువలన కలిగిన బాధచేత;

తే. వసుమతీతల మర్ధము ♦ వంగఁ జొచ్చె
భూరిమదదుర్నివారణ ♦ వారణేంద్ర
మెడమఁ గుడి నొరగఁగ నడు ♦ గడుగునకును
జలన మగునుదధిస్థిత ♦ కలముఁబోలె. 58

భూరి, మద, దుర్నివారణ, వారణేంద్రము=మిక్కిలి మదించియున్న మదపుటేనుఁగు; ఎడమన్, కుడిన్, ఒరగఁగన్=కుడివైపునకును, ఎడమవైపునకును ఒరుగుచుండఁగా; అడుగడుగునకును=ప్రతి అడుగునకును; చలనము, అగు=కదలుచుండు; ఉదధి, స్థిత, కలము, పోలెన్=సముద్రములో నున్న ఓడవలె; వంగన్, చొచ్చెన్=వంగసాగెను.

తా. ధ్రువుఁడిట్లు హృదయమునందు విషయాసక్తినివదలి, పరబ్రహ్మము తనహృదయమునందు చేర్చి తదేకధ్యానముతో నున్న సమయమునందు మూఁడులోకములును కంపమునొందసాగెను, ఏకపాదముపై

నిలుచుండఁగా అతనిబొటనవ్రేలి భారముచేత సముద్రములోని పడవ తనయందున్న ఏనుఁగు ఇటునటు తిరుగునప్పుడు ప్రక్కలకు ఒరగునట్లు భూమియందలి సగముభాగము వంగిపోఁజొచ్చెను.

చ. అతఁడు ననన్యదృష్టి నచ◆రాచరదేహశరీరధారణా
స్థితిగలయీశునందుఁ దన◆జీవితముం ఘటియింపఁ జేసి యే
కతఁగనఁ దన్నిరోధమునఁ◆గైకొని కంపమునొందె నీశ్వరుం
డతఁడు చలింప నిజ్జగము◆లన్నియుఁ గంపలమయ్యె భూవరా.

అర్థ అతఁడున్=ఆధ్రువుఁడు; అనన్యదృష్టిని=నిశ్చలమైనదృష్టితో; చర, అచర, దేహ, శరీరధారణ, స్థితి, కల=చరాచర శరీరముచేతనశరీరముగాఁగల; ఈశునందున్=ఈశ్వరునియందు; తన, జీవితమున్, ఘటియింపన్, చేసి=తనజీవితమునునిలిపి; ఏకతన్, కనన్=ఈశ్వరునిలో ఐక్యముపొందఁగా; తత్, నిరోధమువలన్=ఆబ్రహ్మమునకు కలిగిన నిరోధముచేత; కైకొని=అడ్డుబాటునుపొంది; ఈశ్వరుండు, కంపమున్, ఒందెన్=ఈశ్వరుఁడు వడఁకుఁబాటుపొందెను; అతఁడు, చలింపన్=అతఁడు కంపముఁబొందఁగా; భూవరా=రాజా; ఈ, జగములు, అన్నియున్, కంపమున్, ఒందెన్=ఈలోకములన్నియు వడఁకసాగెను,

తా. చరాచర ప్రపంచమంతయు దేహముగాఁగల ఈశ్వరుని యందు ధ్రువుఁడు మనస్సు చేర్చి నిరోధింపఁగా, ఆనిరోధమువల్ల నా యీశ్వరునియందు కంపముకలిగెను. అతఁడు కంపమునొందఁగా లోకములన్నియు కంపింపసాగెను.

క. ఆలోకభయంకర మగు
నాలోకమహావిపద్ద◆శాలోకను లై
యాలోక పాలు రందఱు
నాలోకశరణ్యుఁ గాన◆నరిగిరి భీతిన్. 60

అర్థ. ఆ, లోకభయంకరము, అగు=అట్టిలోకభీతికరమగు; ఆ, లోక, మహా, విపత్, దశ, ఆలోకనులు, ఐ=లోకములకు కలిగిన మహాపదను చూచినవారై; ఆ, లోకపాలురు, అందఱున్=అదిక్పాలురందఱును; ఆలోకశరణ్యున్=సమస్తలోకములను రక్షించునట్టి శ్రీమహావిష్ణువును; కానన్, అరిగిరి, భీతిన్=భయముతో చూడఁబోయిరి.

తా. అట్లు లోకభయంకరమగు మహావిపత్తును చూచి లోకపాలురందఱును భయముతో శ్రీమహావిష్ణువును చూడఁబోయిరి.

వ. అట్లరిగి నారాయణు నుద్దేశించి కృతప్రణాములై కరం
బులు ముకుళించికొని యిట్లనిరి. 61

అర్థ. అట్లు, అరిగి=ఆరీతిగాపోయి; నారాయణున్, ఉద్దేశించి=నారాయణమూర్తితో; కృతప్రణాములు, ఐ=ప్రణామములు చేసి; కరంబులు, ముకుళించుకొని=చేతులు జోడించి; ఇట్లు, అనిరి=ఈవిధముగా పలికిరి.

తా. వారట్లు పోయి శ్రీమన్నారాయణునకు నమస్కరించి చేతులు జోడించి యిట్లు పలికిరి.

చ. హరి పరమాత్మ కేశవ చ ♦ రాచరభూతశరీరధారివై
పరఁగుదువీవునిట్టులుగఁ ♦ బ్రాణనిరోధము లెందు మున్ను నే
మెఱుఁగము నాథ నాథ జగ ♦ దీశ్వర సర్వశరణ్య నీపదాం
బురుహము లర్థిమై శరణు ♦ వొందెద మార్తి హరించి కావవే.

అర్థ. హరి, పరమాత్మ, కేశవ; చర, అచర, భూత, శరీర, ధారివి, ఐ=జంగమస్థావరరూపమైన జీవములే శరీరముగాఁగలవాఁడవై; ఈవు పరఁగుదువు=నీవు ఒప్పుదువు; అనాథనాథ=దిక్కులేనివారిని రక్షించువాఁడా; ఇట్టులుగన్=ఈరీతిగా; ప్రాణనిరోధములు=ప్రాణములకు నిరోధముగలుగుట; ఎందున్, మున్నున్, ఏము, ఎఱుఁగము=పూర్వ

కాలమం దెన్నటను చూడలేదు; జగత్, ఈశ్వర ! సర్వశరణ్య=జగత్ప్రభువా, సర్వలోకశరణ్యా ; నీపద, అంబురుహములు=నీపాదపద్మములను; ఆర్తిమైన్=కోరికతో; శరణు, పొందెదము=శరణుచొచ్చెదము; ఆర్తి, హరించి, కావవే=బాధను; పోఁగొట్టి, కావుమా.

తా. చరాచరజంతుజాలమంతయును శరీరముగాఁగల నీకిట్లు ప్రాణనిరోధము కలుగుట మేమెన్నడును చూడలేదు జగత్ప్రభూ! నీ పాదపద్మముల నాశ్రయించుచున్నాము. మా బాధను పోఁగొట్టి మమ్ము కావుము.

వ. అని దేవతలు విన్నవించిన నీశ్వరుండు వారల కిట్లనియె నుత్తానపాదుం డనువానితనయుండు విశ్వరూపుండ నయిన నాయందుఁ దనచిత్తం బైక్యత సేసి తపంబు గావించుచుండ దానం జేసి భవదీయప్రాణనిరోధం బయ్యె నట్టిదురత్యయం బైన తపంబు నివర్తింపఁజేసెద వెఱవకుఁడు మీమీ నివాసంబులకుం జనుం డని యానతిచ్చిన నా దేవతలు నిర్భయాత్ములై యీశ్వరునకుం బ్రణామంబు లాచరించి త్రివిష్టపంబునకుం జనిరి తదనంతరంబ. 63

అర్థ. అని=అని పలికి; విన్నవించినన్=ప్రార్థనముచేయఁగా: ఈశ్వరుండు వారలకున్, ఇట్లు, అనియెన్=నారాయణమూర్తివారితో ఇట్లుపలికెను; ఉత్తానపాదుండు, అనువాని, తనయుండు=ఉత్తానపాదుఁడను రాజుయొక్క కుమారుఁడు; విశ్వరూపుఁడను, అయిన, నాయందు=విశ్వమే రూపముగాఁగల నాయందు; తన, చిత్తంబు, ఐక్యత, చేసి=తనమనస్సును ఏకముచేసి; తపంబు, కావించుచుండన్=తపస్సుచేయుచుండఁగా; దానం జేసి=అందువలన; భవదీయ, ప్రాణనిరోధంబు, అయ్యెన్=మీప్రాణములకు నిరోధముకలిగినది; అట్టి, దురత్యయంబు, అయిన, తపంబున్, నివర్తింపన్, చేసెద=సాటిలేని ఆతపస్సును మర

లించెదను; వెఱవకు=భయపడకు; మీ, మీ, నివాసంబులకున్, చనుండు=మీగృహములకు వెళ్లుఁడు; అని అనతిచ్చినన్=అని ఆజ్ఞాపింపఁగా; ఆ, దేవతలు=ఆదేవతలు; నిర్భర, ఆస్థులు, ఐ=భయమును వదలినవారై; ఈశ్వరునకున్, ప్రణామంబులు, ఆచరించి=నారాయణమూర్తికి నమస్కారములు చేసి; త్రివిష్టపంబునకున్, చనిరి=స్వర్గలోకమునకు పోయిరి; తత్, అనంతరంబ=పిమ్మట- (ముందుపద్యముతో అన్వయము.)

తా. స్పష్టము.

సీ. హరి యీశ్వరుండు వి ♦ హంగకులేశ్వర
యానుఁడై నిజభృత్యుఁ ♦ డైనధ్రువుని
గనుఁగొనువేడుక ♦ జనియింప నామధు
వనమున కప్పుడు ♦ సని ధ్రువుండు
పరువడి యోగవి ♦ పాకతీవ్రం బైన
బుద్ధిచే నిజమనో ♦ బురుహముకళి
యందుఁ దటిత్ప్రభా ♦ యతమూర్తి యటుఁ దిరో
ధానంబునను బొంది ♦ తత్క్షణంబ
తే. తనపురోభాగమందు ని ♦ ల్చినను బూర్వ
సమధికజ్ఞాననయనుఁగో ♦ పరసమగ్ర
మూర్తిఁ గనుఁగొని సంభ్రమ ♦ మునను సమ్ము
దాశ్రువులు రాలఁ బులకీకృ ♦ తాంగుఁ డగుచు. 64

అర్థ. హరి, ఈశ్వరుండు=ప్రభువగు శ్రీవిష్ణువు; విహంగకుల, ఈశ్వర, యానుఁడు, ఐ=పక్షిశ్రేష్ఠుఁడగు గరుడునిపై నెక్కి; నిజభృత్యుఁడు, ఐన, ధ్రువునిన్=తన సేవకుఁడైన ధ్రువుని; కనుఁగొను, వేడుక,

జనియింపఁగ = చూచువేడుక పుట్టఁగా; ఆ, మధువనమునకు, అప్పుడు, చని = అప్పుడా మధువనమునకుఁ బోయి; ధ్రువుండు = ధ్రువుఁడు; పరువడిన్ = ఎక్కువగా; యోగ, విపాక, తీవ్రంబు, ఐన = యోగపరిపాకముచేత = ఉగ్రమైన; బుద్ధిచేన్ = బుద్ధిచేత; నిజ, మనః, అంబురుహ, ముకుళమునందు = తనమనస్సను తామరమొగ్గయందు; తటిత్, ప్రభా, ఆకృత, మూర్తి = మెఱపుతీఁగవంటి రూపముగల మహావిష్ణువు; అపుడ్ = ఆహృదయములో; తిరోధానంబునను, పొంది = దాఁగియుండి; తత్క్షణంబ = వెంటనే; తనపురోభాగమందు = తనయెదుట; నిలిచినను = నిలువఁగా; పూర్వ, సమధిక, జ్ఞాననయన, గోచర, సమగ్రమూర్తిన్ = పూర్వజన్మవాసనచే కలిగిన జ్ఞాననేత్రమునకు గోచరించిన సంపూర్ణ ఈశ్వర స్వరూపమును; కనుఁగొని = చూచి; సంభ్రమమునను = తడఁబాటుతో; సమ్మద, అశ్రువులు, రాలన్ = ఆనందబాష్పములు రాలుచుండఁగా; పులకీకృత, అంగుఁడు, అగుచున్ = గగుర్పాటు పొందిన దేహముగలవాఁడై- (ముందు పద్యముతో నన్వయము)

తా. అట్లు శ్రీమన్నారాయణుఁడు గరుడవాహనుఁడై తనదాసుఁడగు ధ్రువుని చూచుకోరికతో వచ్చి యోగపరిపాకముచే తీవ్రమైన అతని హృదయపద్మమందు నిలిచి, మెఱపుతీఁగవలె నంతలో అంతర్ధానము పొంది, మఱల అతనియెదుట నిలువఁబడఁగా ఆధ్రువుఁడు పూర్వభవార్జితమైన జ్ఞాననేత్రముతో శ్రీమహావిష్ణువుయొక్క సంపూర్ణస్వభావమును చూచి, తొట్రుపాటుపడి, ఆనందబాష్పములఁ గార్చుచు, ఒడలు పులకరింప- (ముందుపద్యముతో అన్వయము)

సాక్షాత్కరించిన భగవంతుని ధ్రువుఁడు స్తుతించుట.

తే. నయనముల విభుమూర్తిఁ బా ♦ నంబు సేయు
పగిదిఁ దనముఖమును జుం ♦ బనము సేయు
లీలఁ దగిలి భుజములను నా ♦ లింగనంబు
సేయుగతి దండవన్నమ ♦ స్కృతు లొనర్చె. 65

అర్థ. నయనములన్ = కన్నులతో; విభు, మూర్తిన్ = శ్రీవిష్ణువు యొక్క స్వరూపమును; పానంబు, చేసి, పగిదిన్ = త్రాగివేయునట్లును; తన, ముఖమును, చుంబనము చేసి, లీలన్ = అతని ముఖమును ముద్దిడునట్లుగాను; తగిలి = ప్రీతితో; భుజములను, ఆలింగనము చేసి, గతిన్ = భుజములతో కౌఁగిలించుకొనునట్లును; దండ, నమస్కృతులు, ఒనర్చెన్ = దండనమస్కారములు చేసెను.

తా. ఆవిష్ణుమూర్తి స్వరూపమును కన్నులతో త్రాగివేయువట్లును, ముఖమును ముద్దిడుచున్నట్లును, బాహువులతో కౌఁగిలించుకొనుచున్నట్లును దండనమస్కారములు చేసెను.

వ. ఇట్లు దండప్రణామంబులాచరించి కృతాంజలియై స్తోత్రం బు సేయ నిశ్చయించి స్తుతిక్రియాకరణసమర్థుండుగాక యున్న ధ్రువునకును సమస్తభూతంబులకు నంతర్యామి యైన యీ శ్వరుం డాతనితలం పెఱింగి వేదమయం బయిన తన శంఖంబు జేత నబ్బాలుని కపోలతలం బంటిన జీవేశ్వరనిర్ణయజ్ఞుండును భక్తిభావనిష్ఠుండును నగుధ్రువుండు నిఖిలలోకవిఖ్యాతకీ ర్తిగల యీశ్వరుని భగవత్ప్రతిపాదితంబులగుచు వేదార్థ కంబులైన తనవాక్కుల నిట్లని స్తుతియించె దేవా నిఖిలశక్తి ధరుండవు నంతఃప్రవిష్టుండవునైన నీవు లీనంబులైన మదీ యవాక్కులం బ్రాణేంద్రియంబులం గరచరణశ్రవణత్వ గాదులను జిచ్ఛక్తిచేఁ గృపం జేసి జీవింపం జేసిన భగవంతుండ వును బరమపురుషుండవును నైన నీకు నమస్కరింతు నీవొ క్కరుండవయ్యు మహదాద్యంబైన యీయశేషవిశ్వంబు మాయాఖ్యం బయిన యాత్మీయశక్తిచేతం గల్పించి యం

మ్ముం బ్రవేశించి యింద్రియంబులందు వసించుచుఁ దత్తద్దే
వతారూపంబులచే నానాప్రకారంబుల దారువులందున్న
వహ్నిచందంబునం బ్రకాశింతు వదియునుం గాక 66

అర. ఇట్లు = ఈవిధముగా; దండప్రణామంబులు, ఆచరించి = దండనమస్కారములు చేసి; కృత, అంజలి, ఐ = దోసిలొగ్గి; స్తోత్రింపు, చేయఁగ, నిశ్చయించి = స్తుతింప నెంచి; స్తుతిక్రియా, కరణ, సమర్థుండు, కాక, ఉన్న = స్తుతిచేయుటకు సమర్థుఁడు కాక ఉండిన; ధ్రువునకును = ధ్రువునికిని; సమస్త, భూతంబులకును = సకలజీవములకును; అంతర్యామి, ఐన, ఈశ్వరుండు = హృదయవర్తియైన పరమేశ్వరుఁడు; ఆతని, తలంపు, ఎఱింగి = ఆతని తలఁపును తెలిసికొని, వేదమయంబు, అయిన, తన శంఖంబుచేత = వేదాత్మకమగు తనశంఖముతో; ఆ, బాలుని, కపోలతలంబు, అంటినన్ = ఆధ్రువుని నుదుటిపై తాఁకఁగా; జీవ, ఈశ్వర, నిర్ణయజ్ఞుండు = జీవాత్మ, పరమాత్మల తారతమ్యము నెఱింగినవాఁడును; భక్తి, భావ, నిష్ఠుండును, అగు = స్థిరమయిన భక్తిని గలవాఁడును అయిన; ధ్రువుండు = ధ్రువుఁడు; నిఖిల, లోక, విఖ్యాత, కీర్తి, కల = సమస్తలోకములందును ప్రసిద్ధిపొందిన కీర్తిగల; ఈశ్వరునిన్ = శ్రీనివాసమూర్తిని, భగవత్, ప్రతిపాదితంబులు, అగుచు = భగవత్ప్రోక్తములై, వేద, ఆత్మకంబులు, ఐన = వేదమయములైన; తన, వాక్యంబులన్ = తనమాటలతో; ఇట్లని, స్తుతియించెన్ = ఈరీతిగా స్తోత్రము చేసెను; దేవా = ప్రభువా, నిఖిల, శక్తి, ధరుండవు = సమస్తశక్తులను ధరించినవాఁడవును; అంతః, ప్రవిష్టుండవును, అయిన = భూతాంతర్వర్తివి యైన; నీవు = నీవు; లీనంబులు, అయిన, మదీయ, వాక్యంబులన్, లయముపొందిన నామాటలను; ప్రాణేంద్రియంబులన్ = ప్రాణము, ఇంద్రియములను; కర, చరణ, త్వక్, ఆదులను = చేతులు, పాదములు, చర్మము మొదలుగువానిని, చిత్, శక్తిన్ = జ్ఞానశక్తిచేత; జీవింపఁ, చేసిన = జీవింపఁజేసియున్నట్లు

చేసిన ; భగవంతుండవు=సర్వవిభూతులను గలిగినవాఁడవును; పరమపురుషుండవు=పురుషోత్తముఁడవును ; అయిన=అయినట్టి; నీకున్ నమస్కరింతున్=నీకునమస్కారము చేసెదను ; నీవు, ఒక్కరుండవు. అద్వయ=నిత్యపదార్థమవు నీవొక్కఁడవేఅయినను ; మహత్, ఆద్యంబు, అయిన=మహత్తు మొదలయిన యిరువైఅయిదు తత్త్వములచే నిర్మింపఁబడిన; ఈ, అశేష, విశ్వంబు=ఈసకలప్రపంచమును ; మాయా, ఆఖ్యంబు, అయిన=మాయయనుపేరుగల; ఆత్మీయ, శక్తిచేతన్ =నీశక్తిచేత ; కల్పించి=సృష్టిచేసి; అందున్, ప్రవేశించి=అందులో ప్రవేశించి ; ఇంద్రియంబులందు, వసించుచు=కర్మ, జ్ఞానేంద్రియములందునిలచి ; తత్, తత్, దేవతా, రూపంబులచేన్=ఆయాదేవతల రూపములతో ; నానా, ప్రకారములన్=అనేకవిధములుగా ; దారువులందు, ఉన్న, వహ్ని, చందంబునన్=కట్టెలయందు దాగియున్న అగ్నివలె ; ప్రకాశింతువు=ప్రకాశించుచుందువు, అదియునున్, కాక= ఇంతేకాక.

తా. స్పష్టము.

చ. వరమతి నార్తబాంధవ భ ♦ వద్ఘనబోధసమేతుఁడై భవ
చ్చరణముఁ బొందినట్టివిధి♦సర్గము సుప్తజనుండుబోధమం
దరయఁగఁ జూచురీతిఁ గను ♦ నట్టిముముక్షుశరణ్యమైన నీ
చరణములం గృతజ్ఞుఁ డగు♦సజ్జనుఁడెట్లు దలంపకుండెడున్.

అర్థ. ఆర్తబాంధవ=దీనశరణ్య ! వరమతిన్=మంచిబుద్ధితో; భవత్, ఘన, బోధ, సమేతుఁడు, ఐ=నీదయిన గొప్పజ్ఞానమును గలిగి ; భవత్, చరణము, పొందినట్టి, విధి=నీపాదముల నాశ్రయించిన బ్రహ్మదేవుఁడు; సర్గమునన్=సృష్టిని; సుప్తజనుండు=నిదురించుచున్న వాఁడు , బోధమందు, అరయఁగన్, చూచి, రీతిన్=మేల్కొనియున్న

ప్పుడు చూచునట్లే; కనున్=చూచును; అట్టి, ముముక్షు. శరణ్యము, ఐన=అట్టి మోక్షేచ్ఛగలవారు శరణుచొరఁదగిన; నీ, చరణములన్=నీపాదములను, కృతజ్ఞుఁడు,. అగు, సజ్జనుఁడు=చేసినమేలును తెలిసికొను సత్పురుషుఁడు; ఎట్లు, తలంపకుండెడున్=తలంపకుండ నెట్లు ఉండఁగలఁడు?

తా. ఆర్తబాంధవా! బ్రహ్మ నిన్ను తెలుసుకొని, నీచరణములనాశ్రయించి, నిద్రపోవుచున్నవాఁడు జగత్తును మేల్కొని చూచుచున్నట్లే చూచుచుండును. నీవు మోక్షేచ్ఛగలవారికి శరణమవు. అట్టినిన్ను కృతజ్ఞుఁ డగువాఁడు తలంపకుండునా?

సీ. మహితాత్మ మఱి జన్మ ♦ మరణప్రణాశన
హేతుభూతుండవు ♦ నిష్టకల్ప
తరువవు నగునిన్నుఁ ♦ డగ నెవ్వరే నేమి
పూని నీమాయావి ♦ మోహితాత్ము
లగుచు ధర్మార్థకా ♦ మాదులకొఱకుఁ దా
మర్చించుచును ద్రిగు ♦ ణాభ మైన
దేహోపభోగ్యమై ♦ దీపించు సుఖముల
నెనయంగ మదిలోన ♦ నెంచ రట్టి
తే. విషయసంబంధజన్య మై ♦ వెలయుసుఖము
వారికి నిరయమందును ♦ వఱలు దేవ
భూరిసంసారతాపని ♦ వారగుణక
థామృతాపూర్ణ యీశ మా ♦ ధవ ముకుంద. 68

అర్థ. మహితాత్మ=మహానుభావా! మఱి=ఇంకను; జన్మమరణప్రణాశన, హేతుభూతుండవు=పుట్టుక, చావు; నాశనము అను, వానిని కలిగించువాఁడవును; ఇష్ట, కల్పతరువవున్, అగు=ప్రశస్తమైన

కల్పవృక్షమువంటివాఁడవైన; నిన్నున్ = నిన్ను; తగన్ = ఒప్పునట్లు; ఎవ్వరేనిన్ = ఎవరయితే; ఏమి, ప్రాని = ఏమి ఆరంభించి; నీ, మాయా, విమోహిత, ఆత్ములు, అగుచున్ = నీమాయచేత మోహము పొందినబుద్ధిక లవారై; ధర్మ, అర్థ, కామ, అదులకొఱక = ధర్మము, అర్థము, కామము మొదలైనవానికొరకు; తాము = తాము; అర్చింతురు = భజించుచు; త్రిగుణ, అధమ, అయిన = సత్త్వరజస్తమోగుణములతో గూడిన; దేహ = దేహముచేత; సంభోగ్యమై = అనుభవింపఁదగినదై; దీపించు = ఒప్పునట్టి; సుఖములన్ = సౌఖ్యములను; ఎనయంగన్ = పొందుటకు; మనములోనన్ = మనస్సులో; ఎంతురు = తలంతురో; అట్టి, విషయ, సంబాధ, జన్యము అయి = అట్టి విషయసంబంధమైనట్టి; వెలయు = ఒప్పునట్టి; సుఖము = సౌఖ్యము; వారికిన్ = వారికి; నిరయమందున = నరకలోకములో కూడ; దేవ = ప్రభువా; భూరి, సంసార, తాప, నివారణ, కథా, అమృతపూర్ణ = గొప్పసంసారతాపమును పోఁగొట్టు గుణకథనము అమృతముచే పరిపూర్ణమైనవాఁడా; ఈశ = ఈశ్వరా; మాధవా = శ్రీపతీ; ముకుంద = ముకుందా; కలుగున్ = కలుగును.

తా. శ్రీనివాసా నీవు సృష్టిలయ కారకుఁడవు కల్పతరువువంటివాఁడవు నీమాయచే మోహముపొంది చతుర్విధపురుషార్థములకొఱకు త్రిగుణాత్మకమైన శరీరముచేత అనుభవింపదగిన సౌఖ్యములను పొందుటకై జనులు నిన్నుభజించుచుందురు. అట్టివిషయ సంబంధములగు సౌఖ్యములను వారు నరకలోకమందును అనుభవించుచుందురు.

మ. అరవిందోదర తావకీనచరణ ♦ ధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ ♦ స్వానందక బ్రహ్మామం
దరయన్ లేవఁటుదండభృద్భటవిమా ♦ నాకీర్ణులైకూలు నా
సురలోకస్థులఁ జెప్ప నేల సుజన ♦ స్తోమైకచింతామణీ. 69

అర్థ. అరవింద, ఉదర=పద్మనాభా; తావకీన=నీయొక్క చరణ, ధ్యాన. అనురాగ, ఉల్లసత్, చరిత్ర, ఆకర్ణన, జాత, భూరి, సుఖములు=నీపదధ్యానమునందు అనురక్తిపొందిన సచ్చరిత్రములను వినుటవలన గలిగిన సౌఖ్యములు; స్వ, ఆనందక, బ్రహ్మమందున్=తనలో తాను ఆనందమును పొందునిర్గుణబ్రహ్మమునందు, ఎరయన్=విచారింపగా? లేవుఅంట=వుండవంట; సుజన, స్తోమ, ఏక, చింతామణీ=సజ్జనులకు చింతామణిరత్నమును పోలినవాడా; దండభృత్, భట, విమాన, ఆకీర్ణులు, అయి=యమభటుల విమానములచేత కప్పబడినవారై, కూలు=అధోగతిపాలగు; అసురలోకస్థులన్=నరకలోకవాసులను గూర్చి, చెప్పగ ఏల=చెప్ప నవసరమేమున్నది

తా. సాకారుడవైన నిన్ను భజించుటవలన గలుగు నానందము నీ నిర్గుణస్వరూపమును ఉపాసనచేయుటవలన కలుగదు. అట్టియెడ పాపులై నరక లోకమున పడియున్నవారిని గురించి చెప్పనేల?

చ. హరిభజనీయమార్గనియ ♦ తాత్మకులై భవదీయరూపమై
వఱలినభక్తియుక్తులగు ♦ వారలసంగతిఁ గల్గఁ జేయు స
త్పురుషసుసంగతిన్ వ్యసన ♦ దుర్భవసాగరము న్బ్రయత్నతన్
సరసభవత్కథామృతర ♦ సంబున మత్తుఁడనై తరించెదన్.

అర్థ. హరి=శ్రీహరి; భజనీయ, కామ, నియత, ఆత్మకులు, అయి=స్తుతింపదగిన మార్గమునందు సంచరించుచు; భవదీయ, రూపము, అయి=నీరూపముగా; వఱలిన=ఒప్పిన; భక్తియుక్తులు, అగు, వారల సంగతిన్=భక్తితో కూడినవారి స్నేహమును; కల్గన్; చేయు=కలుగజేయునట్టి; సత్పురుష, సుసంగతిన్=సత్పురుషుల స్నేహముచేత, వ్యసన, దుర్భర, సాగరము=దుఃఖముతో కూడిన సంసారసముద్రమును; అప్రయత్నతన్=సులభముగా; సరస, భవత్, కథా, అమృతరసంబునన్=రసవంతమైన నీకథామృతముచేత; మత్తుడను అయి=మదించినవాడనయి; తరించెదన్=దాటగలను.

తా. శ్రీహరీ సన్మార్గవర్తనులై నిన్ను ఆశ్రయించిన సత్పురుషుల స్నేహము చేతను, నీకథామృతరసమును, సేవించుటచేతను దుఃఖభూయిష్ఠమైన సంసారసముద్రమును దాఁటెదను.

చ. నిరతముఁ దావకీనభజ♦నీయపదాబ్జసుగంధలుబ్ధులె
వ్వారిమదిఁబొందఁగాఁగలుగు ♦ వారలు తత్ప్రియమర్త్య
దేహము, స్మరయఁ దదీయదారతన ♦ యాదిసుహృద్గృ
హబంధువర్గముల్ మఱతురు విశ్వతోముఖర ♦ మాహృ
దయేశ ముకుంద మాధవా. 71

అర్థ. నిరతము=ఎల్లపుడును; తావకీన, భజనీయ, పద, అబ్జ, సుగంధ, లుబ్ధులు=భజించుటకు తగిన నీపదపద్మములయందలి సుగంధమునందు లోలురగువారు; ఎవ్వరి, మదిన్=ఎవరిమనస్సునందు; పొందకలుగును పొందవీలగునో; వారలు=వారు; తత్, ప్రియ, మర్త్యదేహముల్=తమను ప్రియకరమైన మనుష్యశరీరమును, తదీయ, దార, తనయ, ఆది, సుహృత్ గృహ, బంధువర్గముల్=తమభార్యలు, =కొడుకులు, స్నేహితులు, ఇండ్లు, బంధువులు మొదలగువారిని, విశ్వతోముఖ=సమస్తదిక్కులందును వ్యాపించియున్నవాఁడా; రమాహృదయేశ=లక్ష్మీప్రియుఁడా; ముకుంద; మాధవా; అరయన్=విచారింపగా; మఱతురు=మరచిపోవుదురు.

తా శ్రీనివాసా! నీపాదపద్మపరిమళమునందు కోరిక కలిగి నిన్ను తమహృదయమునందు నిలుపుకొన్నవారు తమ శరీరమును భార్యాపుత్రాదులను మరచి యుందురు.

సీ. పరమాత్మ మర్త్యసు ♦ పర్వతిర్యక్సృగ
దితిజసరీసృప ♦ ద్విజగణాది
సంవ్యాప్తమును సద ♦ సద్విశేషంబును
గైకొని మహదాది ♦ కారణంబు

సైకవిరాడ్విగ్రహంబు నే నెఱుఁగుదుఁ
గాని తక్కినసుమంగళము నైన
సంతతసుమహితైశ్వర్యరూపంబును
భూరిశబ్దాదివ్యాపారశూన్య
తే. మైనబ్రహ్మస్వరూపమే నాత్మ నెఱుఁగఁ
బ్రవిమలాకార సంసార భయవిదూర
పరమమునిగేయ సంతత భాగధేయ
నలిననేత్ర రమాలలనాకళత్ర. 72

అర్థ. పరమాత్మ=పరమాత్మా; మర్త్య, సుపర్వ, తిర్యక్, మృగ దితిజ, సరీసృప, ద్విజ, గణ, ఆది, సంవ్యాప్తము=మనుష్యులు, దేవతలు, పశువులు, రాక్షసులు, పాములు, పక్షులు, మొదలగువానిచే వ్యాపించియున్నదియో; సత్, అసత్, విశేషంబు=సత్యము అసత్యముఅనువానితో కూడియున్నదో అగురూపమును; హేతు=తార్చి; మహత్ ఆది, కారణంబును, అయిన=మహత్ మొదలుగాగల ఇరువదియైదు తత్వములకు మూలమైన; విరాటవిగ్రహంబుఁ=విరాటస్వరూపమైన రూపమును; ఏఁ, ఎఱుగుదున్=నాకు తెలియును; కాని=కాని; తక్కిన=మిగిలిన; సుమంగళమును, అయిన=శోభనాకారముగలట్టియు; సంతత, సుమహిత, ఐశ్వర్య, రూపంబును=ఎల్లప్పుడు మిక్కిలి గొప్పదియై లోకప్రభుత్వమును దాల్చియుండు రూపమును; భూరి, శబ్ద, ఆది, వ్యాపార, శూన్యము, అయిన=గొప్పశబ్దము మొదలగు ఇంద్రియవ్యాపారములులేని; బ్రహ్మస్వరూపముఁ=నిర్గుణబ్రహ్మస్వరూపమును; ప్రవిమల, ఆకార=నిర్మలస్వరూపముకలవాడా; సంసార, భయ, విదూర=సంసారభయమును దూరముగా నుంచువాడా; పరమమునిగేయ=మహర్షులచేకీర్తింపఁబడువాఁడా; సంతతభాగధేయ=ఎపుడెగనిశుభములు గలవాఁడా; నలిననేత్రా=పుండరీకాక్షా; రమాలలనా, కళత్ర=లక్ష్మిప్రి

యుండా; ఏక = నేను; అత్మన్ = మనస్సులో; ఎఱుంగ = తెలిసికొనఁ జాలను.

తా. పుండరీకాక్షా! నీవిరాట్స్వరూపము సమస్తచరాచరజగత్తునకు ఆలవాలము అయి యున్నది. సత్యాసత్యస్వరూపము కలిగి యున్నది. ఇరువదియైదు తత్త్వములకును మూలమయి యున్నది. ఆస్వరూపము నాకు తెలియును, కాని నీనిర్గుణబ్రహ్మరూపము నాకు తెలియదు.

సీ. సర్వేశ కల్పాంత ♦ సమయంబునందు వి
యఖిలప్రపంచంబు ♦ నాహరించి
యనయంబు శేషస ♦ హాయుండ వై శేష
పర్యంకతలమునఁ ♦ బవ్వళించి
యోగనిద్రారతి ♦ నుండి నాభీసింధు
జన్వర్ణలోకకం ♦ జాతకర్ణి
కందుఁ జతుర్ముఖు ♦ నమరఁ బుట్టించుచు
రుచి నొప్పు బ్రహ్మాస్వ ♦ రూపి వైన
తే. నీకు మ్రొక్కెద నత్యంత ♦ నియమ మొప్ప
భవ్యచారిత్ర పంకజ ♦ పత్త్రనేత్ర
చిరశుభాకార నిత్యల ♦ క్ష్మీవిహార
యవ్యయానంద గోవింద ♦ హరి ముకుంద. 73

అర్థ. సర్వేశా = సర్వలోకములకును ప్రభువా; కల్పాంతసమయంబునందు = ప్రళయకాలమందు; ఈ, అఖిలప్రపంచంబును = సమస్తవిశ్వమును; ఆహరించి = నీలోనికి తీసుకొని; అనయంబు = ఎల్లపుడును; శేషసహాయుండవయి = ఆదిశేషునిసహాయముతో; శేష, పర్యంకతలమున = శేషుఁడనుపఱుపుపై; పవళించి = పరుండి; యోగనిద్రారతి,

ఉండి=యోగనిద్రను అనుభవించుచు; నాభి, సింధుజ, స్వర్ణలోక, కం
జాత, కర్ణిక, అందున్=నాభియనెడు సముద్రమునందుపుట్టిన సువర్ణ
లోకములోని. పద్మముయొక్క కర్ణికయందు; చతుర్ముఖున్=నాలు
గుముఖములుగల బ్రహ్మను, అమరన్=ఒప్పునట్లు; పుట్టించుచున్=జన్మిం
పజేసి; రుచిన్=కాంతితో; ఒప్పు=ఒప్పుచున్న, బ్రహ్మస్వరూపివి
అయిన=పరబ్రహ్మస్వరూపుడవైన; భవ్యచారిత్ర=పావనమైన చరిత్రము
గలవాడా, పంకజపత్రనేత్ర=పద్మపత్రాక్షా; చిర, శుభ, ఆకార=
సంతతమైన శుభాకారముగలవాడా; నిత్యలక్ష్మీవిహార=నిత్యమును లక్ష్మి
తో విహరించువాడా; అవ్యయా, అనంత=నాశనములేని అనంతముగల
వాడా; గోవిందా; హరి; ముకుంద; అత్యంతనియమము ఒప్పన్=మి
క్కిలి శ్రద్ధతో; నీకున్ మ్రొక్కెదన్=నీకు నమస్కరించెదను.

తా. సర్వేశ్వరా, ప్రళయకాలమందు నీవు సకలలోకములను నీ
లోనికి లాగికొని శేషునిపై పవళించి యోగనిద్రయందుండి నీనాభికమ
లమునుండి చతుర్ముఖబ్రహ్మను సృష్టించి పరబ్రహ్మస్వరూపుడవై ఒప్పు
చుందువు. అట్టి నీకు శ్రద్ధతో నమస్కరించుచున్నాను.

వ. అట్లు యోగనిద్రాపరవశుండ వయ్యును జీవులకంటె
నత్యంతవిలక్షణుండవై యుండుదు వది యెట్లనిన బుద్ధ్య
వస్థాభేదంబున నఖండితం బయిన స్వశక్తిం జేసి చూచు
లోకపాలన నిమిత్తంబు యజ్ఞాధిష్ఠాతవు గావున నీవు నిత్య
ముక్తుండవును బరిశుద్ధుండవును జిదాశ్రయుండవును నా
త్మవును గూటస్థుండవును నాదిపురుషుండవును భగవం
తుండవును గుణత్రయాధీశ్వరుండవును నై వర్తింతువు
భాగ్యహీనుండైన జీవునియందు నీగుణంబులు గలుగవే
సర్వేశ్వరునందే నేమి విరుద్ధగతులై వివిధశక్తియుక్తంబు

లైన విద్యాదు లనుపూర్వ్యంబునం జేసి ప్రలీనంబులగు చుండు నట్టి విశ్వకారణంబు నేకంబు ననంతంబు నాద్యంబు నాకంపమాత్రంబు నవికారంబు నగు బ్రహ్మంబునకు నమస్కరించెద మఱియు దేవా నీవ సర్వవిధఫలం బని చింతించునిష్కాము లయినవారికి రాజ్యాదికామితంబులలోనం బరమార్థం బయినఫలంబు సర్వార్థరూపుండవైన భవదీయపాదసత్సేవనంబ యిట్లునిశ్చితంబ యైనను సకాములైన దీనులను గోవు వత్సంబును స్తన్యపానంబు సేయించుచు వృకాదిభయంబువలన రక్షించుచందంబునం గామనప్రదుండవై సంసారభయంబువలనం బాపుదువని యిట్లు సత్యసంకల్పుండును సుజ్ఞానియు నయిన ధ్రువునిచేత వినుతింపంబడి భృత్యానురక్తుం డైన భగవంతుండు సంతుష్టాంతరంగుండై యిట్లనియె 74

అర్థ, అట్లు=ఆవిధముగా, యోగనిద్రా పరవశుండవు, అయ్యెను=యోగనిద్రయందు శరీరమును మరచినవాఁడవయ్యెను; జీవులకంటెన్=ప్రాణికోటికంటె; అత్యంత విలక్షణుండవు అయి=మిక్కిలి భేదము పొందినవాఁడవు అయి; ఉందుదువు=ఉందువు; అది, ఎట్లు, అనినన్=అదియెట్లనగా; బుద్ధి, అవస్థా, భేదంబునన్=బుద్ధియొక్క అవస్థాభేదముచేత [illegible] అయిన స్వశక్తిన్, చేసి=మొక్కపోవని ఆత్మశక్తిచేత; [illegible]చు=చూచునటువంటి; లోకపాలన నిమిత్తంబు=లోకములను పాలించుకొఱకు; యజ్ఞ, అధిష్ఠాతవు కావునన్=లోకపాలనమును యజ్ఞమును పూని యున్నవాఁడవు; కావునన్=గనుక; నీవు=నీవు; నిత్య, ముక్తుఁడవు=ఎల్లప్పుడును బంధములేనివాఁడవును; పక్షు

శుద్ధుండవగు=పవిత్రుండవగు; చిత్, రూపకుండవగు=జ్ఞానస్వరూపుడ
వగు; ఆత్మవగు=సమస్తలోకములకు నాత్మవగు; కూటస్థుండవగు=
లోకములకు మూలమును; ఆదిపురుషుండవగు=పురుషులలో మొదటి
వాఁడవగు; భగవంతుండవగు=ఐశ్వర్యయుక్తుఁడవగు; గుణత్రయాధీ
శ్వరుండవగు, అయి=సత్త్వరజస్తమోగుణములను నీయధీనమందుంచు
కొన్నవాఁడవగుచు అయి; వర్తింతువు=సంచరింతువు; భాగ్యహీనుండు,
అయిన, జీవునియందు=దరిద్రునియందు; నీగుణములు=నీగుణములు;
కలుగవు=కలుగవు; ఏ, సర్వేశ్వరునందు, ఏన్=ఏసర్వేశ్వరునంద
యిసే; ఏమి, విరుద్ధగతులు, అయి=విరుద్ధప్రవర్తనములుగలవయి; వివి
ధశక్తియుక్తంబులు అయిన=అనేకశక్తులు కలిగియున్న; విద్యాదులు=
విద్యా, అవిద్య మొదలగునవి అనుపూర్వ్యంబునం జేసి=ఒకదాని తర్వా
తనొకటి ప్రలీనంబులు, అగుచుండున్=నశములగుచుండునో; అట్టి=
అటువంటి; విశ్వకారణంబును=విశ్వమునకు కారణమును; ఏకంబును=
ఒక్కటియును; అనంతంబును=అంతములేనిదియు; ఆద్యంబును=మొద
టిదియు; ఆనందమాత్రమును=కేవలఆనందస్వరూపమును; అవికారం
బును=మార్పులేనిదియు; అగు=అయిన; బ్రహ్మంబునకు=నిర్గుణపరబ్ర
హ్మంబునకు; నమస్కరించెదన్=నమస్కారము చేసెదను; మఱి
యున్=ఇంకను; దేవా=ప్రభువా; నీవు=నీవే; సర్వ, విధ, ఫలంబు,
అని=అన్నివిధములయిన ఫలము అని; చింతించు=నిన్నుధ్యానించునట్టి;
నిష్కాములు అయినవారికి=కోరికలేనివారికి; రాజ్య, ఆది, కామితంబు
లలోనన్=రాజ్యము మొదలగు కోరికలలో; పరమార్థంబు అయిన=మి
క్కిలియు కోరఁదగిన; ఫలంబు=ఫలము; సర్వార్థరూపుండవు అయిన=
సకలమైనకోరికలరూపమును దాల్చియున్న భగవన్, పాద, పద్మ, సేవ
నంబు=నీయొక్క పాదపద్మములను సేవించుటయే; ఇట్లు=ఈరీతిగా;
నిశ్చితంబు, అయినను=స్థిరపడియున్నను; గోవు=ఆవు; వత్సంబును=
దూడను; స్తన్యపానంబు, చేయించుచు=పాలుకుడిపించుచు; వృక,

అగు, భయంబువలనఁ = తోడేళ్ళు మొదలగు క్రూరజంతువుల భయము నుండి; రక్షించు చందనంబునన్ = కాపాడునట్లు, సకాములు, అయిన, దీనులను = కోరికలుగల దీనులను కామపూరుండవై వారి కోరికలను ఇచ్చుచు; సంసారభయంబువలనన్ = సంసారభయమునుండి; పాపుదువు, అని = విడిపింతువని; ఇట్లు = ఈరీతిగా; సత్యసంకల్పుండును = సత్యమే సంకల్పముగా కలవాడును; సుజ్ఞానియును = మంచిజ్ఞానముకలవాడును, అయిన = అయిన, ధ్రువునిచేత = ధ్రువునిచేత; వినుతింపఁబడి = స్తుతింపబడి; భృత్యానురక్తుండు అయిన = దాసులయందు ప్రేమగల; భగవంతుండు = శ్రీహరి, సంతుష్ట, అంతరంగుడు, అయి = సంతోషించిన మనస్సుగలవాడయి; ఇట్లు అనియెఁ = ఈరీతిగా పలికెను,

తా. స్పష్టము

క. ధీరవ్రత రాజన్యకు
మారక నీహృదయమందు ♦ మసలిన కార్యం
బారూఢిగ నెఱుంగుదు
నారయ నది వొందరాని ♦ దైనను నిత్తుఁన్. 75

అర్థ. ధీరవ్రత = ధైర్యమేవ్రతముగా గలవాడా; రాజన్యకుమారక = క్షత్రియపుత్రుడా; నీ, హృదయమందు = నీమనస్సులో; మసలిన = ఉండిన; కార్యంబు = కోరిక; ఆరూఢిగాఁ = బాగుగా; ఎఱుంగుదుఁ = తెలిసికొనియున్నాను; అరయఁ = పరీక్షింపగా; అది = ఆ కోరిక; పొందరానిది అయినను = సాధ్యముకానిదైనను; ఇత్తుఁ = ఇచ్చెదను,

తా. ఓయి ధ్రువుఁడా నీమనస్సులోనున్న కోరిక నాకు బాగుగా తెలియును. అదిపొందశక్యముకానిదైనను నీకు దాని నిచ్చెదను.

వ. అది యెట్టిదనిన నెందేని మేధియందుఁ బరిభ్రామ్యమాణ గోచక్రంబునుం బోలె గ్రహనక్షత్రతారాగణజ్యోతి

శ్చక్రంబు నక్షత్రరూపంబులయినధర్మాగ్నికశ్యపశక్రులును
సప్తర్షులును దారకాసమేతులై ప్రదక్షిణంబు దిరుగుచుం
డుదురట్టిదురాపంబును ననన్యాధిష్ఠితంబును లోకత్రయ
ప్రళయకాలంబునందు నశ్వరంబు గాక ప్రకాశమానం
బును నయినధ్రువక్షితి యనుపదంబు ముందట నిరువది
యాఱువేలేండ్లు నీవు బ్రాపింతువు తత్పదప్రాప్తిపర్యం
తంబు భవదీయజనకుండు వనగతుండైనం బితృరా
జ్యంబు పూజ్యంబుగా ధర్మమార్గంబున జితేంద్రియుండ
వై చేయుదువు భవదనుజుం డగునుత్తముండు మృగయా
ర్థంబు వనంబునకుం జని మృతుం డగుం దద న్వేషణార్థం
బు తదాహితచిత్తయై తన్మాతయు వనంబునకుం జని
యందు దావదహననిమగ్నయగు వెండియు. 76

అర్థ. అది=ఆకోరిక; ఎట్టిదనినఁ=ఎటువంటిదనగా; ఎందేనిఁ=ఎప్పుడైనను; మేధియందున్=బుద్ధిమంతునియందు; పరిభ్రామ్యమాణ=తిరుగుచుండు; గోచక్రంబునున్, పోలెన్=భూచక్రమువలె; గ్రహ, నక్షత్ర, తారాగణ, జ్యోతిశ్చక్రంబు=నవగ్రహములు, నక్షత్రములు ఉపగ్రహములు జ్యోతిశ్చక్రము; నక్షత్రరూపంబులు=నక్షత్రరూపములుకలిగిన; ధర్మ, అగ్ని, కశ్యప, శక్రులును=యముడు, అగ్ని, కశ్యపబ్రహ్మ,యింద్రులును' సప్తఋషులును=ఏడుగురు మహాఋషులును; తారకాసమేతులై=నక్షత్రములతోగూడి; ప్రదక్షిణంబు, తిరుగుచుండుదురు=ప్రదక్షిణము చేయుచుందురో. అట్టి=అటువంటి; దురాపంబును పొంద శక్యముగానిదియు; అనన్య, అధిష్ఠితంబును=ఇతరులచే పొందబడనట్టియు; లోకత్రయ, ప్రళయకాలమునందు=మూఁ

ద లోకములను నశింపుచునప్పుడు; నశ్వరంబు, కాక=నశింపక; ప్రకాశమానంబును అయిన=ప్రకాశించుచుండునట్టి; స్వానుభూతి, అను, పదంబున=ధ్యానమువలన గ్రహింపఁదగిన, ముందటన్=యిఁకముందు; ఇరువదియాఱువేలేండ్లు=26000 సంవత్సరములు; చనన్=నశించినపిదప; సాధింతువు=పొందుదువు; తత్, పద, ప్రాప్తి, పర్యంతంబు=ఆ స్థానము లభించునంతవఱకును; భవదీయ, జనకుండు=నీతండ్రి; వనవాసకుండు అయినన్=వానప్రస్థాశ్రమమునకు పోఁగా; తత్, రాజ్యంబు=ఆతని రాజ్యమును ప్రాజ్యంబుగాన్=పొంగించినట్లుగా; ధర్మమార్గంబునన్=ధర్మముతో; జితేంద్రియుండవు అయి=ఇంద్రియములను జయించినవాఁడవయి; చేకొందువు=పాలింతువు; భవత్, అనుజుండు అగు ఉత్తముండు=నీ తమ్ముఁడైన ఉత్తముఁడు; మృగయా, అర్థంబు=వేఁటకొఱకు; వనంబునకు, చని=అడవికిపోయి; మృత్యుండు అగున్=మృతినొందును; తత్, అన్వేషణ, అర్థంబు=అతనిని వెదకుటకై; తత్, ఆహిత, చిత్త, అయి=ఆతనియందుఁ గుదిరిన మనస్సుకలదై తత్, మాత సునీతి=ఆతని తల్లియును; వనంబునకున్=చని=అడవికిపోయి; అందున్=అయ్యడవిలో; దావ, దహన, నిమగ్న అగున్=కారుచిచ్చులోఁ బడును; సామీమునన్=మఱియును.

తా. స్పష్టము.

సీ. అనఘ యుత్తమమతి నీవు • యజ్ఞరూపుం డనఁ
దగు నన్ను సంపూర్ణ • దక్షిణంబు
లగుమఖంబుల చేత • నర్చించి సత్ఫలంబు
లగునిహసౌఖ్యంబు • లనుభవించి
యంత్యకాలమునను • నన్నాత్మఁ దలంచుచు
మఱి నీవు లోకన • మస్కృతమును

మహిం బునరావృత్తి రహితంబు సప్తర్షి
మండలోన్నత మగు ♦ మామకీన

తే. పదము తగఁ బొందఁ గలవని ♦ పరమపురుషుఁ
డతని కభిలషితార్థంబు ♦ లర్థి నిచ్చి
యతఁడు కనుఁగొను చుండంగ ♦ నాత్మపురికిఁ
గరుడగమనుఁడు వేంచేసెఁ ♦ గౌతుకమున. 77

అర్థ. అనఘా, ఆర్త = పాపములేనివాఁడా, ధ్రువుఁడా; మఱి = ఇంకను; నీవు = నీవు; యజ్ఞరూపుండు, అనఁగను, నన్నున్ = యజ్ఞమే స్వరూపముగాఁగల నన్ను; సంపూర్ణ, దక్షిణంబులు, అగు, మఖంబుల చేతన్ = తక్కువ కాని దక్షిణలిచ్చి యజ్ఞములను చేసి; అర్చించి = నన్ను పూజించి; సత్యంబులు, అగు, ఇహసౌఖ్యంబులు, అనుభవించి = నిశ్చయమైన ఇహలోకసౌఖ్యములను అనుభవించి; అంత్యకాలమునన్ = మరణకాలమునందు; నన్నున్, ఆత్మన్, తలంచుచున్ = నన్ను మనస్సులోఁ దలఁచికొనుచు; మఱి = ఇంకను; సర్వలోక, నమస్కృతమును = సమస్తలోకములచేతను నమస్కరింపఁబడినదియును; మహిన్ = భూమియందు పునరావృత్తి రహితంబు = పునర్జన్మములేనట్టిదియు; సప్తర్షిమండల, ఉన్నతము, అగు = సప్తఋషుల స్థానముకంటె ఎత్తయినది అయిన, మామకీన, పదమును = నా స్థానమును (అనఁగా విష్ణుపదమును, ఆకాశమును); తగన్, పొందఁగ, కలవు, అని = తప్పక చేరఁగలవని; పరమపురుషుఁడు = పురుషోత్తముఁడైన శ్రీమహావిష్ణువు; అతని = ధ్రువునకు; అభిలషిత, అర్థంబులు = కోరిన కోరికలను; అర్థిన్ = ప్రీతితో; ఇచ్చి = ఇచ్చి; అతఁడు, కనుఁగొనుచుండంగన్ = ఆధ్రువుఁడు చూచుచుండఁగనే; గరుడగమనుఁడు = గరుడవాహనుఁడైన శ్రీహరి; ఆత్మపురికిన్ = తన వైకుంఠపురమునకు; వేంచేసెన్ = వెడలిపోయెను.

తా. ఓ ధ్రువుఁడా! నేను దుర్లభస్వరూపుఁడనై, అట్టి నన్ను నీవు బహువిధ పూజలచేత పూజించి, ఇహసౌఖ్యముల ననుభవించి, మరణకాలమున నన్ను స్మరించుచు, సప్తర్షులకన్న నున్నతమైన నా స్థానమును పొందఁగలవు. అని పలికి పురుషోత్తముఁడు వాని కోరినవరము లిచ్చి, గరుడారూఢుండై, అతఁడు చూచుచుండఁగనే వైకుంఠపురమునకుఁ బోయెను.

తే. అంత ధ్రువుఁడును పంకేరు ♦ హాక్షుపాద
కమలసేవోపపాదిత ♦ ఘనమనోర
థములఁ దనరియుఁ దనచి ♦ త్తంబులోనఁ
దుష్టిఁ బొందక చనియె ♦ పిశ్టుపడుచు. 78

అర్థ. అంతన్=అప్పుడు; ధ్రువుఁడును=ధ్రువుఁడుకూడ; పంకేరుహాక్ష, పాదకమల, సేవా, ఉపపాదిత, ఘన, మనోరథములన్=పుండరీకాక్షుని పాదపద్మములను సేవించుటచేత పొందఁబడిన గొప్పవరములతో తనరఁగన్=ఒప్పినప్పటికిని, తనచిత్తంబులోనన్=తనమనస్సులో తుష్టిన్, పొందక=సంతోషింపక; చనియెన్=పోయెను.

తా. విదురుఁడా! అప్పుడు ధ్రువుఁడు శ్రీహరి పాదపద్మసేవనముచేత గొప్పవరములను పొందియు తన మనస్సున సంతోషింపకుండెను,

క. అని మైత్రేయుఁడు ధ్రువుఁడ
ట్లనయము హరిచేఁ గృతార్థుఁ ♦ డైనవిధంబె
ల్లను వినుపించిన విదురుఁడు
విని మునివరుఁ జూచి పలికె వినయం బెసఁగన్ 79

అర్థ. అని=ఈప్రకారముగా; మైత్రేయుఁడు=మైత్రేయుఁడు; ధ్రువుఁడు=ధ్రువుఁడు; అట్లు=ఆరీతిగా; అనయముగన్=శాశ్వతముగా, హరిచేన్=విష్ణుమూర్తిచేత; కృతార్థుఁడు అయిన, విధంబు, ఎల్లను=తన

కోరికలనుపొందినప్రకారమును, వినుపించినన్ = తెలుపఁగా; విదు
రుఁడు = విదురుఁడు. విని = విని; మునివరున్, చూచి = మునిశ్రేష్ఠుడైన
మైత్రేయునిఁజూచి; వినయంబు, ఎసఁగన్ = ఎక్కువైనవినయముతో; పలి
కెన్ = పలికెను.

తా. ధ్రువుఁడు విష్ణుమూర్తిచే వరమును పొందినప్రకారమును
మైత్రేయుఁడు చెప్పగా విని విదురుఁడతనితో నిట్లనియె.

క. మునినాయక విను కాముక
జనదుష్ప్రాపంబు విష్ణు ♦ చరణాంబురుహా
ర్చన మునిజనసంప్రాప్యము
ననఁగల పంకేరుహాక్షు ♦ నవ్యయపదమున్. 80

అర్థ. మునినాయక = మునిశ్రేష్ఠుఁడా! విను = వినుము; కాముక
జన, దుష్ప్రాపంబు = కోరికలుగలవారిచేపొందఁగా రానట్టిదియు; విష్ణు,
చరణ, అంబురుహ, అర్చన, మునిజన, సంప్రాప్యమున్ = విష్ణుమూర్తి
పాదపద్మములను సేవించు మునులచే పొందఁదగినట్టిదియు; అనఁగల =
చెప్పఁదగు పంకేరుహాక్షు, అవ్యయపదమున్ = పుండరీకాక్షుని, నాశ
నములేని పదవిని (ముందుపద్యముతో నన్వయము)

తా. ఓ మైత్రేయా! కామాపేక్షగలవారికి పొందరానట్టిదియుఁ విష్ణు
సేవానిరతులగు మునులచే పొందఁదగినట్టిదగు శ్రీవిష్ణుమూర్తియొక్క
యవ్యయపదమును (ముందుపద్యముతో నన్వయము.

వ. పెక్కుజన్మంబులం గాని పొందరానిపదంబు దా నొ
క్కజన్మంబునన పొందియుఁ దనమనంబునం దసంప్రాప్త
మనోరథుండ నని పురుషార్థవేది యైనధ్రువుండు వెల్లు
దలంచె నని మైత్రేయుం డుల్లసిలె. 81

అర. పెక్కు జన్మంబులన్, కాని, పొందరాని, పదంబు = అనేకజన్మము లెత్తినపిదపగాని లభింపని స్థానమును ; తాను, ఒక్క జన్మముననే, పొందియున్ = తానొక్కజన్మములోనే పొందినప్పటికిని; తన మనంబునందు = తనమనస్సులో; అప్రాప్తమనోరథుండను, అని = కోరిక బడసినవాఁడను కానని; పురుషార్థవేది, అయిన, ధ్రువుండు = ధర్మార్థకామమోక్షముల ప్రయోజన మెఱింగినధ్రువుఁడు; ఎట్లు తలంచెన్ = ఎట్లు అనుకొనెను ; అని పలుకంగాన్ = అని పలుకఁగా ; మైత్రేయుండు, ఇట్లు అనియెన్ = మైత్రేయుఁ డిట్లు పలికెను.

తా. స్పష్టము

తే. అనఘ పినతల్లి తన్నుఁ బ ♦ ల్కు దురుక్త
బాణవిద్ధాత్ముఁ డగుచుఁ ♦ దద్భాషణములు
చిత్తమునందుఁ దలంచుటఁ ♦ జేసి ముక్తి
గోరమికి నాత్మలో వగఁ ♦ గూరుచుండె. 82

అర. అనఘా = పాపములేనివాఁడా ; పినతల్లి = సవతితల్లియైన సురుచి; తన్ను, పల్కిన = తన్నుఁగూర్చి పలికిన ; దురుక్త, బాణ, విద్ధ, ఆత్ముఁడు, అగుచున్ = దుర్భాష లను బాణములచే కొట్టఁబడిన మనస్సు గలవాఁడై ; తత్, భాషణములు = ఆమాటలను; చిత్తమందున్, తలంచుటన్, చేసి = మనస్సులో తలఁచుటచేత; ముక్తిన్, కోరమికిన్ = ముక్తిని కోరకుండుటకు; ఆత్మలోన్ = మనస్సులో ; వగన్, కూరుచుండెన్ = ఎక్కువ విచారింపసాగెను.

తా. విదురుఁడా! ధ్రువుఁడు పినతల్లి తన్ననిన వాఁడిమాటలను తలంచుచు శ్రీహరి ప్రత్యక్షమయినప్పుడు ముక్తిని కోరకపోయెఁగదాయని మిక్కిలి చింతించుచుండెను.

వ. అంత నాధ్రువుండు. 83

అర. అంతన్, ఆ, ధ్రువుండు = పిమ్మట ఆధ్రువుఁడు.

చ. అనఘుల్ జితేంద్రియుల్ సుమహాత్ములు నైనసనందనాదు లెం
తయును నైకజన్మసమాశ్రిత యోగసమాధిఁ జేసి యె
వ్వని పదారవిందములు వారిభక్తి నెఱుంగుచుందు రా
ఘనుఁ బరమేశు నీశుఁ బవికారు నమేయు నజయ్యు నాద్యునిన్.

టీ. అనఘుల్, జితేంద్రియుల్ = పాపములను విడిచి యింద్రియములను జయించినవారును; సుమహాత్ముల్, అయిన = మహానుభావులును అయిన; సనందనాదులు = సనందనాదిమహర్షులు; ఎంతయున్, = ఎల్లప్పుడును; న, ఏక, జన్మ, సమాశ్రిత, యోగసమాధిన్, చేసి = అనేకజన్మములలో యోగమునందు స్థిరులైయుండి; ఎవ్వని, చరణ, అరవిందములు = ఎవనిపాదపద్మములను; వారిభక్తిన్ = ఎడతెగనిభక్తితో; ఎఱుంగుచుందురు = తెలిసికొనుచుందురో; ఆ, ఘనున్ = ఆగొప్పవానిని; పరమేశున్ = పరమేశ్వరుని; ఈశున్ = లోకపాలకుఁడైనవానిని; అవికారున్ = మార్పులేనట్టివానిని; అమేయున్ = పరిమితిలేనివానిని; అజయ్యున్ = జయింపశక్యముకానివానిని; ఆద్యునిన్ = జగమునకు మూలమయినవానిని- (ముందుపద్యముతో నన్వయము.)

తా. పాపరహితులయి, యింద్రియనిగ్రహము కలిగి, మహానుభావులైన సనందనాదిమహర్షులు పెక్కుజన్మములందుయోగసమాధిలో నిలిచి శ్రీహరి పాదపద్మములను తెలిసికొనుచుందురు. అట్టిపరమేశ్వరుని, (ముందుపద్యముతో నన్వయము.)

వ. ఏను మహాత్ములం భజియించి తత్పాదపద్మచ్ఛాయం
బ్రాపించియు భేదపన్నుండ నైతి నక్కటా యిట్టిభాగ్య
హీనుండ నైనయేను భవనాశకుం డైనయతనిం బొడగ
నియు నశ్వరంబు లైనకామ్యంబు లడిగితి నిట్టిదౌరాత్మ్యం
బెందేనిం గలదే తమఃపదంబులకుం బున్నతపదంబునం

బొందుదునో యని పూనియంత బాలుఁడయి దేవతలచేత
మదీయమతి గలుషితం బయ్యెంగాని నాఁడు నారదుం
డాడినమాట తథ్యంబయ్యె నతనివాక్యంబు లంగీకరింపని
యే నసత్తముండనై స్వప్నావస్థలం బొందినవాఁడ దైవి
కంబైనమాయం జెంది భిన్నదర్శనుం డగు చందంబున
నద్వితీయుండ నైనను భ్రాంతియను శత్రువుచేఁ బ్రాప్తం
బైన దుఃఖంబు నొంది జగదాత్మకుండును సుప్రసాదుం
డును భవనాశకుండును నైన యీశ్వరు నారాధించి
తత్ప్రసాదంబు వడసియు నాయుర్విహీనుం డైన రోగికిం
బ్రయోగించు నౌషధంబుం బోలె నిరర్థకంబు లై నశ్వ
రంబు లైన యింకామితంబులు గోరితి నని యెంచియు 85

అర్థ. ఏను=నేను; షట్, మాసంబులు=ఆఱు నెలలమాత్రము; భజియించి=సేవించి; తత్ పాదపద్మచ్ఛాయన్=అతని పాదపద్మముల నీడను; ప్రాపించియుఁ=చేరియు; భేదదర్శనుండను అయితిన్=భేదబుద్ధికలవాఁడనయితిని (అనఁగా నేను తక్కువవాఁడను, నాసోదరుఁడెక్కువవాఁడు, సురుచి నన్ను ద్వేషించుచున్నది మొదలగు భావములను పొందితిని); అక్కటా=అయ్యో; ఇట్టి, భాగ్యహీనుండను, అయిన, ఏను, ఇట్టిమరదృష్టవంతుండ నగు నేను; భవనాశకుండయిన, ఆతనిఁ, పొందఁగనియుఁ=జన్మములేకుండ చేయు నాయీశ్వరుని చూచియు; నశ్వరంబులు, అయిన, కామ్యంబులు, అడిగితిఁ=నాశనము పొందు కోరికలను అడిగితిని; ఇట్టిదౌరాత్మ్యంబు ఎందేనిఁ, కలదే=ఇట్టి చెడుబుద్ధి ఎక్కడనైన నుండునా; సమపదంబులకంటెన్=సమస్థానములకంటె; ఉన్నతపదంబునఁ, పొందుదునో, అని=ఎక్కువస్థాన

మును పొందుదునే మో యంచు; సహింపఁజాలని=ఓర్వలేని; ఈ దేవతల చేత=ఈదేవతలమూలమున; మదీయ, మతి=నాబుద్ధి; కలుషితంబ య్యెన్, కాక=చెడిపోయినదికాని; నాఁడు=పూర్వకాలమందు; నారదుండు, అడినమాట=నారదుఁడు చెప్పినమాట; తథ్యంబు అయ్యెన్=నిజమయినది; అతనివాక్యంబులు, అంగీకరింపక=అతనిమా టలను, వినక; ఏను=నేను; అసత్, తముండన, ఆయి=మాయలోము నిఁగి; స్వప్నావస్థన్, పొందినవాఁడు=కలఁగినచున్నవాఁడు; దైవికం బు, అయిన, మాయన్, చెంది=ఈశ్వరమాయచేత; భిన్నదర్శనుండను అగు చందంబునన్=భేదబుద్ధితో చూచినవాఁడగురీతిని; అద్వితీయుండను, అయినను=నాకంటె నితరుఁడు లేఁడను జ్ఞానమునుకలిగినవాఁడనయినను; భ్రాతృ, అనుశత్రువుచేన్=అన్న అనుశత్రువుచే; ప్రాప్తంబయిన=కలిగిన; దుఃఖంబున్=దుఃఖమును; పొంది=పొంది; జగత్ ఆత్మకందను=జగ త్తునకు ఆత్మవంటివాఁడను; సు, ప్రసాదుండను=మంచిపరము నిచ్చు వాఁడును; భవనాశకుండును=జన్మములేకుండచేయువాఁడును; అయిన= అయిన; ఈశ్వరున్=శ్రీహరిని; ఆరాధించి=పూజచేసి; తత్, ప్రసా దంబున్, పడసియున్=అతని యనుగ్రహమును సంపాదించియు; అను కృపహీనుండు, అయినరోగికిన్=ఆయువు తక్కువయినరోగికి; ప్రయో గించు=ఇచ్చు, ఔషధంబున్ పోలెన్=మందువలె; నిరర్థకంబు లయి=నిష్ప్రయోజనంబులయి; నశ్వరంబులు, అయిన=నాశనముపొం దు; ఈకామితంబుల, కోరితిన్=ఈకోరికలను కోరితిని; అని. చెంది యున్=అని మఱియును.

తా. స్పష్టము.

మ. ధనహీనుండున్నృపాలుఁజేరి యడుగన్ ♦ దార్ఢ్యాన్న చోలేశమి
మ్మని యర్థించినరీతి ముక్తిఫలదుం ♦ డైనట్టిపంకేజలో
చనుఁడే చాలఁ బ్రసన్నుఁడైన సతసిన్ ♦ సాంసారికంబర్థిఁగో
రిననావంటివిమూఢమానసులుధా ♦ త్రింగల్గ రేయెవ్వరున్

టీ. ధనహీనుండు=నిరుపేద; నృపాలున్, చేరి=రాజువద్దకు వెళ్లి; అడుగన్, తాఁ గొన్నకోర్కె=రాజడుగుపడియడుగఁగానే; లేశము, ఇమ్ము=కొంచెము ధనమిమ్మని; అర్థించినరీతిన్=కోరినట్లు; ముక్తిఫలదుండు: అయినట్టి=మోక్షమునే ఫలముగా నిచ్చునట్టి; పంకేజలోచనుఁడే=పుండరీకాక్షుఁడగు విష్ణుమూర్తియే; చాలన్, ప్రసన్నుఁడు, అయినన్=నాకు వరముల నిచ్చుటకు సుముఖుఁడయియుండఁగా; అతనిన్=అతనిని; సాంసారికంబు=ఇహలోకసంబంధమైన కోరికను; అర్థిన్=కోరుటతో; కోరిన=కోరినట్టి; నావంటి, విమూఢ, మానసులు=నావంటి బుద్ధిహీనులు; ధాత్రిన్=భూమియందు; ఎవ్వరున్=ఎవరైనను; కలరే=కలరా!

తా. దరిద్రుఁడు రాజుముందు నిలువఁబడి అతఁడు నీకేమి కావలయునో కోరుకొమ్మని యడుగఁగా నాకు కొంచెమిమ్మని యడిగినట్లు వరములలో నెల్ల నుత్తమమగు మోక్షము నిచ్చు శ్రీహరి నాకు ప్రసన్నుఁడయియుండఁగా నేను మోక్షమును కోరక తుచ్ఛమైన ఐహికవరమును కోరికొంటిని. నాకంటె బుద్ధిహీనుఁ డెవ్వఁడైన నుండునా?

ధ్రువుండు మరలఁ దన పురంబునకు వచ్చుట

సీ. అని యుల్లఁ జింతించె ♦ ననుచు మైత్రేయ
ముని విదురునకు ని ♦ ట్లనియె వెండి
కమనీయహరిపాద ♦ కమలరజోభిసం
స్కృతశరీరులును యా ♦ దృచ్ఛికముగ
సంప్రాప్త మగుదాని ♦ సంతుష్టచిత్తులై
వఱలుచు నుండు మీ ♦ వంటివారు
దగ భగవత్పాద ♦ దాస్యంబు దక్కంగ
నితరపదార్థమే ♦ యెడలయందు

తే. మఱచియును గోర నొల్లరు ♦ మనుచరిత్ర
తవిలి యిట్లు హరిప్రసా ♦ దంబు నొంది
మరలి వచ్చుచు నున్నకు ♦ మారువార్తఁ
జారుచే విని యుత్తాన ♦ చరణుఁ డంత. 87

అర్థ, అని, యిట్లు=అని యీరీతిగా; చింతించెన్ అనుచున్=ఆలోచించెనని; , మైత్రేయముని=ఆమైత్రేయమహర్షి; విదురునకున్, ఇట్లు, అనియెన్=విదురునితో నిట్లు పలికెను; తండ్రీ=పూజ్యుఁడవైన విదురుఁడా; కమనీయ, హరి, పాదకమల, రజస్, అభిసంస్కృత, శరీరులు=సుందరమైన శ్రీహరి పాదపద్మములయందలి పుప్పొడిచే పవిత్రములుగా చేయఁబడిన శరీరమును కలవారును; యాదృచ్ఛికముగన్=యథాలబ్ధముగా; సంప్రాప్తము, అగు, దానన్=సంప్రాప్తమయిన దానితో; సంతుష్టచిత్తులు, అయి=సంతోషించినమనస్సుగలవారయి; నరులు మన్; ఉండు, మీవంటివారు=ఒప్పుచుండు మీవంటివారు; మను చరిత్ర=మనువువంటి చరిత్రముగల విదురుఁడా; తగన్=ఒప్పునట్లు; భగవత్ పాదదాస్యంబు, తక్కంగన్=భగవత్పాదసేవతప్ప; ఇతర పదార్థము=మఱియొకటి; ఏయెడలయందున్=ఎట్టిసమయమునందును; మఱచియున=పరాకునైనను; కోరన్, ఒల్లరు=కోరరు; తవిలి=పూనికతో; ఇట్లు=ఈరీతిగా; హరిప్రసాదంబున్, ఒంది=శ్రీహరిదయను సంపాదించి; మఱలి, వచ్చుచున్, ఉన్న, కుమారు, వార్తన్=తిరిగివచ్చుచున్న కొడుకుసంగతిని; చారుచేన్, విని=దూతవలన విని; ఉత్తానచరణుఁడు=ఉత్తానపాదుఁడు; అంతన్=అప్పుడు; (ముందు పద్యముతో నన్వయము).

తా. అని యిట్లుఆలోచించెనని మైత్రేయుఁడు విదురునితో, "అయ్యా,తమబోంట్లుశ్రీహరిపాదపద్మరజస్సుచే పవిత్రములయినశరీరములుగలవారలు. మీరు సమయమునకులభించిన దానితో సంతోషించుచు ఎట్టి

సమయములందును భగవత్సేవతప్ప నితరమును గోరదు. ఈరీతిగా తపస్సుచేసి శ్రీహరికృపను సంపాదించి తిరిగివచ్చుచున్న తనకుమారుడగు ధ్రువుని సంగతి దూతలవలనవిని, ఉత్తానపాదుఁడప్పుడు (ముందుపద్యముతోనన్వయము).

వ. మనమ్మున నిట్లని తలంచె. 88

అర్థ. మనంబునన్, ఇట్లు, అని. తలంచెన్=మనస్సులో ఈరీతిగా తలంచెను.

క. చచ్చినవారలు క్రమ్మఱ
వచ్చుటయే కాక యిట్టి ♦ వార్తలు గలవే
నిచ్చలు నమంగళుండ నగు
నిచ్చట మఱి నాకు శుభము ♦ లేల ఘటించున్. 89

అర్థ. చచ్చినవారలు=మృతినొందినవారు; క్రమ్మఱన్=మరల; వచ్చుటయే కాక=వచ్చుటయొక్కటియే కాక; ఇట్టివార్తలు కలవే=అతఁడు వరమును పొందివచ్చుచున్నాఁడనుట వింతగాదా; నిచ్చలున్=ఎల్లప్పుడును; అమంగళుఁడను, అగు=అశుభమునే పొందుచుండు; నాకు=నాకు; ఇచ్చట=ఇప్పుడు మఱి=ఇంకను; శుభములు, ఏల, ఘటించున్=శుభములు కలుగునా?

తా. చచ్చినవారు తిరిగిబ్రతుకుటయేగాక గొప్పవరములను సంపాదించి వత్తురనువార్త యెందైనయుండునా? దురదృష్టవంతుఁడనగు నా కుశుభములు కలుగునా?

క. అని విశ్వసింపకుండియు
మనమున నానారదుఁడు గు ♦ మారుఁడు వేగం
బున రాఁగలఁ డనుచును బలి
కినపలుకులు దలఁచి నమ్మి ♦ కృతకృత్యుండై. 90

అర్థ. అని=అని; విశ్వసింపకుండియు=నమ్మకయున్నను; మనమునన్=మనస్సులో; ఆనారదుఁడు=ఆనారదమహర్షి; కుమారుఁడు=తనకొడుకైన ధ్రువుఁడు వేగంబునన్, రాఁగలఁడు, అనుచును, పలికిన, పలుకులు=శీఘ్రముగా వచ్చునని చెప్పినమాటలు; తలఁచి=స్మరించి; నమ్మి=విశ్వాసముగలవాఁడయి; కృతకృత్యుఁడు, అయి=ధన్యుఁడై; (ముందుపద్యముతో నన్వయము),

తా. ఆతఁడు తొలుత నమ్మకున్నను తనకుమారుఁడు శీఘ్రముగా మరలివచ్చునని నారదుఁడు చెప్పినమాటలను తలంచి విశ్వసించినవాఁడయి (ముందుపద్యముతో నన్వయము)

క. తనసుతుని రాక సెప్పిన
ఘనునకు ధనములును మౌక్తి ♦ కపుహారములున్
మనమలర నిచ్చి తనయునిఁ
గనుఁగొనుసంతోష మాత్మఁ ♦ గడలుకొనంగన్. 91

అర్థ. తనసుతుని, రాక=తనకుమారుఁడు వచ్చుటను; చెప్పిన=చెప్పినట్టి; ఘనునకున్=ఆ చారునకు; ధనములును=ధనమును; మౌక్తికపుహారములున్=ముత్యాలహారములును; మనము, అలరన్, ఇచ్చి=మనస్సుసంతోషించినట్లు ఇచ్చి; తనయునిన్; కనుఁగొను, సంతోషము=కొడుకును చూచు సంతోషము; ఆత్మన్=మనస్సులో; కడలుకొనంగన్=ఉప్పొంగుచుండఁగా (ముందుపద్యముతో నన్వయము)

తా. తనకొడుకు వచ్చుచున్నాఁడను దూతకు బహుమానమిచ్చి కొడుకును చూచెడు సంతోషము అతిశయించుచుండఁగా (ముందుపద్యముతో నన్వయము).

సీ. వలను మీఱిన సైంధ ♦ వంబులఁ బూన్చిన
కనకరథంబు ను ♦ త్కంఠ నెక్కి

బ్రాహ్మణకులవృద్ధ ♦ బంధుజనామాత్య
పరివృతుం డగుచు వి ♦ స్ఫురణ మెఱసి
బ్రహ్మనిర్ఘోషతూ ♦ ర్యస్వనశంఖకా
హళవేణురవము లం ♦ దంద చెలఁగ
శిబిక లెక్కియు విభూ ♦ షితలై సునీతిసు
రుచు లుత్తముండు నా ♦ రూఢి నడవ
తే. గలను దీపింప పరిశోభి ♦ గనుచు మున్న
నాత్మనగరంబు వెలువడి ♦ యరుగు చుండి
బలసి నగరోపవనసమీ ♦ పంబునందు
వచ్చు ధ్రువుఁ గని మేదినీ ♦ శ్వరుఁడు నంత. 92

అర్థ. వెనుమోఱిన సైంధవంబులన్, పూన్చిన = పొంకనైన గుఱ్ఱములను కట్టిన; కనకరథంబున్ = బంగారురథమును; ఉత్కంఠన్ = ఎక్కువప్రీతితో; ఎక్కి = ఎక్కి; బ్రాహ్మణ, కులవృద్ధ, బంధుజన, అమాత్య. పరివృతుండు; అగుచున్ = బ్రాహ్మణులు, కులపెద్దలు, బంధువులు, మంత్రులు, మొదలగువారిచే అనుసరింపఁబడి; విస్ఫురణన్ మెఱసి = మిక్కిలి వేడుకతో; బ్రహ్మనిర్ఘోష, తూర్యస్వన, శంఖ, కాహళ. వేణురవములు = వేదఘోషమును, తూర్యారావములును, శంఖములు, బాకాలు, పిల్లనగ్రోవులు మొదలగు వానిధ్వనులును; అందంద చెలఁగన్ = అచ్చటచ్చట మ్రోగుచుండఁగా; శిబికలు ఎక్కియున్ = పల్లకీలెక్కి; విభూషితలు, అయి = అలంకరించుకొని; సునీతి, సురుచులు, ఉత్తముండున్ = తన భార్యలగు సునీతి, సురుచులును కొడుకైన యుత్తముఁడును; ఆరూఢిన్, నడవన్ = వచ్చుచుండఁగా; గమదీ

పింపఁగా=గొప్పతనము కనుబడునట్లు; అతిశీఘ్రగమనము, ఒప్పన్=మిక్కిలివేగముగా; ఆత్మనగరంబు, వెలువడి=తనపట్టణమును విడచి; అరుగుచుండి=పోవుచు; బలిమిన్=గుంపుగాఁగూడి; నగర, ఉపవన; సమీపంబునందు=పట్టణమునకు అంటియున్న యుద్యానవనముదగ్గర; వచ్చు ధ్రువుఁగాన్, కని=ఎదురుగా వచ్చుచున్నధ్రువుని చూచి; మేదినీశ్వరుడున్, అంతన్=రాజప్పుడు (ముందుపద్యముతో నన్వయము).

తా. మంచిగుఱ్ఱములు పూన్చిన బంగారురథము నెక్కి, బ్రాహ్మణులు, కులవృద్ధులు, బంధుజనులు, మొదలగువారు తన్నుచుట్టుకొలువ, వేదఘోషలును తూర్య, శంఖ, కాహళ వేణుధ్వనులును నొప్పుచుండ, సునీతిసురుచులును ఉత్తముఁడును పల్లకీలలో వచ్చుచుండ, రాజు తనపురము వెడలి నగరముసమీపమునసున్న ఉద్యానవనముదగ్గర, తనకెదురుగా వచ్చుచున్న ధ్రువునిజూచి, రాజు (ముందుపద్యముతోనన్వయము)

చ. అరదముడిగ్గి ప్రేమదొలఁకాడ ససంభ్రముఁడై రమామనో
హరుచరణారవిందయుగ ళార్చననిర్దళితాఖిలాఘు నీ
శ్వరకరుణావలోకన సుజాతసమగ్రమనోరథుఁ సుతుం
గరమనురక్తిడాసి పులకల్ నసలొత్తఁబ్రమోదితాత్ముఁడై.

అర్థ. అరదము, డిగ్గి=రథముదిగి; ప్రేమతొలఁకాడన్=ప్రేమ పొచ్చుచుండఁగా, ససంభ్రముఁడై=తొట్రుపాటుతో; రమామనోహరు=లక్ష్మీకి మనోహరుఁడగు శ్రీహరియొక్క; చరణ, అరవింద, యుగళ, అర్చన, నిర్దళిత, అఖిల, అఘున్=పాదపద్మములజతను సేవించుటవలన సమస్తపాపములను పోఁగొట్టుకొనిన వానిని; ఈశ్వర, కరుణా, అవలోకన, సుజాత, సమగ్ర, మనోరథున్=భగవద్భక్తిచేత సంపాదింపఁబడిన సమస్తమనోరథములుకలిగినవానిని; సంతున్=కొడుకును; కరము అనురక్తి, డాసి=మిక్కిలి ప్రేమతో దగ్గరకువెళ్లి; పులకల్, ననలొ

త్తగా=ఒడలు గగుర్పాటొందగా; అతఁడు, ప్రమోదితుఁ డయి=సంతోషించినమనస్సుకలవాఁడయి (ముందుపద్యముతో నన్వయము)

తా. రథముదిగి మిక్కిలి ప్రేమతో శ్రీహరిపాదపద్మ సేవవలన సమస్తపాపములను పోఁగొట్టుకొని అతనికరుణవలన సమస్తవరములను సంపాదించినకొడుకగు ధ్రువునియొద్దకు మిక్కిలి యనురాగముతో పోయి, ఒడలుగగుర్పొడవఁగా సంతోషించినమనస్సుతో (ముందుపద్యముతో నన్వయము).

తే. బిగియఁ గౌఁగిటఁ జేర్చి నె ♦ మ్మొగము నివిరి
శిరము మూర్కొని చుబుకంబు ♦ నేతఁ బుణికి
యవ్యయానందబాష్పధా ♦ రాభిషిక్తుఁ
జేసి యాశీర్వదింప నా ♦ చిరయశుండు. 94

అర్థ. బిగియన్, కౌఁగిటన్, చేర్చి=గాఢముగా ఆలింగనము చేసికొని; నెమ్మొగము, నివిరి=మొగమునుతడవి; శిరముమూర్కొని=తలను వాసనచూచి; చుబుకంబున్, చేతన్, పుణికి=గడ్డమును చేతితో తడవి; అవ్యయ, ఆనందబాష్ప, ధార, అభిషిక్తున్, చేసి=ఎడతెగని ఆనందబాష్పధారలచేత తడపి; ఆశీర్వదింపన్=ఆశీర్వచనముచేయగా; ఆ, చిరయశుండు= ఆ శాశ్వతకీర్తిగల ధ్రువుఁడు;

తా. ధ్రువునికౌఁగిటఁజేర్చి, మొగముతడవి, శిరమునాఘ్రాణించి, గడ్డమును పుణికి, యెడతెగని యానందబాష్పములచేనాతనితడిపి, ఆశీర్వదింపగా అధ్రువుఁడును (ముందుపద్యముతో నన్వయము).

క. జనకుని యాశీర్వచనము
లనయముఁ గైకొని ప్రమోది ♦ యై తత్పదముల్
తనఫాలతలము సోఁకఁగ
వినతులు గావించి భక్తి ♦ విహ్వలుఁ డగుచున్ 95

అర్థ. జనకుని, ఆశీర్వచనములు=తండ్రిదీవనలను; అనయమున్ కై కొని=ఎక్కువగా పొంది; ప్రమోది; అయి=సంతోషించినవాడయి; తత్పదములన్=అతనిపాదములను; తన, ఫాలతలము, సోఁకఁగన్=తన నుదుటిని తాఁకునట్లు; వినతులు, కావించి=నమస్కారములుచేసి; భక్తి విహ్వలుఁడు, అగుచున్=భక్తిపరవశుఁడయి

తా. ధ్రువుఁడట్లు తండ్రి ఆశీర్వచనములనుగొని సంతోషించి యతని పాదములపై తన నుదురు తాఁకునట్లు నమస్కరించి ఎక్కువభక్తితో (ముందుపద్యముతో నన్వయము).

తే. అంత నా సజ్జనాగ్రణి ♦ యైన ధ్రువుఁడు
దల్లులకు భక్తి వినతులు ♦ దగ నొనర్చె
సురుచి మ్రొక్కిన యర్భకుఁ ♦ జూచి యెత్తి
నగుమొగంబున నాలింగ ♦ నంబు సేసి. 96

అర్థ. అంతన్, ఆ; సజ్జనాగ్రణి, అయిన, ధ్రువుఁడు=అప్పుడు సజ్జనులలో నుత్తముఁడగు ధ్రువుఁడు; తల్లులకున్=సునీతిసురుచులకు; భక్తిన్=భక్తితో; వినతులు=నమస్కారములు; తగన్, ఒనర్చెన్=ఒప్పునట్లుగా చేసెను; సురుచి=సురుచి; మ్రొక్కిన, అర్భకున్=నమస్కరించిన బాలునిచూచి; ఎత్తి=లేవదీసి; నగుమొగంబునన్=నవ్వుమొగంబుతో; ఆలింగనంబు సేసి=కౌఁగిలించుకొని

తా. ధ్రువుఁడు తల్లులకు భక్తితో నమస్కరింపఁగా సురుచి యతనినెత్తి కౌఁగిటఁజేర్చుకొని నగుమోముతో (ముందుపద్యముతో నన్వయము)

సీ. కరమొప్ప నానంద ♦ గద్గదస్వరమున
జీవింపు మనుచు నా ♦ శీర్వదించె
భగవంతుఁ డెవ్వని ♦ పై మైత్రి వాటించు

సత్కృపాదృష్టిఁ బ్ర ♦ సన్నుఁడగుచు
నతనికిఁ దమయంత ♦ ననుకూలమ్మై యుండు
సర్వభూతంబులు ♦ సమతఁ బేర్చి
మహిఁ దలపోయ ని ♦ మ్నప్రదేశములకు
ననయంబుఁ జేరు తో ♦ యములపగిదిఁ

తే. గాన ఘనుఁడు మహాత్ముని ♦ గారవించె
సురుచి పూర్వంబు దలఁపక ♦ సుజనచరిత
విష్ణుభక్తులు ఘనులు ప ♦ విత్రు లగుట
వారె వెలుగుదురు ధరణి నె ♦ వ్వారు మఱియు. 97

అర్థ. కనము, ఒప్పన్ = ఎక్కువగా; ఆనంద, గద్గదస్వరమునన్ = సంతోషముచే తడఁబడుచున్న ధ్వనితో; జీవింపుము, అనుచున్ = చిరంజీవివి కమ్మని; ఆశీర్వదించెన్ = ఆశీర్వాదము చేసెను; భగవంతుఁడు = శ్రీహరి; ఎవ్వనిపైన్ = ఎవనిమీద; సత్కృపాదృష్టిన్ = మంచిదయతో; ప్రసన్నుఁడగుచున్ = సుముఖుఁడయి మైత్రిన్ పాటించుచున్ = స్నేహము చూపునో; అతనికి = అతనికి; సర్వభూతంబులు = సమస్తభూతములును; సమతన్, పేర్చి = సమత్వమును కోరి; మహిన్ = భూమియందు; తలపోయన్ ఆలోచింపఁగా; నిమ్నప్రదేశములకున్ = పల్లపునేలకు; అనయంబున్ = ఎల్లప్పుడును; చేరు = పాఱునట్టి; తోయములపగిదిన్ = నీళ్లవలె; తమయంతన్ = తమకుతామే; అనుకూలములయి యుండున్ = అనుకూలించును; కావున్ = అందువలన; ఘనున్ = గొప్పవాఁడగు; ఆమహాత్మునిన్ = ఆమహానుభావుఁడగు ధ్రువుని; సురుచి = సవతితల్లియైన సురుచి; పూర్వంబున్ తలపక = పూర్వము జరిగిన సమాచారము నెంచక; గారవించెన్ = ఆదరించెను; సుజనచరిత = సచ్చరిత్రముగల విదు

గదా; విష్ణుభక్తులు=శ్రీహరిని సేవించువారు; ధరన్=భూమియందు పవిత్రులు, అగుటన్=పరిశుద్ధులగుటచేత; ధరణిన్=భూమియందు; ఏవారున్=ఎవరును; వారికి, అలుగరు=వారిపై కోపింపరు; మఱియు=మఱియు.

తా. సురుచి ధ్రువుని చిరంజీవివి కమ్మని ఆశీర్వదించెను, జలములు ఎత్తుప్రదేశమునుండి పల్లమునకు పారుచు సమత్వమును గొనునట్లు శ్రీహరి కరుణగలవారికి సమస్తభూతములు ననుకూలములై యుండును. కావుననే పూర్వచరిత్రమును తలంపక సురుచి యాతని నాదరించెను. విష్ణుభక్తులు పవిత్రులగుటచేత భూమియందు వారిపై నెవరికిని కోపముండదు.

వ. కావున నుత్తముండును ధ్రువుండును ప్రేమవిహ్వలు లగు
చు నన్యోన్యాలింగితులై పులకాంకురాలంకృతశరీరులై
యానందబాష్పముల నొప్పిరంత సునీతియుఁ దన ప్రా
ణంబులకంటె బ్రియుఁడగు సుతు నుపగూహనంబు సేసి
తదవయవస్పర్శనంబుచేత నానందంబునొంది విగతశోక
యయ్యె నప్పుడు సంతోషధారాసిక్తంబులై చనుఁబా
లునుం గురిసె నంత. 98

అర్థ. కావునన్=అందుచేత; ఉత్తముండును, ధ్రువుండును=అన్నదమ్ములగు నుత్తమ ధ్రువులు; ప్రేమవిహ్వలులు, అగుచున్=ప్రేమచేత మైమఱచినవారయి; అన్యోన్యఆలింగితులు, అయి=ఒకరినొకరు కౌఁగిలించుకొని; పులకాంకుర, అలంకృత, శరీరులు, అయి=గగుర్పాటుగలదేహములు గలవారయి; ఆనందబాష్పములన్, ఒప్పిరి=సంతోషముచే కలిగిన కన్నీటితో నొప్పిరి; అంతన్=అప్పుడు, సునీతియున్=సునీతి; తనప్రాణంబులకంటెన్=తనప్రాణంబులకంటె; ప్రియుండు,

అగు=ప్రియుఁడైన; సుతుఁ=కొడుకును; ఉపగూహనంబు, చేసి=కౌఁగిలించుకొని; తత్, అంగన, స్పర్శనంబు చేత=ఆతని శరీరమును తాకుటచేత; ఆనందంబున్, పొంది=సంతోషమును పొంది, విగతశోక, అయ్యెఁ=దుఃఖము పోఁగొట్టుకొనినదయ్యెను; అప్పుడు=అప్పుడు; సంతోష, బాష్ప, ధారా, సిక్తంబులు. అయి=సంతోషాశ్రువులతో కూడిన, చనుబాలుఁ=చనుబాలుకూడ; కురిసెఁ=కురిసెను; అంతఁ=అప్పుడు.

తా. స్పష్టము.

సీ. అప్పుడు సంతోష ♦ ముప్పతిల్లఁగఁ బౌర
  జనము లాధ్రువుతల్లి ♦ నెనయఁ జూచి
 తొడరినభవదీయ ♦ దుఃఖనాశకుఁ డైన
  యిట్టితనూజుఁ డెం ♦ దేనిఁ బెద్ద
 కాలంబుక్రిందటఁ ♦ గడఁగి నష్టుం డైన
  వాఁడీవు సౌభాగ్య ♦ వశముచేతఁ
 బ్రతిలబ్ధుఁ డయ్యెను ♦ నితఁడు భూమండల
  మెల్లను రక్షించు ♦ నిద్ధమహిమఁ
తే. గమలలోచనుఁ బంతెంచు ♦ ఘనులు లోక
 దుస్తరం బైనయట్టి మృ ♦ త్యువును గల్గు
 రక్షితప్రణతార్తిహరుఁ డైన ♦ యబ్జనాభుఁ
 డర్థి నీచేతఁ బూజితుం ♦ డగుట నిజము. 99

అర్థ. అప్పుడు=అప్పుడు; సంతోషము, ఉప్పతిల్లఁగఁ=సంతోషము ఉప్పొంగగా; పౌరజనములు=పురజనులు, ఆ, ధ్రువు, తల్లిన్=

ఆ సునీతిని; ఏనయన్ చూచి=ఎక్కువగా చూచి; తోడతీవ, భవదీయ, దుఃఖ, నాశకులు, ఆయిన, నీదుఃఖమును పోగొట్టిన; ఇట్టితనూజుడు=ఇట్టికొడుకు; ఎందేనిన్=ఎప్పుడో, పెద్దకాలంబుక్రిందటన్=చాల కాలము క్రిందట; కడిగి, నష్టుండు, అయినన్=పోయినను, వాడు=అతఁడు; ఇపుడు=ఇప్పుడు; నీభాగ్యవశముచేతన్=నీయదృష్టము చేత; ప్రతిలబ్ధుడు, అయ్యెను=తిరిగిదొరకెను; యితడు=యీధ్రువుడు, ఇద్ధమహిమన్=గొప్పమహిమతో; భూమండలము, ఎల్లను, రక్షించున్=భూమినిరక్షించును; కమలలోచనున=పుండరీకాక్షుఁడైన హరిని; చింతించు=ధ్యానించునట్టి; ఘనులు=మహానుభావులు; లోకదుర్జయంబు, అయినయట్టి=లోకముచేత గెలువరానట్టి; మృత్యువును=చావును; గెల్తురు=గెలిచెదరు; అట్టి=అటువంటి; ప్రణతా, ఆర్తి, హరుడు, అయిన=తన్నునమస్కరించువారి దుఃఖమునుపోగొట్టు; అబ్జనాభుడు=శ్రీమహావిష్ణువు; అర్థిన్=కోరికతో; నీచేతన=నీచేత; పూజితుండు అగుట=పూజింపఁబడినవాఁడగుట; నిజము=సత్యము.

తా. అప్పుడు పురజనులు సునీతితో అమ్మా! నీదుఃఖమును పోగొట్టిన యీధ్రువుఁడు ఎన్నడో పోయి యిప్పుడు నీయదృష్టవశమున నీకు దొరకినాఁడు ఇతడు గొప్పమహిమతో భూమినేలును శ్రీహరిని ధ్యానించు వారనన్యసాధ్యమైన మృత్యువును గెల్తురు. నీవు శ్రీహరిని పూజించియుండుటచేతనే నీకిట్టి యదృష్టము కలిగినది.

వ. అని ప్రశంసించి రట్లు పౌరజనంబులచేత నుపలాల్యమానుం
డును సంస్తూయమానుండును నగుచు నుత్తానపాదుం డు
త్తమసమేతంబుగ ధ్రువుని గజారూఢునిం జేసి సంహృ
ష్టాంతరంగుండగుచుఁ బురాభిముఖుండై చనుదెంచి. 100

అర్థ. అని=ఈరీతిగా; ప్రశంసించిరి=పొగడిరి; అట్లు=అటు; పౌరజనంబులచేతన్=పురజనులచేత; ఉపలాల్యమానుండును=

లాలింపఁబడినవాఁడును; సంస్తూయమానుఁడు=పొగడఁబడువాఁడును అగుచున్=అగుచు; ఉత్తానపాదుండు=ఉత్తానపాదమహారాజు; ఉత్తమసమేతంబుగాన్=సురుచికొడుకైన ఉత్తమునితోఁగూడ; ధ్రువునిన్=ధ్రువుని; గజారోహణున్, చేసి=ఏనుఁగుపై నెక్కించి, ప్రహృష్ట, అంతరంగుండు, అగుచున్=సంతోషముపొందినమనస్సుగలవాఁడై; పుర, అభిముఖుండు, అయి=పురమువంక; చనుదెంచి=వచ్చి.

తా. స్పష్టము.

సీ. స్వర్ణపరిచ్ఛద ♦ స్వచ్ఛహర్మ్యద్వార
రాజితగోపురా ♦ ట్టాలకంబు
ఫలపుష్పమంజరీ ♦ కలితరంభాస్తంభ
పూగపోతాదుల ♦ భూషితంబు
ఘనసారకస్తూరి ♦ కాగంధజలబంధు
రాసిక్తవిపణిమా ♦ ర్గాంచితంబు
మానితనవరత్న ♦ మయరంగవల్లికా
రాజితప్రతిగృహ ♦ ప్రాంగణంబు
తే. శుభనదీజలకుంభసం ♦ శోభితంబు
తండులస్వర్ణలాజాక్ష ♦ తప్రసూన
ఫలపరివ్రాత కలితదీ ♦ భ్రాజితంబు
ఘనము సర్వాలంకృత ♦ మైనపురము. 101

అర్థ. స్వర్ణ=బంగారముచేత; పరిచ్ఛద=కప్పబడిన; స్వచ్ఛ=ప్రకాశించుచున్న; హర్మ్య=గోడలచేతను; ద్వార=ద్వారములచేతను; రాజిత=ప్రకాశించుచున్న; గోపుర=గోపురములును; అట్టాలకంబు=

త్తులు; వీనిచేత, కలిత = అలంకరింపఁబడిన; రంభాస్తంభ = అరటిస్తంభ కోటబురుజులు గలదియు; ఫల = పండ్లు; పుష్ప, మంజరీ = పూలగు త్తులు; పూగపోత = చిన్నపోఁకచెట్లు; ఆది = మొదలగువానిచేత; విభూషితంబు = అలంకరింపఁబడినదియు; ఘనసార = పచ్చకర్పూరము; కస్తూరికా = కస్తూరి; గంధజల = సుగంధజలములచేత; బంధుర = దట్టముగా అసిక్త = తడుపబడిన; విపణిమార్గ = అంగడివీథులతో; అంచితంబు = ఒప్పునదియు; మానిత = సొగసైన; నవరత్నమయ = నవరత్నములవికారమైన; రంగవల్లి = ముగ్గులచే; విరాజిత = ప్రకాశించుచున్న; ప్రతిగృహ = ఇంటింటనుగల; ప్రాంగణంబు = వాకిళ్లుగలదియు; శుభ = శోభనయుక్తమైన; నదిజల = నదిజలములు కలిగిన; కుంభ = కుండలచే; సంశోభితంబు = శోభించుచున్నదియు; తండుల = బియ్యము; స్వర్ణ = బంగారము, వీనితో చేయఁబడిన; లాజా = పేలాలు; అక్షత = అక్షతలు; ప్రసూన = పువ్వులు; ఫల = పండ్లు, వీనియొక్క; పరివ్రాత = సమూహముచే; కలిత = అలంకరింపఁబడి; విభ్రాజితంబును = ప్రకాశించుచున్నదియు; అగుచుఁ = అగుచు; సర్వాంగాలంకృతము, అయిన = అన్నియెడలను అలంకరింపబడిన; పురము = పట్టణమును,

తా. బంగారురేకులచే కప్పఁబడిన గోడలు ద్వారములతో నొప్పు గోపురములను, కోటబురుజులును గలదియు, పండ్లు పూవులచే అలంకరింపఁబడిన అరటిచెట్లు, పోకచెట్లును గలదియు, పచ్చకర్పూరము, కస్తూరి, గంధము కలిపిన జలముచేత తడుపఁబడిన అంగడివీథులు గలదియు, నవరత్నములచే నేర్పరుపఁబడిన ముగ్గులుగలదియు నదీజలములతో నింపఁబడిన కుండలు గలదియు, బియ్యము, బంగారము, పేలాలు, అక్షతలు, పూవులు, పండ్లు మొదలగువానితో నొప్పునదియునై, యెల్లయెడలను నలంకరింపఁబడిన పురమును.

వ. ప్రవేశించి రాజమార్గంబునఁ జనుదెంచునప్పుడు. 102

అర్థ. పరివేశించి=ప్రవేశించి; రాజమార్గంబునన్=రాజవీధిని; చనుదెంచునపుడు=వచ్చునపుడు;

మ. హరిమధ్యల్ పురకామినీజనులు సౌ ♦ ధాగ్రంబులందుండి,
భాస్వరసిద్ధార్థఫలాక్షతప్రసవదూ ♦ ర్వావ్రాతదధ్యంబువుల్
గరవల్లీమణిహేమకంకణఝణ ♦ త్కారంబుశోభిల్లఁ జల్లిరి
యాభాగవతోత్తమోత్తమునిపై ♦ లీలాప్రమేయంబుగన్.

అర్థ. హరిమధ్యల్=సింహమువంటి నడుములుగల; పురకామినీజనులు=పురములోని స్త్రీలు; సౌధాగ్రంబులందుండి=మేడలపైనుండి; భాస్వర=ప్రకాశించునట్టి; సిద్ధార్థ=తెల్లయావాలు; ఫల=పండ్లు; అక్షత=అక్షతలు; ప్రసవ=పూవులు; దూర్వావ్రాత=లేతపచ్చికలు; దధి=పెరుఁగు; అంబువుల్=నీళ్లు; మొదలగువానిని; కరవల్లీ=తీఁగలవంటి చేతులయందలి; మణి, హేమ, కంకణ=మణులచేతను, బంగారముచేతను చేయఁబడిన కంకణములయొక్క; ఝణత్కారంబు=ధ్వని; శోభిల్లన్=ఒప్పుచుండఁగా; ఆ, భాగవత, ఉత్తమోత్తమునిపైన్=ఆ భాగవతశ్రేష్ఠులలో శ్రేష్ఠునిమీఁద; లీలాప్రమేయంబుగన్=మిక్కిలి విలాసముతో; చల్లిరి=చల్లిరి

తా. పురస్త్రీలు మేడలపైనుండి తమకంకణములు మ్రోగుచుండ నాభాగవతశ్రేష్ఠుఁడగు ధ్రువునిమీఁద దూర్వాక్షతాదులను జల్లిరి.

వ. ఇట్లు వాత్సల్యంబునం జల్లుచు సత్యవాక్యంబుల దీవించుచు సువర్ణపాత్రరచితమణిదీపనీరాజనంబుల నివాళింప పౌరజానపదమిత్రామాత్య బంధుజనపరివృతుండై చనుదెంచి. 104

అర్థ. ఇట్లు=ఈరీతిగా; వాత్సల్యంబునన్=ప్రేమతో; చల్లుచున్=చల్లుచు; సత్యవాక్యంబులన్=అప్రతిహతములైన మాటలచే

దీవించుచుఁ = ఆశీర్వదించుచు; సువర్ణపాత్రి, రచిత, మణిదీప, నీరా జనంబులన్, నివాళింపఁగ = బంగారుపాత్రిలలో మంచిమణిదీపములలో హారతియొత్తఁగా; పౌర, జానపద, మిత్రి, అమాత్య, బంధుజన, పరివృతుండు; అయి = పురజనులు, పల్లెలవారు, స్నేహితులు, మంత్రులు, బంధువులు, మొదలగువారిచే పరివేష్టింపఁబడి; చనుదెంచి = వచ్చి.

తా. ఈరీతిగా వారు ధ్రువుని దీవించుచు, బంగారుపాత్రిలందుంచిన మణిదీపములచే హారతి యిచ్చుచుండఁగా సమస్తపరివారముతోడను వచ్చి-

సీ. కాంచనమయమర ♦ కతకుడ్యమణిపరి
 చ్ఛదవిరాజిస్వచ్ఛ ♦ సౌధములను
వరసుధాసిక్తసాం ♦ ద్రమరకతవేదికా
 దాత్తసముంచిత ♦ తల్పములను
సురతరుశోభిత ♦ శుకపికమిథునాళి
 గానవిభాసితో ♦ ద్యానములను
సుమహితవైడూర్య ♦ సోపానవిమలశో
 భితజలపూర్ణవా ♦ పీచయముల
తే. వికచకల్హారదరదర ♦ విందకైర
వప్రదీపితబకచక్ర ♦ వాకరాజ
హంససారసకారండ ♦ వాదిజలవి
హంగనినదాభిరామ ప ♦ ద్మాకరముల. 105

అర్థ. కాంచనమయ = బంగారముతోఁగూడిన; మరకతకుడ్య = మరకతరత్నములచే చేయఁబడినగోడలును; మణి, పరిచ్ఛద = మణులచే

కప్పఁబడి; విరాజి=ప్రకాశించుచున్న; స్వచ్ఛ, సౌధములను=శుభ్రములయిన మేడలను; వర=శ్రేష్ఠమైన; సుధాఫేన=సున్నపునురుగువలె; పాండుర=తెల్లనై; స్వర్ణ పర్యంక=బంగారమయమంచముమీఁద; ఉదాత్త, సముంచిత=ఎక్కువశోభగా అమర్చఁబడిన; తల్పములను=పఱుపులను; సురతరు=కల్పవృక్షములచేత; శోభి=ప్రకాశింపఁజేయఁబడిన శుక, పిక, మిథున, ఆళి=చిలుకలు, కోకిలలు, వీనిదంపతులవరుసల; గాన=సంగీతముచే; విభాసిత=ఒప్పుచున్న; ఉద్యాన=ఉద్యానవనములు; సుమహిత=గొప్పవైన; వైడూర్యసోపాన=వైడూర్యమణులచే చేయఁబడిన మెట్లుకలిగి; విమల=స్వచ్ఛమై; శోభిత=ప్రకాశించుచున్న; జల=జలముచేత; పూర్ణ=నిండియున్న; వాపీచయములన్=సరస్సులచేతను; వికచ=వికసించిన; కల్హార=సౌగంధికపుష్పమును; కైరవ=కలువల; శ్రీచే; పరిదీపిత=ప్రకాశింపచేయఁబడిన, బక=కొంగలు; చక్రవాక=చక్రవాకపక్షులు; రాజహంస=రాజహంసలు; సారస=బెగ్గురుపక్షులు; కారండవ=నీటికాకులు; ఆది=మొదలైన; జలవిహంగ=నీటిపక్షుల; నినద=ధ్వనులచే; అభిరామ=మనోహరములైన; పద్మాకరముల్=తామరచెఱువులచేతను.

తా. బంగారము, మరకతములు, వీనిచే నిర్మింపఁబడిన గోడలును మణులచేకప్పఁబడిన మేడలును, బంగారుమంచముపై అమర్చఁబడిన తెల్లనిపఱుపులను, కల్పవృక్షములపై వాలుచున్న చిలుకలును కోకిలలును ఉద్యానవనములును, వైడూర్యములచేనిర్మింపఁబడిన మెట్లుకలిగి, గల స్వచ్ఛమైననీటితో నిండియున్న చెఱువులును, పద్మములు, కలువలు మొదలగు పువ్వులచేతను, చక్రవాకములు, రాజహంసలు మొదలగు నీటిపక్షుల ధ్వనులచే మనోహరములైన తామరచెఱువులును.

వ. మఱియును. 106

అర్థ. మఱియును=ఇంకను;

తే. చారుబహువిధవస్తువి ♦ స్తార మొప్ప
సంగనాయుక్త మగుచుం బెం ♦ పగ్గలించి
యర్థిఁ దనరారు జనకు గృ ♦ హంబు సొచ్చె
నెలమిఁ ద్రిదివంబు సొచ్చు దే ♦ వేంద్రుపగిది, 107

అర్థ. చారు=సుందరమైన; బహువిధ=అనేకవిధములైన వస్తు=వస్తువుల; విస్తారము=వస్తుసమృద్ధి; ఒప్పన్=ఒప్పగా; అంగనాయుక్తము అగుచున్=స్త్రీలతోకూడి యుండి; పెంపు; అగ్గలించి=మిక్కిలి గొప్పగా; అర్థిన్, తనరారు=ఎక్కువగా ప్రకాశించుచున్న; జనకుగృహంబున్=తండ్రిగృహమును; త్రిదివంబున్=సొచ్చు=స్వర్గమును ప్రవేశించు; దేవేంద్రుపగిదిన్=దేవేంద్రునివలె; ఎలమిన్=సంతోషముతో; సొచ్చెన్=ప్రవేశించెను.

తా. ఈరీతిగా వివిధవస్తుసమృద్ధికలిగి స్త్రీజనములతో కూడియున్న తండ్రిగృహమును ధ్రువుఁడు స్వర్గమును దేవేంద్రుఁడు ప్రవేశించు విధమున సంతోషముతోఁ బ్రవేశించెను.

వ. ఇట్లు ప్రవేశించిన రాజర్షి యైన యుత్తానపాదుండు సుతుని యాశ్చర్యకరం బైన ప్రభావంబు వినియుం జూచియు మనంబున విస్మయంబు నొంది ప్రజానురక్తుండును బ్రజాసమ్మతుండును నవయౌవనపరిపూర్ణుండును నైన ధ్రువుని రాజ్యాభిషిక్తుం జేసి వృద్ధవయస్కుండైన తన్నుఁ దాన యెఱింగి యాత్మగతిఁబొంద నిశ్చయించి విరక్తుండై వనంబునకుం జనియె నంత నా ధ్రువుండు శింశుమారప్రజాపతి కూఁతు రైన భ్రమియనుదాని వివాహంబై దాని వలనఁ గల్పవత్సరు లను నిద్దఱు గొడుకులం బడసి వెండి

యు వాయుపుత్రి యైనయిల యను భార్యయందు నుత్కలనామకుండైన కొడుకు నతిమనోహర యైన కన్యారత్నంబునుం గనియె నంతఁ దద్భ్రాత యైనయుత్తముండు వివాహంబు లేకుండి మృగయార్థంబు వనంబున కరిగి హిమవంతంబున యక్షునిచేత హతుం డయ్యె నతనితల్లియుఁ దద్దుఃఖంబున వనంబున కేఁగు నెడ గహనదహనుచేత మృతిం బొందె ధ్రువుండు భ్రాతృమరణంబు విని శోకవ్యాకులితచిత్తుండై జైత్రం బగు రథం బెక్కి యుత్తరాభిముఖుండై చని హిమవద్ద్రోణియందు భూతగణసేవితంబును గుహ్యకసంకులంబును నైన యలకాపురంబు పొడగని యమ్మహాబాహుండు, 108

అర్థ. ఇట్లు=ఈరీతిగా; ప్రవేశించిన=వచ్చిన; రాజర్షి అయిన=రాజర్షి అయిన; ఉత్తానపాదుఁడు=ఉత్తానపాదుఁడు; సుతుని=కొడుకుయొక్క; ఆశ్చర్య, కరంబు, అయిన, ప్రభావంబు=అద్భుతమైన మహాత్మ్యమును; వినియుఁ=వినియు; చూచియుఁ=చూచియు; మనంబునఁ=మనస్సులో; విస్మయంబుఁ, ఒంది=ఆశ్చర్యపడి; ప్రజా, అనురక్తుండును=ప్రజలపై అనురాగముగలవాఁడును; ప్రజాసమ్మతుండును=ప్రజలచే అంగీకరింపఁబడినవాఁడును; నవ, యౌవన, పరిపూర్ణుండును=నిండుక్రొత్తయౌవనముగలవాఁడును; అయిన, ధ్రువుని రాజ్యాభిషిక్తుఁ, చేసి=రాజ్యమున కభిషేకము జేసి; వృద్ధవయస్కుండు, అయిన, తన్నున్=ముసలివాఁడైన తన్ను; తానయెఱింగి=తానే తెలిసికొని; ఆత్మగతిఁ, పొందఁ, నిశ్చయించి=పరమాత్మను జేరఁగోరి; విరక్తుండు అయి=సంసారముపయి విరక్తి కలవాఁడయి; వనంబునకున్, చని

గెనె = వనమునకుపోయెను; అంతట = అప్పుడు; ఆధ్రువుండు; శింశుమారప్రజాపతికూఁతురు = శింశుమారుఁడను రాజుయొక్క కూఁతురైన; భ్రమి. అనునామె = భ్రమియనఁదగిన; కల్ప, వత్సరులు = కల్పుఁడు వత్సరుఁడు అను; కొడుకులం బడసె = ఇద్దరుకుమారులను గనెను; వెండియుఁ = మఱల; వాయు, పుత్రి, అయిన = వాయువుకూఁతురగు, ఇల, అను భార్యయందు; ఉత్కలనామకుం డైన = ఉత్కలుఁడను పేరుగల కొడుకును; అతిమనోహర, అయిన, కన్యారత్నంబునున్ = మిక్కిలి చక్కని కూఁతురును; కనియెన్ = కాంచెను; అంతన్ = పిమ్మట, తత్, భ్రాత్ర, అయిన = అతనిసోదరుఁడైన; ఉత్తముండు = ఉత్తముఁడు; వివాహంబు, లేకుండ = వివాహముచేసికొనకుండ; మృగయార్థంబు = వేఁటకొఱకు; వనంబునకు, డిగి = అడవికిపోయి; హిమవంతంబునన్ = హిమవత్పర్వత ముతయి; యక్షునిచేతన్ = ఒకయక్షునిచేత; హతుండు, అయ్యెన్ = మృతినొందెను; అతనితల్లియున్ = అతని తల్లియైనసురుచి; తత్, దుఃఖంబునన్ = ఆదుఃఖముచేత; వనంబునకున్, ఏఁగుచుండెన్ = వనమునకు పోవుచుండఁగ; గహనదవానలచెంతన్ = కారుచిచ్చునందు; మృతిన్ పొందెన్ = మృతిపొందెను; ధ్రువుండు; భ్రాతృమరణంబు, విని = సోదరుని చావు విని; శోక, వ్యాకులిత, చిత్తుండు అయి = దుఃఖించినమనస్సుగలవాఁడయి; జైత్రంబు అగు = జయశీలమైన; రథంబు, ఎక్కి = రథము నెక్కి; ఉత్తరాభిముఖుండయి = ఉత్తరదిక్కుగా; చని = పోయి; హిమవత్ ద్రోణియందున్ = హిమవాలయపర్వతమున; భూతగణసేవితంబును = భూతములచే సేవింపఁబడునదియు; యక్షసంకులంబును = యక్షులనువారితో నిండినదియు; అగు = అయిన; అలకాపురంబున్ = అలకాపట్టణమును, పొడగని = చూచి; ఆ, మహాబాహుండు = శూరుఁడగు నా ధ్రువుఁడు;

తా. స్పష్టము.

—ధూమ్రుండు కుబేరానుచరులైన గుహ్యకులతో యుద్ధముసేయుట.—

మ. ఘనశౌర్యోన్నతితోడ సర్వకకుబాకాశంబులందుం బ్రతి
ధ్వనులోలిన్ నిగుడంగ శంఖము మహోద్యల్లీలఁ బూరిం
పఁ, దన్నినదంబున్ విని యక్షకాంతలు భయాన్వీతాత్మ
లై యుగ్రసాధనులై యక్షభటుల్ పురిన్ వెడలిరుత్సా
హంబు సంధిల్లఁగన్. 109

టీ. ఘన, శౌర్య, ఉన్నతితోడన్=గొప్పశౌర్యముతో; సర్వకకుప్; ఆకాశంబులందున్=సర్వదిగంతరాలందును; ప్రతిధ్వనులు=మాఱుమ్రోఁతలు; ఓలిన్==వరుసగా; నిగుడంగన్=వ్యాపింపఁగా; శంఖము=శంఖమును; మహోద్యల్లీలన్=మిక్కిలివిలాసముతో; పూరింపన్=ధ్వనింపజేయఁగా; తత్, నినదంబున్=ఆధ్వనిని విని; యక్షకాంతలు=యక్షస్త్రీలు; భయాన్వీత,ఆత్మలు; ఆయిరి=భయముతోఁగూడినమనస్సుగలవారైరి; ఉగ్రసాధనులు ఆయి=భయంకరఆయుధములను పట్టుకొని; యక్షభటుల్=యక్షయోధులు; ఉత్సాహంబు సంధిల్లఁగన్=యుద్ధమునందలి యుత్సాహముతో; పురిన్, వెడలిరి=పట్టణమునుండిబయలుదేరిరి.

తా. ధూమ్రుఁడు అట్లు బయలుదేరి శంఖనినదంబు చేయఁగా నప్పటియక్షస్త్రీలు భయమునొందిరి. యక్షయోధులు ఆయుధములను పట్టుకొని యుద్ధమునకై పట్టణమునుండి బయలుదేరిరి.

వ. ఇట్లు వెడలి యాధూమ్రునిం దాఁకిన 110

టీ. ఇట్లు=ఈరీతిగా; వెడలి=బయలుదేరి; ఆ, ధూమ్రుని, తాఁకినన్=ఆధూమ్రుని ఎదిరింపఁగా;

చ. కరము మహోగ్రఘుండు భుజగర్వపరాక్రమశాలియున్ ధను
ర్ధరుఁడునునైన యాధూమ్రుఁడు దన్ను నెదిర్చిన యక్షకోటిఁ జ

చ్చెఁ బదుమూఁడువేల నొక ♦ పెట్టునఁ గైకొన కొక్కపెట్టభీ
కరముగ మూఁడుమూఁడు శిత ♦ కాండములం బగఁ గుఱ్ఱ నేసినన్.

అర్థ. కరము = ఎక్కువగా; మహారథుఁడు = మహారథుఁడును; భుజగర్వ, పరాక్రమశాలియున్ = గర్వముతోఁ గూడిన పరాక్రమముగలవాఁడును, ధనుర్ధరుఁడును = ధనుస్సును పట్టుకొనినవాఁడును; అయిన = ఐన; ధ్రువుఁడు; తన్నున్, ఎదిర్చిన = తన్నెదిరించిన; యక్షకోటికిన్ = యక్షులకు; చెచ్చెరన్ = శీఘ్రముగా; పదుమూఁడు వేలకున్ = 18000 మందిని; ఒకపెట్టికిన్, కైకొన = ఎంతమాత్రము లక్ష్యపెట్టక; ఒక్కపెట్టన్ = ఒక్కమారుగా; భీకరముగన్ = భయంకరముగా; మూఁడుమూఁడు = మూఁడేసి; శిత బాణములన్ = వాఁడిబాణములను; తగన్ = బాగుగా; కుఱ్ఱన్, ఏసినన్ = గుచ్చుకొనునట్లు ప్రయోగింపగా.

తా. పరాక్రమశాలియైన ధ్రువుండు ధనుస్సును ధరించి, తన్నెదిరింపవచ్చిన 18000 వేల యక్షులను లక్ష్యపెట్టక, యొక్కొక్కనిపై మూఁడేసి వాఁడిబాణములను ప్రయోగింపగా,

ఉ. వారు లలాటముల్ వగిలి ♦ వారక సోలియుఁ దేఱియమ్మహో
దారుపరాక్రమప్రకట ♦ ధైర్యముఁ దత్కరలాఘవంబు ప
ల్మాఱు నుతించుచుం గుపిత ♦ మానసులై పదతాడితప్రదు
ష్టోరగకోటివోలెఁ జటు ♦ లోగ్రభయంకరరోషమూర్తులై.

అర్థ. వారు = ఆ యక్షులు; లలాటములు పగిలి = నొసళ్లు పగిలి; వారక, సోలియున్ = ఎక్కువగాపడియును; తేఱి = తెప్పిఱిలి; ఆ, మహోదారు = ఆ ఉదారవంతుని; పరాక్రమ = శౌర్యమును; ప్రకట = ప్రసిద్ధమైన; ధైర్యమును = ధైర్యమును; తత్, కర, లాఘవంబున్ = అతని చేతి నేర్పును; పల్మాఱు, నుతించుచున్ = ఎక్కువగా కొనియాడుచు; కుపితమానసులై = కోపించినమనస్సుగలవారై; పద, తాడిత, ప్రదుష్ట, ఉరగకోటి,

పోరెన్ = కాలిచే త్రొక్కఁబడిన దుష్టసర్పములవలె; సటలు, ఉగ్ర, భయంకర, కోప, మూర్తులు, ఐరి = మిక్కిలి భయంకరమగు కోపముతో కూడినవారై.

తా. ఆ యతులు నాసట్లపగిలి, సొమ్మసిల్ల, మరల తెప్పరిలి, ధ్రువు ధైర్యసాహసములు కొనియాడుచు, పాదతాడనము పొందినదుష్టసర్పములవలె భయంకరకోపముతో

ఉ. ఆరథికోత్తముం దొడరి యందఱు నొక్కటఁ జుట్టుముట్టి యా
ఱాఱుశిలీముఖంబులను నంగములం బగిలించి వెండి వి
స్ఫారగదా శర క్షురిక పట్టిస తోమర శూల ఖడ్గముల్
సారథియుక్తుఁడైనరథసత్తముపైఁ గురియించి రేపునన్.

అర్థ. ఆ, రథికోత్తమున్, తొడరి = ఆమహారథుని దాఁకి; అందఱున్ = యతులందఱును; ఒక్కటన్ = ఒక్కసారిగా; చుట్టుముట్టి = చుట్టుకొని; ఆఱు, ఆఱు, శిలీముఖంబులను = ఆఱేసి బాణములచే; అంగములన్, పగిలించి = అవయవములను భేదించి; వెండి = మఱియు; విస్ఫార = ప్రకాశించుచున్న; గదా. శర, క్షురిక, పట్టిస, తోమర, శూల, ఖడ్గముల్ = గదలు, బాణములు, కత్తులు, అడ్డకత్తులు, చిల్లకోలలు, శూలములు, ఖడ్గములు వీనిని; సారథియుక్తుఁడైన = సారథితోకూడిన; రథసత్తముపయిన్ = మహాత్ముఁడైన ధ్రువునిన్; ఏపునన్ = గర్వముతో; కురియించిరి = వర్షింపజేసిరి

తా. ఆయతులు ధ్రువుని దాఁక, చుట్టుముట్టి, ఆఱేసి బాణములచే నతని అవయవములను భేదించి, సారథితోఁగూడిన ఆమహారథుపై గదలు మొదలగు నాయుధములను వర్షించిరి.

వ. అట్లు గురియించిన నతండు. 114

అర్థ. అట్లు కురియించినన్, అతండు = అట్లు వర్షింపగా ఆధ్రువుఁడు

క. పెంపఱి యుండెను ధారా
సంపాతచ్ఛిన్న మైన ♦ శైలముభంగిన్
గుంపులు గొని యాకసమునఁ
గంపించుచు నవుడు సిద్ధ ♦ గణములు వరుసన్. 115

అర్థ. ధారా, సంపాత, ఛిన్నము, అయిన, భంగిన్ = వర్షధారలచేత కప్పఁబడిన పర్వతమువలె; పెంపు, అఱి, ఉండెను, శోభతరిగియుండెను; అపుడు; సిద్ధగణముల = సిద్ధసమూహములు; వరుసన్ = వరుసగా; ఆకసమునందు; గుంపులు, గొని = గుంపులుగా కూడి; కంపించుచున్ = వణఁకుచు (ముందుపద్యముతో నన్వయము)

తా. వర్షధారలచే కప్పఁబడిన పర్వతమువలె ధ్రువుండు శోభ తరిగియుండెను అపుడు సిద్ధులాకాశమునందు గుంపులుగాఁగూడి, వడఁకుచున్నవారై (ముందుపద్యముతో నన్వయము).

క. హాహాకారము లెసఁగఁగ
నోహో యీరీతి ధ్రువప ♦ యోరుహహితుఁ డు
త్సాహము సెడి యిటు దైత్యస
మూహార్ణవమందు నేఁడు ♦ మునిఁగెనె యకటా. 116

అర్థ. హాహాకారములు, ఎసఁగఁగన్ = హాహాఅనుధ్వనము పుట్టుచుండఁగా; ఓహో = అయ్యో; ఈరీతిన్ = ఈవిధముగా; ధ్రువ, పయోరుహహితుఁడు = ధ్రువుఁడనుసూర్యుఁడు; ఉత్సాహము చెడి = ఉత్సాహము, ముపోయి; ఇటు = ఈవిధముగా; దైత్య, సమూహ, అర్ణవమునందు = రాక్షసుల సమూహమను సముద్రమందు; నేఁడు; అకటా = అయ్యో; మునిఁగెనె = మునిఁగినాఁడా!

తా. హాహాయనిధ్వని చేయుచు అహో!, నేఁడు ధ్రువుఁడను

సూర్యుఁడు రాక్షసులను మహాసముద్రములో మునిఁగినాఁడా!

వ. అని చింతింపు నవసరంబున. 117

అర్థ. అని, చింతింపు, అవసరంబునన్ = అని విచారించుచున్న సమయమునందు.

క. తా మాతని గెలిచితి మని
యామనుజాశనులు వలుక • నట నీహార
స్తోమము సమయించుచు మహ
ద్దాముం డగు సూర్యుఁ బోలె • తద్దయుఁ దోఁచెన్. 118

అర్థ. తాము = తాము; ఆతనిన్ = ఆధ్రువుని; గెల్చితిమి, అని = జయించితిమని; ఆ, మనుజాశనులు = ఆ యక్షులు; పలుకన్ = పలుకఁగా; అటన్ = అప్పుడు; నీహారస్తోమమున్ = దట్టమైనమంచును; సమయించు = విరియఁజేయు; మహత్, ఉద్దాముండు, అగు = మిక్కిలికాంతిగలవాఁడగు; సూర్యున్, పోలి = సూర్యునివలె; తద్దయున్ = మిక్కిలిగా; తోఁచెన్ = తోఁచెను.

తా. ఆయక్షులు ధ్రువుని జయించితిమని ఉప్పొంగుచుండగా మంచును విరియించి కాంతిమంతుఁడై వెలుఁగు సూర్యునివలె ధ్రువుఁడు మఱలఁగోచరించెను.

వ. అట్లు దోఁచి. 119

అర్థ. అట్లు, తోఁచి = అట్లుగోచరించి.

మ. అరిదుర్గిఖావహమైనకార్ముకము శౌ•ర్యస్ఫూర్తితోఁ దాల్చి భీ
కరబాణావళిఁ బింజఁబింజగఱవం•గా నేసి ఝుంఝానిలుం
డురుమేఘావళిఁ బాఱఁదోలుగతి న•త్యుగ్రాహితక్రూరబం
ధురశస్త్రావళి రూపుమాపె విలస•ద్దోర్లీలసంధిల్లఁగన్. 120

అర్థ. అరి, దుఃఖావహము, అయిన, శౌర్యకమున=శత్రువులకు దుఃఖముఁ గలుగఁజేయు వింటిని; శౌర్యస్ఫూర్తితోన్=ఎక్కువైన శౌర్యముతో; తాల్చి=పట్టుకొని; భీకర, బాణాళిన్=భయంకరమైన బాణముల వరుసను; పింజపింజ, కరంగాన్; ఏసి=ఒకదానివెంట నొకటి వదల కుండునట్లు ప్రయోగించి; ఝంఝానిలుండు=ఝంఝామారుతము; ఉరుమేఘావళిన్=దట్టమైన మేఘములను; పాఱఁదోలుగతిన్=తఱుమఁగొట్టునట్లుగా; అతి, ఉగ్ర, అహిత, క్రూర, బంధుర, శస్త్రావళిన్=మిక్కిలి ఘోరమును, హింసించునదియు, క్రూరమయినదియు, దట్టమయినదియు నగు ఖడ్గములవరుసను; విలసత్=ప్రకాశించుచున్న, దోః, లీల=భుజవిలాసము; సంధిల్లఁగన్=ఒప్పుచుండఁగా; రూపుమాపెన్=సంహరించెను.

తా. ధ్రువుఁడు మిక్కిలి శౌర్యముతో వింటినెత్తి, బాణముల నెడతెగకుండ ప్రయోగించి, ఝంఝామారుతము మేఘముల పాఱఁదోలునట్లు వారి శస్త్రముల నన్నిటిని సంహరించెను.

ఉ. మఱియును నమ్మహాత్ముఁ డస♦మానబలుండు మహోగ్రబా
ణముల్, గఱి గఱిఁ దాఁక నేసి భుజ♦గర్వ మెలర్ప విరోధి
వర్గముల్, దఱిదఱి సేసి యంగములు♦భంగము నొందఁ
గఁ జేసె వ్రేల్మిడిన్, గిఱికొని పర్వతంబులు నొ♦గిం దెగఁ
గొట్టెడు నింద్రుకైవడిన్. 121

అర్థ. మఱియును, అసమానబలుండు=సాటిలేని బలముగలవాఁడైన; ఆమహాత్ముఁడు=ఆమహానుభావుఁడైన ధ్రువుఁడు; మహోగ్రబాణముల్=భయంకరమైన బాణములను; గఱిగఱి దాఁకన్=ఒకదానికొకటి తాఁకిపోవునట్లుగా; ఏసి=ప్రయోగించి; భుజగర్వము ఎలర్పన్=తన భుజముల గర్వము ఎక్కువ యగుచుండఁగా; విరోధివర్గముల్=శత్రువుల

కనములు; పటిపటిచేసి=ముక్కముక్కలుగాచేసి; అంగములు=వారి శరీరఅవయవములు; త్రెళ్లిడిన్=ఒక్కక్షణములో; గతికొని=పూనికతో; పర్వతములన్=కొండలను; ఒగిన్=వరుసగా; తెగఁగొట్టెడు=ఖండించు; ఇంద్రుకైవడిన్=ఇంద్రునివలె; భంగముగన్, ఒందఁగన్, చేసెన్=కొట్టెను.

తా. ఇంకను అసమానబలుఁడైన ధృష్టుఁడు, ఉగ్రబాణముల వరుసను ప్రయోగించి; శత్రువులకవచములను తెగఁగొట్టి, ఇంద్రుఁడు పర్వతములను కొట్టునట్లుగా వారిని కొట్టెను.

వ. అయ్యవసరంబున. 122

అర్థ. ఆ, అవసరంబునన్=ఆసమయమునందు.

ప. అలఘుచరిత్రుఁ డమ్మనుకు ♦ లాగ్రణిచే వికలాంగులైనవా
రలసకిరీటకుండలవి ♦ రాజితమస్తకకోటిచే సము
జ్జ్వలమణికంకణాంగదల ♦ సద్భుజవర్గముచేత సంగర
స్థల మతిరమ్యమై తనరె ♦ సంచిత వీరమనోహరాకృతిన్.

అర్థ. అలఘు, చరిత్రుఁడు=గొప్పచరిత్రముగల; అమ్మనుకులాగ్రణిచేన్=మనువుయొక్కకులమందు శ్రేష్ఠుఁడైన ఆధృష్టుని చేత; వికలాంగులు, అయిన వారల=అవయవములు తెగిపడినవారియొక్క; స, కిరీట, కుండల, విరాజిత, మస్తక, కోటిచేన్=కిరీటములు, కుండలములు వీనిచే ప్రకాశించుచున్న శిరస్సులసమూహముచేతను; స, ఉజ్జ్వల, మణి, కంకణ, అంగద, లసత్, భుజవర్గముచేతన్=మణికంకణములు, భుజకీర్తులు, వీనిచే ప్రకాశించుభుజములచేతను; సంగరస్థలము=యుద్ధభూమి; అతిరమ్యము=మిక్కిలి మనోహరమయి; సంచిత, వీర, మనోహర, ఆకృతిన్=కలసియున్న, వీరులయొక్క చక్కని రూపముతో, తనరెన్=ఒప్పెను.

తా. ధ్రువునిచే నఱకఁబడియున వారి కిరీటకుండలములతోఁ గూడిన తలలచేతను, కంకణభుజకీర్తులతోఁ గూడిన భుజములచేతను; యుద్ధభూమి మిక్కిలి మనోహరముగానుండెను.

వ. అంత హతశేషులు. 124

అర్థ. అంతన్, హతశేషులు=అప్పుడు మృతినొందఁగా మిగిలినవారు.

క. వరబలుఁ డగు మనుమనుమని
శరసంఛిన్నాంగు లగుచు ♦ సమరవిముఖులై
హరిరాజముఁ గని పఱచిన
కరిబృందముఁబోలెఁ జనిరి ♦ కళవళపడుచున్. 125

అర్థ. వరబలుఁడు, అగు=గొప్పబలము కలిగిన; మనుమనుమని=మనువుయొక్క మనుమఁడైన ధ్రువుని; శర=బాణములచే సంఛిన్న=ఛేదింపఁబడిన; అంగులు, అగుచున్=అవయవములుకలవారయి; సమర, విముఖులు, అయి=యుద్ధమునుండి మఱలిపోయి; హరిరాజమున్, కని=సింహమును చూచి; పఱచిన=పరుగెత్తు; కరిబృందముపోలెన్=ఏనుఁగుల సమూహమువలె; కళవళపడుచున్=తొట్రుపాటుతో; చనిరి=పాఱిపోయిరి

తా. ధ్రువునిబాణములచేత ఛేదింపఁబడిన యవయవములుగలవారై యాయక్షులు సింహమునుచూచిన ఏనుగులవలె తడఁబడుచు యుద్ధభూమినుండి పాఱిపోయిరి

క. అప్పుడు రాక్షసమాయలు
గప్పిన ధ్రువుఁ డసురవరుల ♦ కార్యం బెఱుఁగం
జొప్పడకే వారిఁ బొడగని
దెప్పర మగుటయును సార ♦ థిం గని యంతన్. 126

అర్థ. అప్పుడు; రాక్షసమాయలు=రాక్షసులమాయలు; కప్పి నన్=వ్యాపింపఁగా; ధ్రువుఁడు; అసురవరుల, కార్యంబు, ఎఱుఁగక, చొప్పడఁక=రాక్షసులు చేయు కృత్యములను తెలిసికొనఁజాలక; వారిన్, పొడఁగని=వారిని చూచి; దెప్పరము, అగుటయున్=ఏమియును తోఁచక; సారథిక, కని=సారథిని చూచి; అంతన్=అప్పుడు.

తా. అప్పుడు రాక్షసులు తమ మాయలను ప్రయోగింపఁగా ధ్రువుఁడు వారి కృత్యములను తెలిసికోలేక వారిని చూచి సారథితో నిట్లనెను.

క. తలపోయఁగ భువి మాయా
వులకృత్యం బెఱుఁగ నెవ్వ ♦ రోపుదు రనుచుం
బలుకుచుఁ బత్పురిఁ జొరఁగాఁ
దలఁపఁగ నది గాన రాక తద్దయు మాసెన్, 127

అర్థ. తలపోయఁగన్=ఆలోచింపఁగ; భువిన్=భూమియందు; మాయావుల, కృత్యంబు=మాయాపరులపనుల, ఎఱుఁగన్, ఎవరు, ఒప్పుదురు=ఎవరు తెలిసికొనఁగలరు; అనుచున్, పలుకుచున్=అని పల్కుచు; తత్, పురిన్=వారిపురమును; చొరఁగాన్=ప్రవేశించుటకు; తలఁపఁగన్=ఆలోచింపఁగా; అది=ఆపురము; కానరాక, తద్దయు, మాసెన్=కనఁబడక మాయమయ్యెను.

తా. భూమియందు మాయాపరుల కృత్యముల నెవ్వరు నెఱుంగ జాలరని చెప్పుచు, వారి పురముఁ బ్రవేశింపఁదలంప నది కానరాక మాయమయ్యెను.

వ. అట్లు పురంబున కరుగుట మాని చిత్రరథుం డైన యాధ్రు
వుండు సప్రయత్నుం డయ్యును బరప్రతియోగశంకితుం డై

యుండె నయ్యెడ మహాజలధి ఘోషంబు ననుకరించుశబ్దం
బు వినంబడె నంత సకలదిక్తటంబుల వాయుజనితంబయిన రజః
పటలంబు దోఁచెఁ దత్క్షణంబ యాకాశంబున విస్ఫురత్తటి
త్ప్రభాకలితగర్జారవయుక్తంబు లగుమేఘంబు లమో
ఘంబులై భయంకరాకారంబులై తోఁచె నంత. 128

టీ. అట్లు=ఆరీతిగా; పురంబునకు=పట్టణమునకు; అరుగుట=ప్రవేశించుట; మాని=మాని; చిత్రరథుండు=చిత్రగతిగలిగినరథముగల ఆధ్రువుడు; సప్రయత్నుండు; ప్రయత్నుఁడు=ప్రయత్నించినవాఁడు; పర, ప్రతియోగ, శంకితుండు, అయి, ఉండెన్=శత్రువుల ప్రతిరోధమును గూర్చి శంకించుచుండెను; అయ్యెడన్=అప్పుడు; మహాజలధి, ఘోషంబున్, అనుకరించు=మహాసముద్రముయొక్క ధ్వనినిపోలిన; శబ్దంబు=ధ్వని; వినంబడెన్=వినఁబడెను; అంతన్=అంత; సకల, దిక్, తటంబులన్=సర్వదిక్కులయందును; వాయు, జనితంబు, అయిన=వాయువుచే పుట్టిన; రజఃపటలంబు, తోఁచెన్=ధూళి రేగెను; తత్, క్షణంబ=ఆసమయమందే; ఆకాశంబునన్=ఆకాశమునందు; విస్ఫురత్=ప్రకాశించుచున్న; తటిత్, ప్రభా, కలిత, గర్జారవ, యుక్తంబులు, అగు=మెరపులతోను; ఉరుములతోను కూడిన మేఘములు, అమోఘంబులు అయి=దట్టముగాను; భయంకర ఆకారంబులు, అయి=భయముగలిగించు నాకారములతోను; తోఁచెన్=కనఁబడెను; అంతన్=అప్పుడు.

తా. స్పష్టము.

సీ. అనయంబునన్ ధ్రువుమీఁద దైత్యకృతమా♦యాజాల మ
ల్లెంచి బోరన మస్తిష్కపూయవసమూత్రపలదు♦ర్గంధాస్థిమద
శ్శరాసననిస్త్రింశశరాసతోమరగదా♦చక్రత్రిశూలాదిసా
ధనభూభృద్భుజగావళిం గురిసెను♦ద్దండక్రియాలోలతన్.

అర్థ. అనలంబునన్ = ఎడతెగక; ధ్రువుమీఁదన్ = ధ్రువుని మీఁద; దైత్యకృత, మాయాజాలము = రాక్షసులచే చేయఁబడిన మాయ యొక్క సమూహము; అట్లు, ఏచి = ఆరీతిగా పెల్లుబికి; బోరనన్ = బోరుమని; మస్తిష్క, పురీష, మూత్ర, పల, దుర్గంధ, అస్థి, మేదస్, శరాసన, నిస్త్రింశ, శర, అసి, తోమర, గదా, చక్ర, త్రిశూల, ఆది, సాధన, భూభృత్, భుజగాళిన్ = మెదడు, పురీషము, మూత్రము, మాంసము, కంపుకొట్టుచున్న ఎముకలు, మూలుగు, విండ్లు, కత్తులు, బాణములు, ఖడ్గములు, చిల్లకోలలు, గదలు, చక్రములు, త్రిశూలములు, మొదలైన యుద్ధసాధనములను కొండలు, పాములు, మొదలగువాని మొత్తములను; ఉద్దండ, క్రియా, లోలతన్ = భయంకరలీలతో; కురిసెన్ = వర్షించెను.

తా. ఆరీతిగా రాక్షసులమాయలు పెల్లుబికి, ధ్రువునిమీఁద మాంసము, ఎముకలు మొదలగువానిని, ఆయుధములను, పాములను, కొండలను భయంకరముగా కురియునట్లు చేసెను

వ. మఱియు మత్తగజసింహవ్యాఘ్రసమూహంబులును నూర్మిభయంకరంబై సర్వతస్ప్లవనం బయినసముద్రంబును గానంబడియె. వెండియుం గల్పాంతంబునందుంబోలె భీషణంబైనమహాహ్రదంబునుందోఁచెనివ్విధంబుననానావిధంబులు ననేకంబులును నవిరళభయంకరంబులు నయినయసురమాయలు గ్రూరప్రవర్తను లగుయక్షులచేత సృజ్యమానంబులై యడరె నాసమయంబున. 130

అర్థ. మఱియున్ = ఇంకను; మత్త, గజ, సింహ, వ్యాఘ్ర, సమూహంబులు = మదించిన ఏనుఁగులు, సింహములు, పెద్దపులులు వీని మొత్తములను; ఊర్మి, భయంకరంబై = తరంగములచే భయముపుట్టించుచు; సర్వతః, ప్లవనంబు, అయిన, సముద్రంబున్ = అన్నిదిక్కులు వ్యా

పించిన ధూమవర్షమును; కానంబడియెన్ = కానంబడెను; వెండియున్ = ఇంకను; కల్పాంతంబునందున్, పోలెన్ = ప్రళయకాలమునందువలె; భీషణంబు, అయిన = భయంకరంబైన; మహా హ్రాదంబునున్ = గొప్ప ఉరుముగును; తోచెన్ = కనపడెను; ఇవ్విధంబునన్ = ఈరీతిగా; నానా విధంబులును = అనేకవిధములయినట్టివియు; అనేకంబులును = మితిలేనివియు; అవిరళ, భయంకరంబులున్, అయిన = మిక్కిలి ఘనములుగొల్పునవియునగు; అసురమాయలు = యక్షులమాయలు; క్రూరప్రవర్తనులు, అగు, యక్షులచేత = క్రూరాచారములుగల యక్షులచేత; సృజ్యమానంబులు, అయి = పుట్టింపఁబడి; ప్రసరెన్ = వ్యాపించెను; ఆసమయంబునన్ = అప్పుడు.

తా. స్పష్టము.

క. అనయంబును యక్షుల
ఘనమాయ నెఱింగి మునిని♦కాయము వరుసన్
మనుమనుమని మను మను మని
మనమునఁ దలఁచుచును తత్స♦మక్షంబునకున్. 131

అర్థ. అనయంబును = ఎక్కువగా; ఆ, యక్షుల = ఆ యక్షులయొక్క; ఘనమాయన్ = గొప్పమాయను; ఎఱింగి = తెలిసికొని; మునినికాయము = మునులసమూహము; వరుసన్ = వరుసగా; మను, మనుమని = మనువుమనుమడైన ధ్రువుని; మను, మనుము, అని = జీవింపుము జీవింపుమని; మనమునన్ = మనస్సునందు; తలఁచుచును = ఆశీర్వదించుచు; తత్సమక్షంబునకున్ = అతనియెద్దకు (ముందుపద్యముతో నన్వయము.)

తా. యక్షులు ప్రయోగించుమాయలను తెలిసికొని మునులు, తమమనస్సులలో ధ్రువుఁడు చిరంజీవియగుఁగాక యని ఆశీర్వదించుచు నతని యెద్దకు (ముందుపద్యముతో నన్వయము)

వ. చనుదెంచి యా ధ్రువునిం గని యిట్లనిరి. 132

అర్థ. చనుదెంచి=వచ్చి; అధ్రువునిన్=అధ్రువుని; కని=చూచి; ఇట్లు అనిరి=ఇట్లుపలికిరి,

సీ. అనఘాత్మ లోకు లె ♦ వ్వని దివ్యనామంబు
సమత నాకర్ణించి ♦ సంస్మరించి
దుస్తరం బైన మృ ♦ త్యువు నైన సుఖవృత్తిఁ
దరియింతు రట్టి యీ ♦ శ్వరుఁడు పరుఁడు
భగవంతుఁడును శార్ఙ్గ ♦ పాణియు భక్తజ
నార్తిహారుండును ♦ నైనవిభుఁడు
భవదీయవినుతులఁ ♦ బరిమార్చుఁ గా కని
పలికిన మునులసం ♦ భాషణములు
తే. విని కృతాంచనునుఁ డయి మా ♦ విభునిపాద
కమలములఁ దలంచి రిపుభయం ♦ కరమహోగ్ర
కలితనారాయణాస్త్రంబుఁ ♦ గార్ముకమునఁ
బూనఁ దడవఁ దదీయసం ♦ ధానమునను. 133

అర్థ. అనఘాత్మ=పాపరహితుఁడా; లోకులు=జనులు; ఎవని దివ్యనామంబున్=ఎవనిపవిత్రనామమును; సమతన్=యోగబుద్ధితో; ఆకర్ణించి=విని; సంస్మరించి=జ్ఞాపకముఁచుకొని; దుస్తరంబు, ఆయిన=దాఁటశక్యముగాని; మృత్యువును, ఆయినన్=చావునైనను; సుఖవృత్తిన్=సౌఖ్యముగా; తరియింతురు=దాటుదురో; అట్టి=అటువంటి; ఈశ్వరుఁడు==శ్రీమహావిష్ణువు; పరుఁడు=శ్రేష్ఠుడు; భగవంతుడును=ఐశ్వర్యవంతుఁడును; శార్ఙ్గపాణియు=శార్ఙ్గమనువింటినిధరించినవాఁడును; భక్తజన, ఆర్తి, హారుండును=భక్తులదుఃఖమును పోగొట్టువాఁడును; అయిన, విభుఁడు=అయినట్టిప్రభువు; భవదీయ, వినుతులన్=నీశ

త్రువులను; పరిమార్చుగా, అని, కాక, అని = ఎంపుట గాక యని; పలికి నన్ = పలుకఁగా; మునుల సంభాషణము = మునులమాటలను విని; కృత; ఆచమనుఁడు, ఐయి = ఆచమనము చేసి; మా, ధుని, పాదపద్మములను, తలంచి = లక్ష్మీనాథుని పాదపద్మము తలంచి; రిపు, భయంకర, మహోగ్ర, కలిత, నారాయణాస్త్రంబు = శత్రుభయంకరంబగు నారాయణాస్త్రమును; కార్ముకమునన్ = వింటియందు; పూనన్, కడవన్ = సంధించుటకు వెతుకఁగా; తదీయ, సంధానమునను = దాని నెక్కుపెట్టఁగానే.

తా. ధ్రువుఁడా! శ్రీమహావిష్ణువు పావననామమును యోగబుద్ధితో విని, ధ్యానించి, జనులు, మృత్యువును దాఁటుదురు అట్టిభక్తజనపాలకుఁడగు విష్ణువు. నీశత్రువులను పరిమార్చును గాక అని పలుకగా, మునులమాటలువిని ఆచమనము చేసి, లక్ష్మీనాథుని పాదపద్మములను తలంచి, శత్రు భయంకరమగు నారాయణాస్త్రము వింటియందు సంధించుచుండఁగనే.

తే. కడఁగి గుహ్యకమాయాంధ ♦ కార మపుడు
వెరవు సెడి దవ్వుదవ్వుల ♦ విరిసి పోయె
విమల మైనవివేకోద ♦ యముఁ జేసి
సమయు రాగాదికంబుల ♦ సరణి నంత. 134

అర్థ. కడఁగి = పూని; గుహ్యక, మాయా, అంధకారము = యక్షులమాయయను చీఁకటి, అపుడు; విమలమైన = స్వచ్ఛమైన; వివేక, హృదయమునన్. చేసి = జ్ఞానము కలుగుటచేత; సమయు = తొలఁగిపోవు; రాగాధికంబులసరణిన్ = కామము, మోహము, రాగము, ద్వేషము మొదలగువానివలె; అంతన్, అపుడు; రవు చెడి = దారి తెలియక; దవ్వుదవ్వులన్ = దూరముగా; విరిసిపోయెన్ = తొలఁగిపోయెను,

తా. జ్ఞానము కలుగుటవలన రాగద్వేషాదులు నశించునట్లు ఆయక్షులమాయయను నంధకారమును దూరదూరముగా తొలఁగిపోయెను,

మ. వరనారాయణబాణరాడ్జనితదు♦ర్వారప్రభాహేమపుం
ఖరుచిస్ఫారమరాళరాజసితప♦క్షక్రూరధారారణ
చ్ఛరసాహస్రము లోలి భీషణవిప♦క్షశ్రేణిపై వ్రాలె భీ
కరరావంబునఁ గానఁ జొచ్చు శిఖిసం♦ఘాతంబు చందంబునన్.

అర్థ. వర=శ్రేష్ఠమైన; నారాయణబాణ రాట్=నారాయణాస్త్రబాణరాజమునుండి; జనిత=పుట్టిన; దుర్వార=అడ్డుకొనని; ప్రభా=కాంతులుగల; హేమపుంఖ=బంగారు మొనల; రుచి=కాంతిగలిగి, స్ఫార=ఒప్పుచున్న; మరాళరాజ=రాజహంసల; సితపక్ష—తెల్లని రెక్కలవలె; క్రూరధారా=వాడియైనయంచుకలిగి; రణత్=ధ్వనిచేయుచున్న; శరసాహస్రములు=వేలకొలఁదివిండ్లు; ఓలిన్=వరుసగా; భీషణ, విపక్ష, శ్రేణిపయిన్=భయంకరశత్రుసమూహముపై; భీకరరావంబునన్=భయంకరమగు ధ్వనితో; కానన్, చొచ్చు=అడవిని ప్రవేశించు; శిఖిసంఘాతంబు. చందబునన్=అగ్నులసమూహమువలె; వ్రాలెన్=పడెను.

తా. ధ్రువుని నారాయణాస్త్రమునుండి తేజోవిరాజితములైన బాణసమూహములు, పుంఖానుపుంఖములుగా అడవియందు ప్రవేశించు నగ్నులవలె శత్రుకోటిపైఁబడెను.

వ. అట్లేసిన. 136

అర్థ. అట్లు, ఏసినన్=ఆప్రకారము ప్రయోగింపఁగా.

చ. ఖరశితసద్రిదీప్తసుర♦కాండపరంపరవృష్టిచేఁ బొరిం
బొరినికలాంగులై [illegible]
గియడసిఁ జూచి భూరిభుజ♦గర్వకరంబు లెదిర్చి పేర్చి చె
చ్చెరనడతెంచు చందమునఁ♦జిత్రరథుం బలుపూని తాఁకినన్.

అర్థ. ఖర, విశిఖ, ప్రదీప్త, ఘన, కాండ, పరంపర, వృష్టిచేన్=వాఁడియై, తీక్ష్ణమై, ప్రకాశించు, దట్టమైన, బాణముల వర్షముచేత; పోరిఁబోరిఁ=ఎక్కువగా; వికలాంగులు, అయి, విరిగిన అవయవములుగలవారై; అవల=పూని; పుణ్యజనుల్=రాక్షసులు: పృథు, హేతి, పాణులు, అయి=పెద్దఖడ్గములను పట్టుకొని; గరుడునిఁ=గరుత్మంతుని చూచి; భూరి, భుజగప్రకరంబులు=గొప్పసర్పముల సమూహములు; ఎదిర్చి=ఎదిరించి; పేర్చి=పెచ్చుపెరిఁగి; చెచ్చెరన్=వేగముగా; నడతెంచు చందమునఁ=వచ్చువిధముగా; చిత్రరథున్=విచిత్రగతులతో నడచుచున్న రథమునెక్కిన ధ్రువుని; బలుపు=బలమును, ఊని=కలిగి; తాఁకినన్=ఎదిరింపఁగా.

తా. గరుడనిపై పాము లెదిరించి వచ్చునట్లు రాక్షసులు పెద్ద ఖడ్గములను ధరించి ధ్రువుని దాఁకిరి. అట్లు తాఁకఁగా.

ఉ. వారలఁ జండతీవ్రశర ♦ వర్గముచేత నికృత్తపాదజం
ఘోరుశిరోధరాంబకక ♦ రోదరకర్ణులఁ జేసి యోగి సం
కేరుహమిత్రమండలని ♦ కృత్తత నెట్టిపదంబుఁ జెందు నా
భూరిపదంబునం బెలుచఁ ♦ బొందఁగఁ బంపె భుజావిజృంభియై.

అర్థ. వారలఁ=వారిని; చండ, తీవ్ర, శరవర్గముచేతన్=తీక్ష్ణమైన బాణములచే; నికృత్త, పాద, జంఘ, ఊరు, శిరస్, అధర, అంబక, కర, ఉదర, కర్ణున్, చేసి=పాదములు, పిక్కలు, శిరస్సులు, పెదవులు, కన్నులు, చేతులు, కడుపులు, చెవులు వీనిని భేదించి; యోగి, పంకేరుహమిత్ర మండల, నికృత్తతన్=సూర్యమండలమును భేదించుటవలన; ఏమిపదంబున్, చెందున్=ఏపదవిని పొందునో; ఆ, భూరిపదంబునన్=ఆశ్రేష్ఠమైనపదవిని; వెలుచన్=మిక్కిలిగా; పొందఁగన్=చేరునట్లు; భుజ, విజృంభి; అయి=భుజగర్వముతో; పంపెన్=పంపెను.

తా. ఆరాక్షసులను తన బాణములచేత, సకలావయవములను భేదించి, యోగులు భేదించుకొనుపోవు సూర్యమండలమును చేరునట్లు చేసెను.

వ. ఇవ్విధంబున నా చిత్రరథుండగు ధ్రువుని చేత నిహన్యమాను
లును నిరపరాధులును నయిన గుహ్యకులం జూచి యతని
పితామహుండైన స్వాయంభువుండు ఋషిగణపరివృతుం
డై చనుదెంచి ధ్రువునిం జూచి యిట్లనియె వత్సా నిర
పరాధులైన యీపుణ్యజనుల నెట్టిరోషంబున వధియించితి
విట్టినిరయహేతువైన రోషంబు సాలుభ్రాతృవత్సలభ్రా
తృవధాభితప్తుండవై కావించునీయత్నంబుడుగుమని. 139

అర్థ. ఇవ్విధంబునన్=ఈరీతిగా; ఆ, చిత్రరథుండు, అగు, ధ్రువుని చేతన్=రథముపై చిత్రముగ సంచరించు నాధ్రువుని చేత; నిహన్యమానులును=చంపఁబడుచున్నవారును; నిరపరాధులును=ఎట్టితప్పును లేనివారును; అయిన, గుహ్యకులన్, చూచి=యక్షులను చూచి; అతని, పితామహుండు అయిన, స్వాయంభువుండు=అతనితాత యగు స్వాయంభువమనువు; ఋషిగణపరివృతుండయి=ఋషులతోఁగూడి; చనుదెంచి=వచ్చి; ధ్రువునిన్, చూచి, ఇట్లనియెన్=ధ్రువుని చూచి యిట్లు పలికెను; వత్సా=బాలకా; నిరపరాధులైన=ఎట్టితప్పునులేని; ఈపుణ్యజనులన్=ఈరాక్షసులను; ఎట్టిరోషంబునన్=ఏమికోపముచేత; వధియించితివి=చంపినావు; ఇట్టి=ఇటువంటి; నిరయహేతువు, అయిన=పాపకారణమైన; రోషంబు, చాలున్=కోపము చాలును; భ్రాతృవత్సల=సోదరునియందు ప్రేమగలవాఁడా; భ్రాతృవధ, అభితప్తుండవు, అయి=నీసోదరునివధచే కోపించినవాఁడవయి; కావించు=చేయుచున్న; నీయత్నంబు=నీప్రయత్నమును; ఉడుగుము, అని=మానుమని.

తా. స్పష్టము

క. అనఘా మనుకులమున కిది
యనుచితకర్మంబ యొకని • కై పెక్కండ్రి
ట్లని మొనఁ ద్రుంగిరి యిది నీ
కనయంబును వలవ దుడుగు • మయ్య కుమారా. 140

టీక. అనఘా=పాపములేనివాఁడా; మనుకులమునకు=మనువు వంశమునకు; ఇది=ఇట్లు చేయుట; అనుచితకర్మంబ=కూడనికార్యమే; ఒకనికై=ఒకనికోసము; పెక్కండ్రు=అనేకులు; ఇట్లు=ఈరీతిగా; అని మొనన్=యుద్ధముఖమున; త్రుంగిరి=మృతినొందిరి; అయ్య, కుమారా=ఓయి బాలకా!; ఇది=ఈపని; నీకు=నీకు; అనయంబును=ఎప్పటికిని; వలవదు=కూడదు; ఉడుగుము=మానుము;

తా. కుమారకా! ఒక్కనికొఱకు అనేకులను మృతినొందించుట మనువంశమునఁబుట్టిన నీకుతగదు. కావున యుద్ధము మానుము.

వ. అదియునుంగాక దేహాభిమానంబునం బశుప్రాయులై భూ
తహింసఁ గావించుట హృషీకేశానువర్తు లయినసాధువుల
కుండఁగదు నీవు సర్వభూతంబుల నాత్మభావంబునఁ దలఁ
చి సర్వభూతావాసుండును దురారాధ్యుండును నైనవి
ష్ణునిపదంబులఁ బూజించి తత్పరమపదంబునం బొందితి
వట్టిభగవంతుని హృదయంబున ననుధ్యాతుండవు భాగ
వతులచిత్తంబులకును సమ్మతుండవు మఱియు సాధువర్త
నుండవ వైన నొవ్వునీ వీపాపకర్మం బెట్లు సేయ సమకట్టి
తి వేపురుషుం డైన నేమి మహాత్ములయందుఁ దితిక్షయు

సములయందు మైత్రియు హీనులయందుఁ గృపయు నిత రంబు లగునసుప్తజంతువులయందు సమత్వంబును గలిగి వర్తించువానియందు సర్వాత్మకుం డైనభగవంతుండు ప్రసన్నుం డగు నతండు ప్రసన్నుం డయిన వాఁడు ప్రకృతిగుణంబులం బాసి లింగశరీరభంగంబు గావించి బ్రహ్మానందంబునం బొందు నదియునుంగాక కార్యకారణసంఘాతరూపం బయినవిశ్వం బయస్కాంతసన్నిధానంబు గలిగినలోహంబుచందంబున నీసర్వేశ్వరుండు నిమిత్తమాత్రంబుగాఁ బరిభ్రమించు నట్టియీశ్వరుని మాయాగుణవ్యతికరంబున నారబ్ధంబు లయినపంచభూతంబులచేత యోషిత్పురుషవ్యవాయంబువలన యోషిత్పురుషాదిరూపసంభూతి యగు నివ్విధంబునఁ దత్సర్గంబుఁదత్సంస్థానంబుఁ దల్లయంబు నగుచునుండునిట్లు దుర్విభావ్యంబైనకాలశక్తిం జేసి గుణక్షోభంబున విభజ్యమానవీర్యుండు ననంతుండు ననాదియు నై జనంబులచేత జనంబులం బుట్టించుచుండుటం జేసి జగదాదికరుండును మృత్యుహేతువు లగుజనంబుల లయంబునొందించుటం జేసి యంతకరుండును ననాదియగుటం జేసి యవ్యయుండును నైన భగవంతుండు జగత్కారణుం డగుం గావున నీసృష్టిపాలనవిలయంబులం గర్త గాని వాఁడునుంబలెఁ జేయుచుండు నిట్లు మృత్యురూపుండును బరుండును సమవర్తియు

నైనయీశ్వరునికి స్వపక్షపరపక్షంబులు లేవతనికిఁ గర్మా
ధీనంబు లయినభూతసంఘంబులు మహావాయువు ననుస
రించురజంబులచాడ్పున నస్వతంత్రంబులగుచు ననువర్తిల
చునతండును జంతుచయాయురుపచయాపచయకారణంబు
లం దస్పృష్టుండును నగుజీవుండు కర్మబద్ధుండగుటంజేసి
కర్మంబ వానికి నాయురుపచయాపచయంబులం జేయుచుం
డు మఱియు సర్వజగత్కర్మసాక్షి యగుసర్వేశ్వరుని.

అర్థ. ఆదియునుంగాక=అంతేకాక; దేహాభిమానంబునన్=శరీరముమీఁది యభిమానముచే; పశుప్రాయులై=పశువులవంటివారై; భూతహింస, కావించుట=ప్రాణులను హింసచేయుట; హృషీకేశ, అనువర్తులు, అయిన, సాధువులకున్, తగదు=విష్ణుభక్తులయిన సజ్జనులకు కూడదు; నీవు; సర్వభూతంబులన్=సమస్తప్రాణులను, ఆత్మభావంబునన్, తలఁచి=నీవలెనేయని ఆలోచించి; సర్వభూత, ఆవాసుండును=సర్వప్రాణులయందు నుండువాడును; దురారాధ్యుఁడున, అయిన=ఆరాధింపశక్యముకాని వాఁడునగు; విష్ణునిపదంబులన్=విష్ణుమూర్తియొక్క పాదములను పూజించి; తత్, పరమపదంబునన్, పొందితివి=అతనిశ్రేష్ఠస్థానమును పొందితివి; అట్టి=అటువంటి; భగవంతుని=విష్ణువుయొక్క; హృదయంబునన్=హృదయమునందు; అనుధ్యాతుండవు=ధ్యానింపఁబడుచుందువు; భాగవతుల చిత్తంబులకును, సమ్మతుండవు=విష్ణుభక్తులమనసులకు ప్రియుఁడవు; మఱియు=ఇంకను; సాధువర్తనుండవు, అనన్=సాధుచరిత్రముగలవాఁడ వని; ఒప్పు=ఒప్పునట్టి; నీవు; ఈ, ప్రకారంబు, ఎట్లు, చేయన్, సమకట్టితివి=ఈప్రకార్యము ఎట్లు చేయనారంభించితివి; ఏపురుషుండు, అయినన్, ఏమి=ఏపురుషుఁడైనను; మహాత్ములయందున్, తితిక్షగున్=మహాత్ములయెడల

ఒప్పిన; సములయందు మైత్రియుఁ=సమానులయెడల స్నేహమును; హీనులయందు, కృపయున్=తనకంటె తక్కువవారియందు దయయు; ఇతరంబులగు, సమస్తజంతువులయందుఁ, సమత్వంబును=తక్కినసర్వప్రాణులయందును సమబుద్ధియు; కలిగి; వర్తించువానియందుఁ=ప్రవర్తించువానికి; సర్వాత్మకుండు, అయిన=సమస్తమునకును ఆత్మయైనట్టి; భగవంతుండు=శ్రీమహావిష్ణువు, ప్రసన్నుండు, అగుఁ=దయగలవాడగును; అతండు=ఆవిష్ణువు, ప్రసన్నుండు, అయినవాఁడు=దయచూచినవాఁడు; ప్రకృతిగుణంబులన్, పాసి=సత్త్వరజస్తమోగుణములను విడిచి; లింగశరీరభంగంబు, కావించి=స్థూలశరీరమును విడిచిపెట్టి; బ్రహ్మానందంబునన్, పొందుఁ=బ్రహ్మానందమును పొందును; అదియునుఁ, కాక=అంతేకాక; కార్యకారణ, సంఘాత, రూపంబు. అయిన=కార్యము, కారణమునను వానికూడికచేఁ గలిగిన; విశ్వంబు=ప్రపంచము; అయస్కాంత, సన్నిధానంబు, కలిగిన, లోహంబు చందంబునఁ=సూదంటురాయి దగ్గరగానున్న యినుమువోలె ఏపరమేశ్వరుండు=ఏవిష్ణుమూర్తి; నిమిత్తమాత్రంబుగాఁ=తాత్కాలికకారణమై; పరిభ్రమించున్=తిరుగుచుండునో; అట్టి=అటువంటి; ఈశ్వరుని=విష్ణుమూర్తియొక్క; మాయాగుణ, వ్యతికరంబునఁ=మాయవలనగలుగు గుణముల కలయికచేత; ఆరబ్ధంబులు అయిన=సృష్టిపొందిన; పంచభూతంబులచేతన్; యోషిత్, పురుష, వ్యవాయంబువలనన్=స్త్రీపురుషులకూడిక వలన; యోషిత్, పురుష, ఆది, రూపసంభూతి, అగున్=స్త్రీపురుషుల రూపంబులు పుట్టుచుండును; ఇవ్విధంబునఁ=ఈరీతిగా; తత్ సర్గంబు=ఆసృష్టియు; తత్ సంస్థానంబు=ఆస్థితియు; తత్, లయంబును=ఆనాశమును; అగుచుఁ, ఉండుఁ=కలుగుచుండును; ఇట్లు ఈ విధముగా, దుర్విభావ్యంబయిన=ఊహింపశక్యముగాని; కాలశక్తిన్, చేసి=కాలముయొక్క శక్తిచేత, గుణ, క్షోభంబునన్=గుణములు తారుమారగుచుండుటచేత; విభజ్యమాన, వీర్యంబును=భాగింపఁబడినవీర్య

ముగలవాఁడును; అనంతుండును=అంతములేనివాఁడును; అనాదియును=మొదలులేనివాఁడును; అయి, జనంబులచేతన్=జనులచేత; జనంబులన్=జనులను; పుట్టించుచుండుటన్, చేసి=పుట్టించుచుండుటవలన; జగదాది, కరుండును=ప్రకృతికి మూలమయినవాఁడును; మృత్యుహేతువులు, అగు, జనంబులన్=మృత్యువులకు కారణములగు జనులను; లయంబునొందించుటం జేసి=నాశనముచేయుటచేత; అంతకరుండును=లయకారకుఁడును; అనాది, అగుటం జేసి=పుట్టుకలేకపోవుటచేత; అవ్యయుండును=నాశనములేనివాఁడును; అయిన; భగవంతుండు=అయిన శ్రీమహావిష్ణువు; జగత్, కారణుండు, అగుచున్=జగములకు కారణమగుచు; కావునన్=కాబట్టి; ఈ, సృష్టి, పాలన, విలయంబులన్=ఈసృష్టి, స్థితి సంహారములందు; కర్త కానివాఁడునుం బలెన్=తాను కర్త కానట్లు; చేయుచుండున్=ప్రవర్తించుచుండును; ఇట్లు=ఈవిధముగా; మృత్యురూపుండును=మృత్యురూపముగలవాఁడును; పరుండును=శ్రేష్ఠుఁడును; సమవర్తియు=సర్వభూతములయెడల నొక్కరీతిగా బ్రవర్తించువాఁడును; అయిన; ఈశ్వరునికిన్=అయిన మహావిష్ణువునకు; స్వపక్ష, పరపక్షంబులు, లేవు=తనవారు పరులనుమాట లేదు; అతనికిన్=అతనికి; కర్మాధీనంబులు, అయిన=కర్మమునకు కట్టుబడియున్న; భూతసంఘంబులు=ప్రాణికోట్లు, మహావాయువున్, అనుసరించు, రజంబుల చాడ్పునన్=గాలితోఁగూడ పోవుదుమ్ములు ధూళివలె, అస్వతంత్రంబులు, అగుచున్=స్వాతంత్ర్యము లేక; అనువర్తించున్=వెంట నంటియుండును; అతండును=ఆమహావిష్ణువును; జంతుచయ=జంతుసమూహములయొక్క; ఆయుస్=జీవితము; ఉపచయ, అపచయ, కరణంబులందు=ఇచ్చుట, ఈయకపోవుట అనువానియందు; అస్పృష్టుండును, అగు=సంబంధములేక; జీవుండు=జీవాత్మ; కర్మబద్ధుండు అగుటంజేసి=కర్మముచేత కట్టుబడినవాఁడగుటవలన; కర్మ=కర్మమే; వానికి=ఆజీవాత్మకు; ఆయుస్, ఉపచయ, అపచయంబులన్=ఆయువునిచ్చుటను

ఈయకుండుటయు ; చేయుచుండును=కలుగజేయుచుండును ; మఱియున్=ఇంకను; సర్వ, జగత్, కర్మ, సాక్షి, అగు=సమస్తజగముల యొక్క పనులను చూచుచున్న వాఁడగు ; సర్వేశ్వరుని=శ్రీమహావిష్ణువును.

తా. స్పష్టము.

క. కొందఱు కర్మం బందురు
కొందఱు స్వాభావ్య మందురు ♦ కొందఱు కాలం
బందురు కొందఱు దైవం
బందురు కొంద ఱొగిఁ గాము ♦ మందురు మహాత్మా. 142

అర్థ. కొందఱు=కొందఱు ; కర్మంబందురు=కర్మమని చెప్పుదురు; కొందఱు=మఱికొందఱు; స్వాభావ్యమందురు=స్వభావశక్తియే అని పలుకుదురు, కొందఱు=ఇంకనుకొందఱు; కాలబందురు=దానినే కాలమని చెప్పుదురు; కొందఱు=మరికొందఱు ; దైవందైవంబందురు=దానినే దైవమని చెప్పుదురు; కొందఱు, ఒగిన్=మఱికొందఱింకను; మహాత్మా=ధ్రువ[illegible]=కా[illegible]ము చెప్పుదురు.

తా. ఈశ్వరుని ((కర్మము, స్వభావశక్తి, కాలము, దైవము, కామము,, ననియనేక అనేకవిధములుగా తలంచుచుందురు.

వ. ఇట్లు లవ్యక్తరూపుండును నప్రమేయుండును నానాశక్త్యుదయహేతుభూతుండును నైన భగవంతుఁడు సేయుకార్యంబులు బ్రహ్మరుద్రాదు లెఱుంగ రఁట యతనితత్త్వంబు నెవ్వ రెఱుంగ నోపుదు రాభగవంతుండు సృష్టిస్థితిలయంబులు సేయుచుండియు ననహంకారుం డగుట గుణకర్మంబులం బొరయఁడు సర్వభూతాత్ముఁడును సర్వభూ

త నియంతయు సర్వభూతభావనుండు నైనభగవంతుండు
తనమాయతోఁడ గూడి భూతసృష్టిస్థితిసంహారంబులు సే
యుచుండుఁ గావునఁ బుత్రా యిట్లుత్పత్తిస్థితిలయంబుల
కు దైవంబు కారణంబై యుండ నీధనదానుచరులు భవదీ
యభ్రాతృహంత లగుదురే యదియునుం గాక యీప్ర
జాపతులు విశ్వసృణ్నామంబుల నియంత్రితులై ముకుఁ
దాళ్లు వెట్టినపశువులుంబోలె నెవ్వనియాజ్ఞాధీనకృత్యు
లై వర్తింతు రట్టి దుష్టజనమృత్యువును సుజనామృత
స్వరూపుండును సర్వాత్మకుండును జగత్పరాయణుండును
నైనయీశ్వరుని సర్వప్రకారంబుల శరణంబుఁ బొందు
మదియునుంగాక. 143

అర్థ. ఇట్టులు=ఈరీతిగా; అవ్యక్తరూపుఁడును=వ్యక్తముకాని రూపముకలవాఁడును, అపరిమేయుండును=పరిమితి దెలిసికొన నశక్యుండును; నానా, శక్తి, ఉదయ, హేతుభూతుండును=వివిధములగు శక్తులుకలవాఁడును; అయిన; భగవంతుండు=శ్రీమహావిష్ణువు, చేయు=చేయునట్టి; కార్యంబులు=పనులు; బ్రహ్మాదదులు=బ్రహ్మ, రుద్రుఁడు మొదలగువారు; ఎఱుఁగరఁట=తెలిసికొనజాలరఁట; అతని తత్త్వంబున్=అతని సత్యస్వరూపమును; ఎవరు, ఎఱుంగన్, ఓపుదురు=ఎవరు తెలిసికొనఁగలరు, ఆ,భగవంతుండు=ఆయీశ్వరుఁడు; సృష్టి, స్థితి, సంహారములను; చేయుచుండిమున్=చేయుచున్నను; అసహంకారుండు అగుటన్=అహంకారము లేనివాఁడగుటచేత; గుణ, కర్మంబులన్=పొరయఁడు=గుణములను, కర్మములను, అంటియుండఁడు; సర్వభూతాత్ముండును=సర్వప్రాణులయందును ఆత్మయై యుండువాఁడును; సర్వ

భూత, నియంత్రము=సర్వభూతములకును నియామకుఁడును, సర్వభూత భావనుండును=సమస్తప్రాణులచేతను ధ్యానింపఁబడువాఁడును; అయిన భగవంతుండు=ఆయిన ఈశ్వరుఁడు, తనమాయతోడన్, కూడి=తన మాయతోఁగూడ; భూత, సృష్టి, స్థితి, సంహారంబులు=ప్రాణములను పుట్టించుట, పాలించుట, చంపుట, అను కార్యములను; చేయుచుండున్=చేయుచుండును; కావునన్=గనుక; పుత్రా=కుమారుఁడా; ఇట్లు=ఈప్రకారముగా; ఉత్పత్తి; స్థితి, లయంబులకున్=సృష్టి, స్థితి, సంహారములకు; దైవంబు, కారణంబు, అయి, ఉండఁగన్=దైవమే కారణమయియుండఁగా; ఈ, ధనద, అనుచరులు=ఈకుబేరుని సేవకులైన యక్షులు; భవదీయ, భ్రాతృహంతలు, అగుదురే=నీసోదరుని చంపినవారలగుదురా? అదియునుంగాక, ఈప్రజాపతులు=ఈబ్రహ్మలు, విశ్వసృట్, నామంబులన్=విశ్వమును సృజించువారను పేర; నియంత్రితులు; అయి=నియమింపఁబడినవారయి; ముకుత్రాళ్లు, పెట్టిన, పశువులున్, పోలెన్=ముక్కునకు త్రాళ్లుకట్టిన పశువులవలె; ఎవ్వని, ఆజ్ఞా, అధీన, కృత్యులు, అయి=ఎవని ఆజ్ఞకు లోఁబడి పనులచేయుచు; వర్తితురు=సంచరింతురో?; అట్టి=అటువంటి; దుష్టజన, మృత్యువును=దుష్టులకు మృత్యువువంటివాఁడును; సుజన, అమృతస్వరూపుండును=సజ్జనులకు అమృతమువంటివాఁడును, సర్వ, ఆత్మకుండును=సమస్తప్రాణులకును ఆత్మవంటివాఁడును; జగత్, పరాయణుండును=లోకములకు ఆశ్రయమయినవాఁడును; అయిన, ఈశ్వరునిన్=ఆయిన విష్ణుమూర్తిని; సర్వప్రకారంబులన్=అన్నివిధములచేతను; శరణంబు, పొందుము=శరణుచొరుము; అదియునుంగాక=ఇంతేకాక;

తా. స్పష్టము.

సీ. అనఘాత్మ నీవు సం ♦ చాడ్బవయునుక్కొండ
నై పినతల్లి ని ♦ న్నాడినట్టి

మాటల నిర్భిన్న ♦ మర్ముండ వగుచును
జనయిత్రి దిగనాడి ♦ వనము కేఁగి
తపమునఁ జేసి య ♦ చ్ఛపుభక్తి నీశ్వరుఁ
బూజించి మహితవి ♦ భూతి మెఱసి
రమణఁ ద్రిలోకోత్త ♦ రం బైనపదమును
బొందితి వది గాన ♦ భూరిభేద

తే. రూప మైనప్రపంచంబు ♦ రూఢి నేమ
హాత్మునందుఁ బ్రతీత మై ♦ యలరు నట్టి
యగుణుఁ డద్వితీయుండును ♦ నక్షరుండు
నైన యీశ్వరుఁ బరమాత్ము ♦ ననుదినంబు. 144

అర్థ. అనఘాత్మ=పాపరహితుఁడా; నీవు, పంచాబ్దవయస్కుండవయి=అయిదేండ్ల బాలుఁడవయి; పినతల్లి=నీపినతల్లియైన సురుచి; నిన్ను, ఆడినట్టి=నిన్ను పలికినట్టి; మాటలన్=మాటలచేత; నిర్భిన్న, మర్ముండవగుచును=మనస్సునొచ్చినవాఁడవై; జనయిత్రిన్, దిగనాడి=తల్లినివిడిచిపెట్టి, వనము కేగి=వనమునకుపోయి; తపమునన్, చేసి=తపస్సువలన; అచ్ఛపుభక్తిన్=స్వచ్ఛమైనభక్తితో; ఈశ్వరున్, పూజించి=ఈశ్వరునిపూజచేసి; మహితవిభూతిన్, మెఱసి=మిక్కిలి వైభవముతో ప్రకాశించి; రమణన్=ప్రీతితో, త్రిలోకోత్తరంబైన=మూఁడులోకములకంటె నున్నతమైన; పదమును=స్థానమును; పొందితివి=సంపాదించితివి; అది, కానన్=అందుచేత; భూరి, భేద, రూపమైన=అనేకభేదములచే రూపములు పొందిన; ప్రపంచంబు=విశ్వము; రూఢిన్=స్థిరముగా; ఏమహాత్మునందున్=ఏమహానుభావునియందు; ప్రతీతమై, అలరున్=ప్రఖ్యాతిని పొందియుండునో; అట్టి=అటువంటి; అగుణుఁ

డు=గుణములులేనివాఁడును; అద్వితీయుండును=తనకంటె నితరుఁడు లేనివాఁడును, అక్షరుఁడున్=నాశనములేనివాఁడును; అయిన ఈశ్వరున్=అయిన విష్ణుమూర్తిని; పరమాత్మున్=పురుషోత్తముని; అనుదినంబున్=దినదినమును.

తా. ఓయి ధ్రువుఁడా! నీవైదేండ్ల ప్రాయముననే సవతితల్లి యాడిన మాటలకు సహింపక, యడవికిపోయి, తపస్సుచేసి, ఈశ్వరుని పూజించి, అతనిదయవలన ముల్లోకములకంటె నున్నతమైన స్థానమును పొందితివి కావున నీవాపరమాత్ముని ప్రతిదినమును (ముందుపద్యముతో నన్వయము.)

సీ. కైకొని శుద్ధంబు ♦ గితమత్సరంబును
  నమలంబు నగుహృద ♦ యంబునందు
పొలవ కన్వేషించు ♦ చును బ్రత్యగాత్ముండు
  భగవంతుఁడును బర ♦ బ్రహ్మమయుఁడు
నానందమాత్రుండు ♦ నవ్యయుఁడుపపన్న
  సకలవీర్యుండును ♦ సగుణుఁ డజుఁడు
నయినసర్వేశ్వరు ♦ నం దుత్తమం బైన
  సద్భక్తిఁ జేయుచు ♦ సమత నొప్పి
తే. రూఢి సోహమ్మ మేతి ప్ర ♦ రూఢ మగుచు
ఘనత కెక్కినవిద్య యన్ ♦ గ్రంథి నీవు
ద్రెంచి వైచితి కావున ♦ ధీవరేణ్య
సర్వశుభహాని యైన రో ♦ షంబు వలదు. 145

అర్థ కైకొని=పూని; శుద్ధంబున్=పరిశుద్ధమును; గతమత్సరంబున్=మత్సరముపోయినవాఁడును; అమలంబున్=నిర్మలమయినది

మును; అగు=అయిన; హృదయాంబుజంబునన్=మనస్సునందు; సొలవక=అలయక; అన్వేషించుచున=వెదకుచును; ప్రత్యగాత్ముండన్=జీవాత్మస్వరూపుఁడును; భగవంతుఁడును=మంగళస్వరూపముగలవాఁడును; పరమాత్మమనుఁడున్=పరమాత్మస్వరూపియును; ఆనందమాత్రుఁడున్=నాశనములేనివాఁడును; ఉపపన్నసకలవీర్యుండును=సంభవమొందిన వీర్యములన్నిటిని గలవాఁడును; సగుణుఁడు, ఐ=మంచి గుణములచేత; నిరాసనాశుఁడు=తిరుగనివాఁడును; అజుఁడు=జన్మము లేనివాఁడును; అయినసర్వేశ్వరునందున్=అయినటువంటి శ్రీవిష్ణుమూర్తియందు; సద్భక్తిన్, ఒప్పుచున్=మంచిదైనయటువంటిభక్తినిగలిగి వెలయువాఁడును; సమతన్=సమత్వముతో, ఒప్పి=ఒప్పుచు; రూఢిన్, సోహం, మను, ఇతి=అని, నిజముగా, నాగాయుటచే; ప్రరూఢముగుచున్=నిరూఢినిజెందినదై; ఘనశోకన్=గొప్పతనమునుపొందు; అవిద్యయున్, గ్రంథిన్=మాయయనెడిముడిని; త్రెంచితివైతివి, కావునన్=కోసివేసితివి గాన; ధీరరేణ్య=బుద్ధిశాలురలో శ్రేష్ఠమయి వాఁడా; సర్వశుభహానియైన=మంగళములన్నిటిని పోఁగొట్టునదియైన, రోషంబు=కోపంబు; వలదు=వలదు.

తా. పవిత్రమును ద్వేషములేనిదియునగు హృదయమునందు వెతకుచు, జీవాత్మస్వరూపుఁడై పరబ్రహ్మమయియొప్పు సర్వేశ్వరుని అతఁడే నేనను జ్ఞానముకలిగి అవిద్యను తరించి యున్నావు కావున నోధ్రువుఁడా, సర్వశుభములకును హానికలిగించు కోపమును మానవలయును.

క. విను రోషహృదయుచేతను
ననయము లోకము నశించు ♦ నౌషధములచే
ఘనరోగములు నశించిన
యనువున నది గాన రోష ♦ ముడుఁపు మహాత్మా. 146

అర్థ. ఔషధములచేన్ = మందులచేత; రోగములు నశించునట్టువునన్ = రోగములుపోవునట్లు; వినుము = వినుము; రోషహృదయచేతన్ = కోపముగలవానిచేత: అనయమున్ = ఎప్పటికిని; లోకము నశించున్ = లోకముచెడును.

తా. ఔషధముచేత రోగములునశించునట్లు, రోషముచేత లోకములు నశించును.

తే. అనఘ నీయనుజసహోదర ♦ హంతలనుచుఁ
పెనఁచి యీపుణ్యజనులఁ జం ♦ పితి కడంగి
పరఁగ నిదియె సదాశివ ♦ భ్రాతయైన
యర్థవిభునకు నపరాధ ♦ మయ్యెఁ గాన 147

అర్థ. అనఘ = పాపరహితుఁడా! నీయనుజసహోదరహంతలనుచున్ = నీతోఁబుట్టువయిన [illegible] చంపినవారని; పెనఁచి = పెనఁగునట్లు చేసి; ఈపుణ్యజనులన్ = ఈరాక్షసులను; కడంగి = పూని; చంపితి = వధియించితివి; పరఁగన్ = ఒప్పునట్లు; ఇదియె = ఇట్టిదియె; సదాశివభ్రాతయైన = ఈశ్వరునకు సోదరుఁడైన; అర్థవిభునకున్ = కుబేరునకు; అపరాధమయ్యె = తప్పాయెను; కానన్ = అందుచే. (ముందుపద్యముతోనన్వయము).

తా. ఈయక్షులు నీసోదరుని చంపిరని వారిని నీవు చంపితివి, వీరు శివుని సోదరుఁడైన కుబేరుని భటులు, అందుచేత నీవు కుబేరునికి అపరాధము చేసితివి, కాఁబట్టి,

క. నతినుతులచేత నీవిపు
డతనిఁ బ్రసన్నునిఁగఁ జేయు ♦ మని మనువు దయా
మతిఁ జెప్పి ధ్రువునిచే స
త్కృతుఁడై నయ మొప్పఁ జనియె ♦ ఋషియుక్తుండై.

అర్థ. నతి=నమస్కారములచేతను; నతులనేన్=స్తోత్రములచేతను; ఈవిభుఁడు; అతనినిన్=ఆమచేరుని: ప్రసన్నునింగాఁజేయుము=దయబూనిలవానినిగా ఒనర్పుము; అని, మనువు=అని, స్వాయంభువుఁడు; దయామతిన్, చెప్పి; ధ్రువునిచేసత్కృతుండై=ధ్రువునిచే సత్కరింపబడినవాడై, నయము ప్పన్=నెమ్మని ఒప్పునట్లుగా; ఋషియుక్తుండై=ఋషిగణములతోఁ గూడినవాఁడై; చనియెన్=పోయెను.

తా. నీవాతని ప్రతిమాలుకొని, నీనుప్రసన్నుఁడగునట్లు చేసికొనుము. అని మనువుచెప్పి, ధ్రువునిచేత సత్కరింపబడి, ఋషులతో కలసి వెడలిపోయెను.

వ. అంత. 149

అర్థ. అంతన్=ఆటుపిమ్మట

తే. యక్షచారణసిద్ధవి ♦ ద్యాధరాది
జనగణస్తూయమానుఁడై ♦ ధనదుఁ డంతఁ
బుణ్యజనవైశసనివృత్తుని ♦ భూరిరోష
రహితుఁడైనట్టిధ్రువునిఁ జే ♦ రంగ వచ్చె. 150

అర్థ. అంతన్=అప్పుడు; ధనదుఁడు=కుబేరుఁడు యక్ష, చారణ. సిద్ధ, విద్యాధర=యక్షులు, చారణ, సిద్ధ, విద్యాధర, ఆది=మొదలగు; జన=పరివారములవారిచేత; స్తూయమానుఁడై=పొగడఁబడువాడై పుణ్యజన=రక్షసులను; వైశస=చంపుటను; నివృత్తినిన్=వదలినవానిని; భూరి=అధికమైన; రోష=కోపమునుండి; రహితుండు=తొలఁగినవానిని; ఐనట్టిధ్రువునిన్=అయినటువంటి ధ్రువుని,చేరంగవచ్చెన్=సమీపించెను.

తా. యక్షులు, చారణులు, సిద్ధులు, విద్యాధరులు, మొదలగువారు తన్నుపొగడచుండ. కుబేరుఁడు రాక్షసులపై కోపము నుపసంహరించుకొని యున్న ధ్రువునివద్దకు వచ్చెను.

సీ. చనుదెంచి వెసఁ గృతాం ♦ జలి యైనధ్రువుఁ జూచి
తివుట నిట్లనియె ష ♦ త్త్రియకుమార
తగ భవదీయపి ♦ తామహాదేశంబు
నను దుస్త్యజం బైన ♦ ఘనవిరోధ
ముడిగితి వటు గాన ♦ యొనరంగ నిపుడు నీ
యందుఁ బ్రసన్నుండ ♦ నైతి భూత
జననలయంబుల ♦ కనయంబుఁ గాలంబె
కర్తయై వర్తించుఁ ♦ గాన యుష్మ
తే. దనుజుఁ జంపినవారలీ ♦ యక్షవరులు
గారు తలపోయ వీయక్ష ♦ గణము నిట్లు
నెఱి వధించినవాఁడవు ♦ నీవు గావు
వినుతగుణశీల మాటలు ♦ వేయు నేల. 151

అర్థ. చనుదెంచి=వచ్చి; కృతాంజలి, యైన=నమస్కరించినట్టి; ధ్రువున్, చూచి=ధ్రువునికనుగొని; తివుటన్=కోర్కతో; ఇట్లనియెన్=ఈప్రకారముఅనియెను; క్షత్రియ కుమార=ఉత్తానపాదునికుమారుండయినధ్రువుడా! తగన్=ఒప్పునట్లు; భవదీయ, పితామహ=నీయొక్కతాతయొక్క; ఆదేశంబునన్=అనతిచేత; దుస్త్యజంబైన=త్యజించుటకు శక్యముకాని; ఘనవిరోధమున్=అధికమైన వైరమును; ఉడిగితివి=వదలితివి; అట్లుగానన్=ఆకారణమునుబట్టి; ఒనరంగన్=ఒప్పునట్లు; ఇప్పుడు, నీయందు బ్రసన్నుఁడనైతిన్=ఈసమయమందునీయందు దయగలవాఁడనైతిని; భూత=భూతకోటులయొక్క; జనన, లయంబులకున్=పుట్టువులకునుచావులకును; కనయంబున్=ఎల్లప్పుడును

కాలంబె=కాలమే; కర్తయై, వర్తించుచున్=కారణంబై యొసగుచుండును; కావున్=కాఁబట్టి, యుష్మత్ అనుజున్=నీతమ్ముని; చంపినవారలు=వధించినవారలు; ఈ యక్షవరులు గారు=ఈ యక్షులు గారు; తలపోయన్=ఆలోచింపగా; ఇట్లు=ఈవిధముగా; ఈయక్షగణముల్=ఈరాక్షసుల మూకను; నెట్టన=మెండుగా; వధించినవాఁడవు; నీవు గావు=నీవు కానేరవు; వినుత=పొగడఁదగిన; గుణశీల=సుగుణములను శీలమునుఁగలవాడా! మాటలు వేయునేల=ఏలపలుమాఱు మాటలు?

తా. ఇట్లువచ్చి తనకు దోసిలొగ్గియున్న ధ్రువునిచూచి ఓయి క్షత్రియబాలకుడా! నీతాత యుపదేశమున కోపము చాలించియున్నావు. నీయెడల నేను ప్రసన్నుండనయితిని, సృష్టిస్థితిలయములకు కాలమే కారణముగాని మఱియొండు గాదు. ఈయక్షులను నీవు చంపలేదు. ఈయక్షులు నీసోదరుని చంపలేదు.

వ. అదియునుం గాక యేబుద్ధిం జేసి కర్తృసంబంధదుఃఖాదికంబులు దేహాత్మానుసంధానంబునం జేసి సంభవించు నట్టి యహంత్వమ్మనునపార్థజ్ఞానంబు స్వప్నంబునుం బోలెం బురుషునకుం దోఁచు నది గావున సర్వభూతాత్మవిగ్రహుండును నఖిలేశుండును భవచ్ఛేదకుండును భజనీయపాదారవిందుండును ననంతామేయశక్తియుక్తుండును గుణమయాత్మమాయావిరహితుండును నైనయీశ్వరుని సేవింపుము నీకు భద్రంబయ్యెడు భవదీయమనోగతం బైన వరంబుఁ గోరుము నీవంబుజనాభపాదారవిందసేవనంబుఁ దిరంబుగఁ జేయుదువని యెఱుంగుదు ననిన రాజరాజుచేత నిట్లు మహామతియు భాగవతోత్తముండు నైన

ధ్రువుండు ప్రేరేపింపంబడియె హరిస్మరణంబుచేత సప్త
యత్నంబున నుపత్యయుం బైన యజ్ఞానంబుఁ దరియింతు
వట్టిహరిస్మరణం బపలితం బగునట్లొసంగు మని యడిగిన
నట్లు కాకే యనుమంగీకరించి యంతం గుబేరుండు సంప్రీ
తచిత్తుం డయి ధ్రువునకు శ్రీహరిస్మరణం బట్లుపదేశించి
యంతర్ధానంబు నొందె నంత ధ్రువుండు యుపకీస్నరకిం
పురుషుఁగానింప్తాయునూరవైభవుం డగుచు నాత్మయపు
రంబునకు మరలి చనుదెంచె నంత. 152

అర్థ. అదియునుగాక; ఏబుద్ధింజేసి=ఏబుద్ధిచేత; కర్మ సంబం
ధ=ప్రారబ్ధకర్మకు సంబంధించిన; దుఃఖాంకంబులు=దుఃఖము మొదల
గునవి; దేహ, ఆత్మను, సంధానంబునన్; చేసి=శరీరమునకును, మనస్సు
నకును జేరికగలవియగుటచేత; సంచరించున్=కలుగుచుండునో; అట్టి;
అహం=నేను; త్వమ్=నీవు; అనన్యజ్ఞానము=ఆ...డి విపరీతఅర్థ
ముతోఁ దెలిసి; స్వప్నమందుంబోలెన్=స్వప్నావస్థయందువలెనే; పురు
షునకున్ తోఁచున్=మనుష్యునకు తోఁచును; అదిగావునన్=ఆకారణ
ముచేత; సద్భూత=అన్నిభూతములకోటులనే; ఆత్మవిగ్రహుండును=
శ్రీవిష్ణుమూర్తియును భవ, ఛేదనుండును=జన్మముల నశింపచేయువాఁ
డును; భజనీయ, పాదారవిందుండును=భజింపదగిన పాదకమలములు
గలవాఁడును; అనంత=అంతములేనిదియు; అమేయ=మేరలేనిది ను
నైన; శక్తి=శక్తిచేత; యుక్తుండును=కూడినవాఁడును; గుణమయ=
గుణములయొక్క పరిణామము బెంచిన; ఆత్మమాయా=తనమాయ
నుండి; పరిహీతుండును=తొలఁగినవాఁడును; ఐన, ఈశ్వరునిన్, సేవిం
పుము=ఐనట్టి శ్రీవిష్ణుమూర్తిని కొలువుము; నీకు, భద్రంబు, అయ్యెడు=

నీకు మేలొనరఁగూడెడును; ఘనకీ! యుష్మనోగతంబైన = నీ మనస్సునందుఁగల; వరంబున్ కోరుము = కోర్కెను కోరుకొనుము; నీవు; అంబుజనాభ = విష్ణుమూర్తియొక్క, పాద, అరవింద, సేవనంబున్ = పాదకమలములపూజను; తిరంబుగన్, చేయుదునని, ఎలుంగున్ = స్థిరముగాఁ జేయఁగలనని యెలుఁగునను; అనిన, రాజరాజు వేఁడన్ = అనియట్టు కుబేరునిచేత; అట్లు = ఆవిధముగా; వరంబువేఁడుమన్; మహాబుద్ధిన్ = గొప్పబుద్ధిగలవాఁడును; భాగవత, ఉత్తముండును = భక్తశ్రేష్ఠుఁడును; ఐనధ్రువుఁడు; ప్రేరేపింపఁబడి; ఏహరి స్మరణంబు చేతన్ = ఎట్టి విష్ణుమూర్తియొక్క ధ్యానము చేత; అప్రయత్నంబునన్ = ప్రయత్నము లేకయే; దురత్యయంబు = చేటు లేనిది; ఐనయజ్ఞానంబున్ = అయినట్టి తెలివితేమిని; తరియింతురు = దాఁటుదురో; అట్టి, హరి స్మరణంబున్ = అటువంటి మహిమగల హరియందలి స్మృతిని; అచలితంబగునట్లు, ఒసఁగుము = స్థిరమైనట్లు ఇమ్ము; అని యడిగినన్ = అని వేఁడఁగా; అట్లకాకయని = అట్లేయగుఁగాకని; కుబేరుఁడు = కుబేరుండు; అంగీకరించి = ఒప్పుకొని; అంతన్ = అంతట; సంప్రీతచిత్తుండయి = ప్రీతితోఁ గూడినమనసుగలవాఁడయి; ధ్రువునికిన్, శ్రీహరి స్మరణంబున్ = శ్రీహరిధ్యానమును; అట్లుపదేశించి = అప్రకారము బోధించి; అంతర్ధానంబు నొందెన్ = మాయమాయెను; అంతన్ = అటుపిమ్మట; ధ్రువుండు, యక్ష, కిన్నర = కించిన్నరరూపముగల దేవతలు, కింపురుష; గణ = సమూహములేని; సంస్తూయమాన = పొగడఁబడు; వైభవుండు, అయి = విభవముగలవాఁడై; ఆత్మీయ, పురంబునకున్ = తననగరమునకు; మరలన్, చనుదెంచెను = మరలివచ్చెను అంతన్ = అంతట.

తా. స్పష్టము.

సీ. గణుతింప భూరిద ♦ క్షిణలచేఁ గడు నొప్ప
యజ్ఞముల్ సేయ న ♦ య్యజ్ఞవిభుఁడు

ద్రవ్యక్రియా దేవ ♦ తాఫలరూపస
త్కార్యఫలప్రదా ♦ తయును నైన
పురుషోత్తముని నర్థిఁ ♦ బూజించి మఱియు స
ర్వోపాధివర్జితుఁ ♦ డుత్తముండు
సర్వాత్మకుఁడు నగు ♦ జలజాక్షునందుఁ దీ
వ్రంబై ప్రవాహరూ ♦ పంబు నైన

తే. భక్తి నలుపుచు నకిల ♦ ప్రపంచమందు
నలరు దనయందు నున్నమ ♦ హాత్ము హరిని
జడచిదానందమయుని ల ♦ క్ష్మీవరుఁ బరము
నీశ్వరేశ్వరుఁ బొడగనె ♦ సిద్ధచరిత. 153

అర్థ. గణుతింపన్ = విచారింపఁగా; భూరిదక్షిణలచేన్ = అధికములయిన దక్షిణలచే; కరన్, ఒప్పన్ = మిగుల దేజరిల్లుచుండఁగా; యజ్ఞముల్, చేయన్ = యాగములొనరింపఁగా; అయ్యజ్ఞవిభుఁడు = ఆ యజ్ఞమునకు యజమానుఁడు; (ధ్రువుఁడు); ద్రవ్య = ధనము; క్రియ = పనులు; దేవతా = దైవమును; ఫల = ప్రయోజనమును; వీని; రూప = రూపముగల; సత్కార్య = సత్కార్యములయొక్క; ఫలప్రదాతయును = ప్రయోజనమొసంగువాఁడును; ఐన, పురుషోత్తమునిన్ = అయినట్టి శ్రీహరిని; అర్థిన్, పూజించి = మనసార సేవించి; మఱియును; సర్వోపాధివర్జితుఁడు = కాపట్యమునుండి తొలఁగినవాఁడు; ఉత్తముండు = ఘనుఁడు; సర్వాత్మకుఁడు = అన్నిటిని గలవాఁడు; అగు జలజాక్షునందున్ = అగునట్టి పుండరీకాక్షునియందు, తీవ్రంబై = చుఱుకుదనముగలదై; ప్రవాహరూపంబునన్ = ప్రవాహరూపముతో; అఖిలప్రపంచమందున్ = లోకమునందంతటను; తనరన్, తనయందు = ఒప్పునట్లుగా తనలోన;

ఉన్నమహాత్ముఁ = ఉన్నయటువంటి ఘను; హరిని = విష్ణుమూర్తిని; చిత్, అచిత్, ఆనందమయునిన్ = చిత్తు, అచిత్తు, ఆనందము అను మూఁడువిధ ములుగనుండువారిని; లక్ష్మీనాథున్ = శ్రీకాంతుని; పరమున్ = శ్రేష్ఠుని; ఈశ్వరేశ్వరునిఁ = ప్రభువులకుఁ బ్రభువును; ఇద్ధచరిత = శ్రేష్ఠమైన నడవడిక గలవాఁడా. పొడగనెన్ — దర్శించెను

తా. పన్నొయజ్ఞములను చేసి శ్రీహరిని నిశ్చలభక్తితో ధ్యానించి ఎట్టియుపాధియు లేనివాఁడును, సర్వాత్మకుఁడును, అవ్యయానందముగల వాఁడును, అగు ఈశ్వరుని కనుఁగొనెను.

వ. ఇట్లు సుశీలసంపన్నుండును బ్రహ్మణ్యుండును ధర్మసేతురక్షకుండును దీనవత్సలుండు నయి యవని పాలించు ధ్రువుండు తన్నుఁ బ్రజలు తండ్రి యని తలంప నిరువదియాఱు వేలేండ్లు భోగంబులచేతం బుణ్యక్షయంబును నభోగంబు లైనయాగాదులచేత నశుభక్షయంబునుం జేయుచు బహుకాలంబు దనుకఁ ద్రివర్గసాధనంబుగ రాజ్యంబు సేసి కొడుకునకుఁ బట్టంబు గట్టి యవిద్యారచిత స్వప్న గంధర్వనగరోపమం బయిన దేహాదికం బగు విశ్వంబు భగవన్మాయారచితం బని యాత్మం దలంచుచు వెండియు.

అర్థ. ఇట్లు = ఈవిధముగా; సుశీలసంపన్నుండును = మంచిసుశీలమునే సంపదగా గలిగినవాఁడును; ధర్మసేతురక్షకుండును = ధర్మమను ఆనకట్టును రక్షించువాఁడును; దీనవత్సలుండును = దీనులయెడ ప్రేమగలవాఁడును; అయి, అవనిఁ బాలించుధ్రువుండు = అయి భూపరిపాలనముచేయునట్టి ధ్రువుఁడు; తన్నున్ = తన్నును; ప్రజలు = జనముల; తండ్రియని,

తలంపఁగ = జనకునిగా భావింపఁగ; ఇరువదియాఱువేలయేండ్లు; భోగంబు లచేతన్ = సుఖానుభవములచేత; పుణ్యక్షయంబును = పుణ్యముయొక్క క్షీణతను; ఆభోగంబులయిన = శ్రీమంతములగు స్థానములయిన యాగాదులచేతన్ = యజ్ఞములు మొదలగు సత్కర్మాచరణములచేత; అశుభక్షయంబును = అశుభకర్మములను పోఁగొట్టుటయును; చేయుచున్ = చేయుచును; బహుకాలంబుదనుకన్ = చాలకాలంబువరకు; త్రివర్గసాధనంబుగా = ధర్మార్థకామములకై ప్రజాపరిపాలన మొనరించి; కొడుకునకుఁబట్టంబుగట్టి; అచలిత, ఇంద్రియుండై = చలింపని యింద్రియములుగలవాడై; అవిద్యారచిత = మాయచేఁగలిగిన; స్వప్న = స్వప్నమునం గల; గంధర్వనగరోపమంబు = (ఆకసమందు) గంధర్వనగరమువలె ఉపమింపఁదగినది; అయిన = అయినటువంటి; దేహాదికంబు = శరీరము, మొదలగువానినిగల; విశ్వంబు = ప్రపంచంబు; భగవన్మాయావిరచితంబు = ఈశ్వరునిమాయచేతఁ గలిగినది; అని; ఆత్మం దలఁచుచు = ఆత్మ మనస్సునందు తలఁచుచును; వెండియున్ = మఱియును (ముందుపద్యముతో నన్వయము)

తా. స్పష్టము.

చ. మనువిభుఁ డంత భృత్యజన ♦ మంత్రిపురోహితబంధుమిత్రసం
దనపశువిత్తరత్నవని ♦ తాగృహరమ్యవిహారశైలవా
రినిధిపరీతభూతలహ ♦ రిద్విపముఖ్యపదార్థజాలముల్
ఘనమతిచే ననిత్యములు ♦ గాఁ దలపోసి విరక్తచిత్తుఁడై.

అర్థ. మనువిభుఁడు = మనువులకు సముఁడయిన యాధ్రువుఁడు; అంతన్ = అంతట; భృత్యజన = సేవకులు; మంత్రి = ప్రధానులు; పురోహిత = పురోహితులు; బంధు = బాంధవులు; మిత్ర = స్నేహితులు; నందన = పుత్రులు; పశు = గోవులు; విత్త = ధనము; రత్న = రత్నములు; వనితా = స్త్రీలు; గృహ = ఇండ్లు; రమ్యవిహారశైల = రామణీయకములైన క్రీడాద్రులు (మొదలగువానినిగల) వారినిధిపరీతభూతల = సముద్రపర్యం

తమునుగలభూప్రదేశమున దలి; హరిత్=దిగ్గజములు; ముఖ్య=వీని నే ముఖ్యముగాగల; పదార్థజాలముల=వస్తుసముదాయముల; ఘనమతి చేన్=పరిపక్వమయిన బుద్ధిచేత; అసత్యము గాన్=మిథ్యాస్వరూపములుగా, తలపోసి=తలంచి; విరక్తచిత్తుఁడై=అనురక్తిలేని మనస్సుగలవాఁడై,

తా, ఆధ్రువుఁడు తనకుగల సేవకులు, మంత్రులు, పురోహితులు బంధువులు, మిత్రులు, మేడలు, రత్నములు, పశువులు ఇవియివి అననేల సమస్తమును ననిత్యములని తలంచి, మనసువిరక్తిఁ బొందినవాఁడై(ముందుపద్యముతో నన్వయము)

సీ. పురము వెల్వడి చని ♦ పుణ్యభూబదరికా
ఘనవిశాలానదీ ♦ కలితమంగ
శౌంబుపూరంబుల ♦ ననురక్తిమైఁ గ్రుంకి
కమనీయపరిశుద్ధ ♦ కరణుఁ డగుచుఁ
బద్ధాసనస్థుఁడై ♦ పవనుని బంధించి
నెలకొని ముకుళిత ♦ నేత్రుఁ డగుచు
హరిరూపవైభవ ♦ ధ్యానంబు సేయుచు
భగవంతు నచ్యుతుఁ ♦ బద్మనేత్రు
తే. నందు సతతంబు నిశ్చల ♦ మైనయట్టి
భక్తిఁ బ్రవహింపఁ జేయుచుఁ ♦ బరమమోద
బాష్పధారాభిషిక్తుండు ♦ భవ్యయశుఁడుఁ
బులకితాంగుండు నగుచు ని ♦ ష్ఠులఁ దనర్చి. 156

అర్థ. పురమున్=పట్టణమును; వెల్వడి=విడిచి; చని=పోయి పుణ్యభూబదరికా, ఘన, విశాలానదీ=పుణ్యమునుకలిగించు బదరికా

శ్రమమునందలి విశాలయను నదిలో; కలిత, మంగళ, అంబుపూరంబుల న్ = స్వచ్ఛమయినట్టియు, మంగళకరము లయినట్టియు, నిండుజలముల యందు; అనురక్తిమైన్ = వేడుకతో; క్రుంకి = స్నానముచేసి; కమనీయ పరిశుద్ధ, కరణుండు, అగుచున్ = చక్కని శుద్ధమైన మనస్సుకలవాడయి; పద్మాసనస్థుండు, అయి = పద్మాసనమునువైచుకొని పవనుని, బంధించి = వాయునిరోధము చేసి, నెలకొని = పూనికతో; ముకుళిత, నేత్రుండు, అగుచున్ = కన్నులనుమూసికొని; హరిరూపవైభవ, ధ్యానంబున్ = శ్రీహరియొక్క దివ్యరూపధ్యానమును, చేయుచున్ = చేయుచు; భగవంతున్ = ఐశ్వర్యయుక్తుండయిన వానిని; అచ్యుతున్ = నాశనములేనివానిని, పద్మనేత్రున్ = పుండరీకాక్షుని; అంతన్ = అనంతరమునందు; సతతంబున్ = ఎల్లప్పుడును; నిశ్చలము, అయిన బుద్ధి = ఏకాగ్రమయిన; భక్తిన్ = భక్తిని; ప్రవహింపన్, చేయుచున్ = వ్యాపించునట్లు చేయుచు; పరమ, మోద, బాష్పధారా, అభిషిక్తుండు = ఆనందాశ్రువులచేత తడుపబడినవాండును; భవ్యయశుడు = గొప్పకీర్తిగల వాండును; పులకితాంగుండున్ = గగుర్పొడిచిన దేహముగలవాండును; అగుచున్ = అగుచు; ఇమ్ములన్, తనర్చి = ఎక్కువప్రీతితో.

తా. ధ్రువుండు బదరికాశ్రమమున పారుచున్న విశాలయను పుణ్యనదియందు స్నానముచేసి నిర్మలాంతఃకరణుండయి, పద్మాసనము వైచుకొని శ్వాసమునుబంధించి, కన్నులను మూసుకొని శ్రీహరి మంగళరూపమున నేకాగ్రభక్తితో ధ్యానించుచు ఆనందాశ్రువుల విడుచుచు ఒడలుగర్పొడువ (ముందువచ్యముతో నన్వయము)

వ. మఱియు విగతక్లేశుండును ముక్తలింగుండును నై ధ్రువుండు తన్నుం దా మఱచి యుండునవసరంబున దిశదిక్కుల నుద్యద్రాకానిశానాయకుండునుంబోలె వెలింగించుచు నాకాశంబుననుండియొక్క విమానంబు సనుదేర

బందు దేవశ్రేష్ఠులును జతుర్భుజులును రక్తాంబుజేక్షణు
లును శ్యామవర్ణులును గదాధరులును సువాసులును గిరీ
టహారాంగదకుండలధరులును గౌమారవయస్కులును
నుత్తమశ్లోకకింకరులు నయినవారల నిద్దఱం గని సంభ్ర
మంబున లేచి మధుసూదననామంబులు సంస్మరించుచు
వారల భగవత్కింకరులుగాఁ దలంచి దండప్రణామంబు
లాచరించిన విష్ణుపాదారవింద విన్యస్తచిత్తుండును గృ
తాంజలియు వినమితకంధరుండు నైనధ్రువుని గనుంగొని
పుష్కరనాభభక్తులైనసునందనందులు ప్రీతియుక్తులై
మందస్మితు లగుచు నిట్లనిరి. 158

అర్థ. మఱియున్ = ఇంకను; విగతక్లేశుండును = కష్టమును మఱచినవాఁడును; ముక్తలింగుండును = స్థూలదేహమును మఱచినవాఁడును; అయి, ధ్రువుండు = ధ్రువుండు, తన్నున్, తాన్, మఱచితన్నుతాను మఱచి, ఉదయసమయంబునన్ = ఉదయమునపుడు; దశదిక్కులన్ = పదదిక్కులను; ఉద్యత్, రాకా; నిశానాయకుండువలెన్. పోలెన్ = ప్రకాశించుచున్న చంద్రునివలె; వెలిగించుచున్ = ప్రకాశింపజేయుచు ఆకాశంబుననుండి = ఆకాశమునుండి, ఒక్కవిమానంబు, చనుదేరన్ = ఒక్కవిమానము రాఁగా; అందున్ = ఆవిమానమునందు; దేవశ్రేష్ఠులును = దేవతలలో ముఖ్యులును, చతుర్భుజులును = నాలుగేసిభుజములు గలవారును; రక్త, అంబుజ, ఈక్షణులును = ఎఱ్ఱతామరవంటి కన్నులుగలవారును, శ్యామవర్ణులును = చామనచాయగలవారును; గదాధరులును = గదలను ధరించినవారును, సువాసులును = మంగళాకారులును; కిరీట, హార అంగద, కుండల, ధరులును = కిరీటములు, హారములు, భుజకీర్తులు, కుం

డలములు ధరించినవారును; కౌమారనయుగ్మము = యౌవనవంతులును ఉత్తమశ్లోక కింకరులును, అయినవారలన్ = మంచి చరిత్రముగల భటులను; ఇద్దరన్ = ఇద్దరిని; కని = చూచి. సంభ్రమంబునన్ = తొట్రుపాటుతో; లేచి, మధుసూదను, నామంబులు = శ్రీహరి నామములను, సంస్మరించుచున్ = తలంచుచు; వారలన్ = వారిని; భగవత్, కింకరులను, కాన్ = విష్ణుదూతలనుగా; తలంచి = ఆలోచించి; దండప్రణామంబును ఆచరించినన్ = దండప్రణామము చేయఁగా; విష్ణుపాదాంబుజ, విన్యస్త, చిత్తుండున్ = విష్ణుమూర్తియొక్క పాదపద్మములందుంచఁబడిన మనస్సుగలవాఁడును; కృతాంజలియున్ = దోసిలొగ్గినవాఁడును; వినమిత కంధరుండున్ = వంచఁబడిన మెడగలవాఁడును; అయిన; ప్రభువున్ = ప్రభువును; కనుంగొని = చూచి; పుష్కరనాభ, భక్తులు, అయిన = పద్మనాభుని భక్తులయిన; సునందనందులు = సునందుఁడు, నందుఁడు అను విష్ణుకింకరులు; ప్రీతియుక్తులై = సంతోషించినవారయి, మందస్మితంబులు, అగుచున్ = మందహాసముతో; ఇట్లు, అనిరి = ఇట్లు పలికిరి.

తా. స్పష్టము.

ఉ. ఓనృప నీకుభద్రమగు ♦ నొప్పగుచున్న మదీయవాక్యముల్
వీనులయందుఁ జొన్పుము వి♦వేకముతో నయిదేండ్లనాఁడు మే
ధానిధివై యొనర్చి యు♦గ్రాద్భుతతపఃపరితుష్టి చేతఁ దే
జోనయశాలియైనమధు♦సూదనుఁ దృప్తి వహింపఁ జేయవే.

అర, ఓనృప = ఓ రాజా! నీకున్ = నీకు; భద్రము, అగున్ = మేలు కలుగును; ఒప్పగుచున్న = నీకుహితములయిన; మదీయవాక్యముల్ = మామాటలను; వీనులయందున్, చొన్పుము = చెవులబెట్టుము; వివేకముతోన్ = జ్ఞానముతో, అయిదేండ్లనాఁడు = ఐదేండ్లు బాలుఁడవైనప్పుడు, మేధానిధివై = గొప్పబుద్ధిగలవాఁడవయి; ఒనర్చి = చేసి, ఉగ్రాద్భుత, తపఃపరితుష్టిచేతన్ = గొప్పతపస్సును చేయుటచేత; తేజోనయశాలి, అయిన = తేజస్వంతుఁడైన; మధుసూదనున్ = విష్ణుమూర్తిని; తృప్తిన్, వహిం

పన్; చేయనే=సంతోషింపఁజేయవే?

తా. ఓరాజా! నీకు హితముగు నా టలను వినుము నీవైదేండ్ల పిల్లవాఁడవయి యున్నప్పుఁడు జ్ఞానవంతుఁడవయి, తపస్సుచేసి, శ్రీహరిని సంతోషపెట్టితివి

ఆ. అట్టి శార్ఙ్గపాణి ♦ యఖిలజగద్భర్త
దేవదేవుఁ డతుల ♦ దివ్యమూర్తి
మమ్ముఁ బనుప నేము ♦ మాధవపదమున
కర్థి నిన్నుఁ గొనుచుఁ జరుగుటకును 159

అర్థ. అట్టి=అటువంటి; శార్ఙ్గపాణి=విష్ణుమూర్తి; అఖిలజగ, ద్భర్త=సకలలోకాధినాథుఁడు, దేవదేవుఁడు=దేవతలకు ప్రభువు; అతుల, దివ్యమూర్తి=సాటిలేని మంగళాకారముగలవాఁడు, మమ్మున్ పనుపన్=మమ్ము పంపఁగా; ఏము; మాధవపదమునకు=వైకుంఠమునకు అర్థిన్=కోరికతో; నిన్నున్=నిన్ను; కొనుచున్=తీసికొని; అరుగుటకును=వెళ్లుటకు

తా. దేవాదిదేవుఁడైన శ్రీమహావిష్ణువు మమ్ము పంపఁగా మేము నిన్ను వైకుంఠమునకు తీసికొనవచ్చుటకు (ముందుపద్యముతో నన్వయము)

వ. వచ్చితిమి యీపదంబు నీవు సూరిజనంబులు సర్వోత్తమం బని పొగడుచుందురు దేనిఁ జంద్రదివాకరగ్రహనక్షత్ర తారాగణములు ప్రదక్షిణంబుగాఁ దిరుగుచుండు మఱియు నీదుపితరుల చేతను నన్యుల చేతను నప్రాప్తితంబును జగద్వంద్యంబును భక్తజనాతిదుర్లభంబును నయినవిష్ణు పదంబుం బొందుటకు రమ్ము దే విమానశ్రేష్ఠం బుత్తమ శ్లోకజనమౌళిమణి యైన శ్రీహరి పుత్తెంచె దీని నెక్కను ర్హుండవనిన సునీతిప్రియపుత్రుండయినధ్రువుండు తన్మధు

రవాక్యంబులు విని కృతాభిషిక్తుండయి యచ్చటిమునుల కుఁ బ్రణమిల్లి తదాశీర్వాదంబులు గైకొని విమానంబు నకుం బ్రదక్షిణార్చనంబులు గావించి హరిపార్షదులైన సునందనందులకు వందనం బాచరించి భగవద్రూపవిస్ఫు స్ఫుచతురంతగకరణాదికుండగుచు విమానాధిరోహణం బు గావించుటకు హిరణ్మయరూపంబు ధరియించె నప్పుడు

ఆర్థ. వచ్చితిమి=వచ్చినాము; ఏపదంబున్, ఏఁన్=ఏస్థానము ను; సూరిజనంబులు=బుద్ధిమంతులు; సర్వోత్తమంబు, అని=అన్నిటి కంటె నుత్తమస్థానమని; పొగడుదురు=చెప్పుచుందురో; దేనిన్=దేని చంద్ర, దివాకర, గ్రహ, నక్షత్ర, తారాగణంబులు=సూర్యచంద్రు లును, గ్రహములును; నక్షత్రములును, తారలును ప్రదక్షిణముగాన్, తిరు గుచుండున్=చుట్టుతిరుగుచుండునో; మతిగనున్; ఇంకను, నీదు, పితరులచేతను=నీపూర్వులచేతను; అన్యులచేతను=ఇతరులచేతను, అనధి ష్ఠితంబును=పొందఁబడనట్టిదియు; జగద్వంద్యంబును=జగత్తుచేత పూ జింపఁబడునదియు; భక్తజన, అతి, దుర్లభంబును=భక్తులచేత నతికష్ట ముతో సంపాదింపఁబడునదియు, అయిన విష్ణుపదంబున్=అయినట్టి ధ్రువమండలమును; పొందుదువు=చేరుదువు; రమ్ము; ఇదే=ఇదిగో; వి మానశ్రేష్ఠంబు=శ్రేష్ఠమైన విమానము; ఉత్తమశ్లోక, జన, మౌళిమణి అయిన=ఉత్తమచరిత్రులగు; జనులకు, తలమానికము వంటివాఁడగు; శ్రీహరి=శ్రీమహావిష్ణువు; పుత్తెంచెన్=పంపినాఁడు, దీనిన్, ఎ క్కన్; అర్హుండవు=దీని నెక్కుటకు తగినవాఁడవు; అనినన్=అనగా; ఉరుక్రమ, ప్రియుండు, అయిన, నృపుండు=విష్ణుమూర్తికి ప్రియుండై యున ధ్రువుఁడు, తత్ మనుగవాక్యంబులు; విని=ఆతీయని మాటలనువిని ఆకృతఅభిషిక్తుండు, అయి=స్నానముచేసి; అచ్చటిమునులకున్, ప్రణ మిల్లి=అచ్చటిమునులకు నమస్కరించి, తత్, ఆశీర్వాదంబులు, గైకొని= వారిఆశీర్వచనములను స్వీకరించి; విమానంబునకున్=ఆవిమానమున

ప్రదక్షిణ, అర్చనంబులు, కావించి=ప్రదక్షిణమును, పూజలు చేసి; హరి పార్షదుల, అయిన=విష్ణుభటులైన; సునందనందులకున్=సునందుఁడు నందుఁ డనునను వారికి; వందనంబాచరించి=నమస్కరించి; భగవత్ రూప, విన్యస్త, నయన, అంతఃకరణ, ఆదికుండు, అగుచున్=భగవంతుని రూపమందు కన్నులు, మనస్సు మొదలగువాని నుంచినవాఁడయి; విమాన, అధిరోహణంబు, కావించుటకున్=విమానము నెక్కుటకు; హిరణ్మయ, రూపంబున్, ధరియించెన్=బంగారు వికారమైనరూపమును దాల్చెను; అపుడు=అప్పుడు

తా. స్పష్టము;

క. సురదుందుభిపణవానక
మురజాదులు మొరసె విరుల ♦ ముసురు గురిసెఁ గి
న్నరగంధర్వులపాటలు
భరితములై చెలఁగె నపుడు ♦ భవ్యచరిత్రా. 161

అర్థ. సుర=దేవతలయొక్క; దుందుభి, పణవ, ఆనక, మురజ, ఆదులు=భేరులు; తప్పెటల, ఢక్కలు, మద్దెలలు, మొదలైనవి. మొరసెన్=ధ్వనించెను; విరుల, ముసురు, గురిసెన్=పుష్పవర్షము కురిసెను; భవ్యచరిత్రా=పూజ్యచరిత్రుఁడవగు విదురుఁడా!; అపుడు; కిన్నరగంధర్వుల; పాటలు=కిన్నరులయొక్కయు, గంధర్వులయొక్కయు పాటలు; భరితములై; అంతటను నిండినవై; చెలఁగెన్=అతిశయించెను.

తా. అపుఁడు సురదుందుభులు మొదలగువాద్యములు మ్రోగెను పుష్పవర్షము కురిసెను. కిన్నరగంధర్వులు దివ్యగానములను చేసిరి.

వ. అట్టిసమయంబున ధ్రువుండు దుర్గమం బగుత్రివిష్టపంబునకు నేఁగువాఁ డగుచు దీనయగుజననిం దిగనాడి యెట్లు వోవుదునని చింతించుచున్నసం బార్షదు లవలోకించి యగ్రభాగంబున విమానారూఢయై యేఁగుచున్నజననిం జూపిన సంతుష్టాంతరంగుం డగుచు.

అర్థ. అట్టిసమయంబునన్=అటువంటిసమయమునందు; ధ్రువుండు=ధ్రువుండు; దుర్గమంబు, అగు=చేరశక్యముగానిదగు; త్రివిష్టపంబునకున్=వైకుంఠమునకు; ఏఁగువాఁడు, అగుచున్=పోవుచు; దీన, అగు, జననిన్=దీనురాలైన తల్లిని; ఎగనాడి=విడిచిపెట్టి; ఎట్లుఁబోవుదున్, అని=ఎట్లువెళ్ళఁగలనని, చింతించువానిన్=ఆలోచించుచున్న ధ్రువుని, పార్షదులు=విష్ణుభటులు; అవలోకించి=చూచి; అగ్రభాగంబునన్=తనముందు, విమాన, ఆరూఢ, అయి=విమానము నెక్కి, ఏఁగుచున్న=వెళ్ళుచున్న, జననిన్=తల్లిని, చూపినన్=చూపఁగా; ఆసంతుష్ట అంతరంగుండు, అగుచున్=సంతోషించిన మనస్సుగలవాఁడై;

తా. స్పష్టము.

క. జనని సునీతిని ము న్నిడి
కొని యతులవిమాన మెక్కి ♦ గొనకొని విబుధుల్
దనమీఁదఁ బుష్పవర్షము
లనయముఁ గురియింప ధ్రువుఁడు ♦ హర్షముతోడన్ 163

అర్థ. జనని, సునీతిని=తల్లియైనసునీతిని; మున్నిడికొని=తనకు ముందరగానుంచుకొని; అతులవిమానము, ఎక్కి=సాటిలేని విమానము నెక్కి, గొనకొని=కోరికతో; విబుధుల్=దేవతలు; తనమీఁదన్=తనమీఁద; పుష్పవర్షములు=పూలవానలు, అనయమునన్=తఱచుగా; కురియింపన్=కురియింపఁగా; ధ్రువుండు; హర్షముతోడన్=ఎక్కువఆనందముతో

తా. తల్లినిముందుంచుకొని విమానమెక్కి, దేవతలు పుష్పవర్షములు కురియించుచుండఁగా ధ్రువుఁడు పరమానందముతో (ముందుపద్యముతో నన్వయము)

క. చని చని వెస గ్రహమండల
మును ద్రైలోక్యంబు సప్త ♦ మునిమండలమున్
ఘనుఁ డుత్తరించి యవ్వలఁ
దనరెడుహరిపదము నొందెఁ ♦ దద్దయుఁ బ్రీతిన్. 164

అర్థ. చని చని=పోయిపోయి; వెసన్=శీఘ్రముగా; గ్రహమండలమును=గ్రహములను; త్రైలోక్యంబు=మూఁడులోకములను; సప్తమునిమండలమున్=సప్తఋషిమండలమును; ఘనుఁడు=మహానుభావుఁడు; ఉత్తరించి=దాఁటి; అవ్వలన్=అవల; తనరెడు=ఒప్పుచున్న; హరిపదమున్=ధ్రువమండలమును, ఉద్ధతిన్; ప్రీతిన్=మిక్కిలి వేడుకతో; పొందెను=చేరెను.

తా. అట్లాతఁడు పోయిపోయి, గ్రహమండలమును, త్రిలోకములను, సప్తఋషిమండలమును దాఁటి యావలనున్న ధ్రువమండలమును చేరెను.

వ. అది మఱియు నిజకాంతిచేతం ద్రిలోకంబులం బ్రకాశింపం జేయుచు నిర్దయాగమ్యంబును శాంతులు సమదర్శనులు శుద్ధులు సర్వభూతానురంజనులు నచ్యుతభక్తబాంధవులు నయినభద్రాచారులకు సుగమ్యంబును నయి గంభీరవేగంబు ననిమిషంబు నగుజ్యోతిశ్చక్రంబు సమాహితంబై గోగణంబు మేధియందుంబోలె నెందుఁ బరిభ్రమించు చుండ నట్టియచ్యుతపదంబునం దిష్ణుపరాయణుండైన ధ్రువుండు త్రిలోకచూడామణియై యొప్పుచుండె నప్పుడు భగవంతుండైన నారదుండు ధ్రువుని మహిమం గనుంగొని ప్రచేతస్సత్త్రంబునందు వీణ వాయించుచు. 165

అర్థ. అది=ఆధ్రువమండలము; మఱియున్=ఇంకను; నిజకాంతిన్=తనకాంతిచేత; త్రిలోకంబులన్=మూఁడులోకములను; ప్రకాశింపన్, చేయుచున్=వెలుఁగఁజేయుచు; నిర్దయాగమ్యంబును=దయారహితులైనవారిచేత చేరరానిదియు; శాంతులు, సమదర్శనులు, సర్వభూతానురంజ

నులు, అచ్యుత, భక్త, బాంధవులు = [illegible] గలవారును, సుఖదుఃఖము
లను ఒక్కరీతిగా చూచువారును, పవిత్రులును, సర్వభూతములను సం
తోషింపచేయువారును, విష్ణుభక్తులచుట్టములును; అయిన, భద్ర, ఆచారు
లకున్ = శుభచరిత్రముగలవారికి; సుగమ్యంబును, అయి = చేరవీలుగా
నుండి; గంభీరవేగంబును = గొప్పవేగమును; అనిమిషంబును = ఒక్కనిమి
షమైన ఆగనిదెయు; అగు = అయిన; జ్యోతిస్, చక్రంబు, = కాంతిచ
క్రము; సమాహితంబై = చక్కగా; గోగణంబు = గోవులసమూహము;
మేధియందున్, పోలెన్ = కట్టుకంబమునందువలె; ఎందున్ = ఎప్పుడును,
పరిభ్రమించుచుండున్ = తిరుగుచుండునో; అట్టి = అటువంటి; అచ్యుత,
పదంబునన్, పొందె = [illegible] చేరె; విష్ణుపరాయణుండు, అయి
విష్ణువునందే మనస్సును చేర్చిన; ధ్రువుండు = ధ్రువుఁడు; త్రిలోకచూడా
మణి, అయి = మూఁడులోకములకును తలమానికము; ఒప్పుచుండెన్ =
ఒప్పుచుండెను; అప్పుడు; భగవంతుండు, అయిన నారదుండు, = పూజ్యుఁ
డైన నారదుఁడు; ధ్రువుని, మహిమన్ = ధ్రువుని మహాత్మ్యము, కనుం
గొని = తెలిసికొని; ప్రచేతస సత్రంబునందున్ = ప్రచేతస సత్రయాగ
మునందు. వీణవాయించుచు = వీణనుమీటుచు,

తా. స్పష్టము,

సీ. పతియె దైవంబుగాఁ ♦ భావంబులోపలఁ
దలఁచుసునీతి సం ♦ దనుతపఃప్ర
భావముక్రియ భక్తి ♦ భవ్యనిష్ఠలఁ బొందఁ
జాలరు బ్రహ్మర్షి ♦ జనము లరయ
క్షత్త్రియకులు నెన్నఁ ♦ గా నేల యెవ్వఁడు
పంచసంవత్సర ♦ ప్రాయమునను
సురుచి దురుక్త్యగ్ర ♦ శరభిన్నహృదయుఁడై
మద్వాక్యహితబోధ ♦ మతిఁ దనర్చు

తే. వనమునకు నేఁగి హరిభక్తి ♦ వశత నొంది
యజితుఁ డగుహరి తనవశుఁ ♦ డై చరింపఁ
జేసి వేసఁ దత్పదంబును ♦ జెందె నట్టి
హరిపదంబును బొందంగ నెవ్వరికిఁ దరము. 166

అర్థ. పతియె=భర్తయే, దైవంబుగాన్=దేవునిగా; భావంబులోపలన్=మనస్సులో; తలఁచు=భావించు; సునీతినందను=సునీతికుమారుఁడైన ధ్రువునియొక్క, తపః ప్రభావము క్రియన్=తపోమహిమవలె; బ్రహ్మఋషిజనములు=బ్రహ్మఋషులుగూడ; ధర్మపవిత్రితంబులన్=ధర్మముచేత పవిత్రములయిన, ఆచారమును, పొందఁజాలరు; అనినన్=అనఁగా; క్షత్రియకులుని=క్షత్రియకులమునందు పుట్టినవానిని; ఎన్నఁగాన్, ఏల=లెక్కింపనక్కరలేదు; ఎవ్వఁడు=ఎవఁడు; పంచసంవత్సరప్రాయమునను=ఐదేండ్లవయసున; సురుచి,దురుక్తి, ఉగ్ర,శర, భిన్న,హృదయుఁడు, అయి=సవతితల్లియైన సురుచియొక్క దుర్భాషలను బాణములచే భేదింపఁబడిన మనస్సుగలవాఁడై, మద్వాక్యబోధన్=నామాటలయందలి మంచి యుపదేశమును; మతిన్,తనర్చి=మదిలో పెట్టుమని; వనమునకును, ఏఁగి=అడవికిపోయి; హరిభక్తివశతనొంది=శ్రీహరికిభక్తివశుఁడై; అజితుఁడు, అగుహరి,=ఒకనికిం దెవరిచేతను జయింపఁబడని శ్రీహరి; తనవశుఁడై, చరింపన్, చేసి=తనకువశుఁడై తిరుగునట్లు చేసి; వేసన్=వేగముగా; తత్పదంబును=విష్ణుపదమైన ధ్రువమండలమును; చెందెన్=పొందెను, అట్టి=అటువంటి; హరిపదంబును=ధ్రువమండలమును, పొందన్=చేరుటకు, ఎవ్వరికిన్. తరము=ఎవరికిశక్యముకదు?

తా. బ్రహ్మఋషులయినను ధ్రువునివలె తపోమహిమను సంపాదింపఁజాలరన సాధారణ క్షత్రియులమాట వేఱుచెప్పనేల? ఆధ్రువుఁడు ఐదేండ్లబాలుఁడయి యున్నపుడే సవతితల్లి యాడినమాటలకునొచ్చి, అడవికేఁగి, శ్రీహరిని తనవశము చేసికొని, విష్ణుపదమునుపొంద నెవరితరము?

క. అని పాడె ననుచు వినునన
ఘనుఁడు మైత్రేయుఁ డనియె ♦ సంచితభక్తిన్
వినుతోద్దామయశస్కుం
డనఁ గలయాధ్రువుచరిత ♦ మార్యస్తుత్యా. 167

టీ. అని, పాడెను, అనుచును = అని గానము చేసెనని, వినునన = వినుమనితో. ఘనుఁడు, మైత్రేయుఁడు = మహానుభావుఁడైన మైత్రేయుఁడు; ఆర్యస్తుత్యా = పెద్దలపొగడఁదగు పాత్రుఁడవయిన పరీక్షిన్మహారాజా!; సంచితభక్తిన్ = నిర్మలమయినభక్తితో; వినుత, ఉద్దామ, యశస్కుండు, అనఁగల = గొప్పకీర్తిగలవాఁడు అనఁదగు ధ్రువుని చరిత్రమును; అనియెన్ = చెప్పెను.

తా. ఓ పరీక్షిన్మహారాజా! నారదుఁడట్లు గానము చేసెనని మైత్రేయుఁడు వినుమనితో భక్తిపూరితుఁడై చిరకీర్తిగాంచిన యాధ్రువుని చరిత్రమును జెప్పెను.

— ఫలశ్రుతి —

సీ. సుమహితసత్పురుష ♦ సమ్మతమును ధన్యంబు
స్వర్గప్రదంబు యశ ♦ స్కరంబు
ఆయుష్కరంబుఁ బు ♦ ణ్యప్రదాయకమును
మంగళకర మఘ ♦ మర్షణంబు
సౌమనస్యముఁ బ్రశం ♦ సాయోగ్యమును బాప
హారమును ధ్రువపద ♦ ప్రాపకంబు
నై యొప్పునీయుపా ♦ ఖ్యానంబుఁ దగ నీకు
నెఱిఁగించితిని దీని ♦ నెవ్వఁ డేని

తే. తివుట శ్రద్ధాగరిష్ఠుఁడై ♦ తీర్థపాద
చరణసరసీరుహద్వయా ♦ శ్రయుఁడు నైన
భవ్యచరితు దినాంత ప్రభాతవేళ
నలఘుమతిఁ బూర్ణిమామావాస్య ♦ లందు మఱియు. 168

అర్థ. మహిత, సత్పురుష సన్నుతమును=సజ్జనులైన మహానుభావులకు; ప్రీతికరమైనదియు; ధన్యంబు=కృతార్థతను కలిగించునదియు; స్వర్గప్రదంబు=స్వర్గమునిచ్చునదియు; యశస్కరంబు=కీర్తిని కలుగజేయునదియు, ఆయుష్కరంబు = ఆయుర్వృద్ధిని కలుగజేయునదియు; పుణ్యప్రదాయకమును=పుణ్యమునిచ్చునదియు; మంగళకరము =శుభములను కలుగజేయునదియు; అఘమర్షణంబు=పాపములను కడగివేయునదియు; సౌమనస్యము=మంచిమనస్సులు కలుగజేయునదియు; ప్రశంసాయోగ్యమును=ప్రశంసింపఁదగినదియు పాపహరమును= పాపములు పోగొట్టునదియు; ధ్రువపదప్రాపకంబు=నిలుకడయైనపదవిని (వైకుంఠమును) పొందించునదియు; ఐ; ఒప్పు=ఒప్పునట్టి ఈ, ఉపాఖ్యానంబున్=ఈకథను; తగన్=బాగుగా; నీకున్=నీకు, ఎఱిఁగించితిని=తెలిపితిని; దీనిన్=దీనిని; ఎవ్వఁడేనన్=ఎవ్వఁడైనను, తివుటన్=ఆసక్తితో; శ్రద్ధాగరిష్ఠుఁడయి=ఎక్కువశ్రద్ధతో; తీర్థపాద, చరణ, సరసీరుహ, ద్వయ=పుణ్యములగు పాదములుగల, లేదా, గంగయుద్భవించిన పాదములుగల; శ్రీహరి పాదపద్మములజంటను; ఆశ్రయుఁడును, అయి=ఆశ్రయించినవాఁడును ఆయి; భవ్యచరితున్ =పుణ్యచరిత్రముగల ధ్రువుని; దినాంత, ప్రభాత వేళన్ =సాయంకాలమందును; ఉదయమునను; అలఘుమతిన్ =మంచిబుద్ధితో పూర్ణిమ అమావాస్యలందున్, పున్నమనాఁడును అమావాస్యనాఁడును; మఱియున్ =ఇంకను; (ముందుపద్యముతో నన్వయము)

తా. ఈకథ, సజ్జనసన్నుతము, పవిత్రము, యశస్కరము, ఆయు

ప్కారము, పాపహరమునైనది. దీనిని నీకెఱింగించితిని శ్రీవిష్ణుభక్తులలో నగ్రేసరుడైన యీ ధ్రువుని, ప్రాతఃకాల సాయంకాలములయందును, పున్నమ అమావాస్యలందును ఇంకను (ముందుపద్యముతో నన్వయము).

తే. ద్వాదశిని పద్మబాంధవ ♦ వాసరమున
శ్రవణనక్షత్రమున దిన ♦ క్షయమునందుఁ
బరఁగ సంక్రమణవ్యతీ ♦ పాతలందు
సభలభక్తిని వినునట్టి ♦ సజ్జనులకు. 169

అర్థ. ద్వాదశిని=ద్వాదశినాఁడును; పద్మబాంధవవాసరమునన్ = ఆదివారమునాఁడును; శ్రవణనక్షత్రమునన్=శ్రవణనక్షత్రమందును; దినక్షయమునందున్=క్షయతిథినాఁడును; పరఁగన్=బాగుగా; సంక్రమణ=సంక్రమణమును; వ్యతీపాతలందున్ = వ్యతీపాత యోగములందును; సభలన్=సభలలో; భక్తితో, వినునట్టి, సజ్జనులకు=వినుసత్పురుషులకు (ముందుపద్యముతో నన్వయము)

తా. ద్వాదశి, ఆదివారము, శ్రవణనక్షత్రము, క్షయతిథి, సంక్రమణము, వ్యతీపాదయోగము, ఇట్టిసమయములందు సభలలో భక్తితోవినునట్టి సత్పురుషులకు (ముందుపద్యముతో నన్వయము).

వ. క్లేశనాశంబును మహాప్రకాశంబును నైనభగవద్భక్తియు శీలాదిగుణంబులును గలుగు మఱియుఁ దేజఃకాముకునకుఁ దేజంబును మనసికాముకునకు ధనంబును నిష్కామునకుఁ దత్త్వవిజ్ఞానంబును గలుగు దీని వినుపించువారికి దేవతానుగ్రహంబు గలుగు నిట్టియుపాఖ్యానంబు నీకెఱింగించితి నని మైత్రేయుండు విదురునకుఁ జెప్పెనక్రమంబున శుకయోగి పరీక్షిత్తున కెఱింగించె.

ఆర్తక్లేశ నాశనంబును = దుఃఖమును పోఁగొట్టునదియు; మహాప్రకాశంబును = గొప్ప వెలుతురు నిచ్చునదియు; అయిన; హరిభక్తియు = విష్ణుభక్తియు; శీల ఆది గుణంబులును = సదాచారము మొదలైన సద్గుణములును, కలుగుఁ = కలుగును; మఱియున్ = ఇంతేకాక; తేజస్కామునకు = తేజస్సు కోరువానికి; తేజంబును = తేజస్సును; మానకాముకున్ = మర్యాద కావలసిన వానికి; మానంబును = మర్యాదయును; నిష్కాముకున్ = కోరిక లేనివానికి; తత్త్వవిజ్ఞానంబును = బ్రహ్మజ్ఞానమును; కలుగ కలుగను, దీనిన్ = కథను; వినుపించువారికిన్ = చెప్పువానికి; దేవత అనుగ్రహంబు, కలుగున్ = దేవతలయొక్క అనుగ్రహము కలుగును; ఇట్టి ఉపాఖ్యానంబున్ = ఇట్టి కథను; నీకు, ఎఱింగించితిన్, అనున్ = నీకు తెల్పితిననుచు; మైత్రేయుండు, విదురునకున్. చెప్పిన, క్రమమునన్ = మైత్రేయుండు విదురునకు చెప్పిన రీతిగా; శుకమహర్షి; పరీక్షిత్తునకున్ = పరీక్షిన్మహారాజునకు ఎఱిగించెన్ = తెలిపెను;

తా. దుఃఖమును పోఁగొట్టునదియు, గొప్ప ప్రకాశము గలదియు నగు, భగవద్భక్తియు, సద్గుణములును కలుగును. తేజస్సు కావలసినవానికి తేజస్సును మర్యాద కావలసిన వానికి మర్యాదయు, కోరికలు లేనివానికి బ్రహ్మజ్ఞానమును కలుగును. దీనిని వినుపించువారికి దేవతలయనుగ్రహము కలుగును, అట్టి కథను నీకు తెల్పితినని మైత్రేయుండు విదురునకు చెప్పిన రీతిగా శుకుఁడు పరీక్షిన్మహారాజునకు తెలిపెను.

ధ్రువోపాఖ్యానము

సంపూర్ణము.